ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 28.07.2025 | సంపుటి : 12 సంచిక : 09 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## నేడు పార్లమెంట్‌లో సిందూర్

# మంటలు

### అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్న ప్రతిపక్షాలు

- ఈ అంశంపై సమాధానం ఇవ్వనున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా,రక్షణమంత్రి రాజ్‌నాథ్, జైశంకర్
- చర్చకు ఉభయసభల్లో చెరో 16 గంటలు కేటాయింపు

## ఉభయసభల్లో చర్చకు అంతా రె'ఢీ'

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పార్లమెంట్‌లో పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి లోక్‌సభలో, మంగళవారం నుంచి రాజ్యసభలో చర్చ జరగనుంది. ఈ అంశంపై ఉభయసభల్లో చెరో 16 గంటలు కేటాయించారు. పహల్గాం ఉగ్ర దాడి వెనుక నిఘా వైఫల్యం, ట్రంప్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు వంటి అంశాల ఆధారంగా ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టాలని విపక్షాలు యత్ని స్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో 100 శాతం లక్ష్యాలు సాధిం చామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద వ్యతిరేక పోరు లో తమ దృఢమైన వైఖరిని మరోసారి తెలియజేయనుంది. పార్ల మెంట్




వర్షాకాల సమావేశాల తొలివారం బిహార్ ఓటరు జాబి తా సవరణ సహా వివిధ అంశాలపై విపక్షాల ఆందోళనలతో ఉభ య సభల్లో వాయిదాల పర్వం నడిచింది. సభా కార్యకలాపాలు సాగలేదు. కానీ సోమవారం నుంచి సభ సజావుగా సాగేందుకు అధికార, విపక్షాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం పార్ల మెంట్‌లో చర్చ ప్రారంభం కానుంది. జాతీయ భద్రత, విదేశాంగ విధానానికి సంబంధించిన ఈ చర్చ వాడీవేడిగా సాగే అవకాశం ఉంది.కేంద్ర ప్రభుత్వం తరఫున హోంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్,

మిగతా 2లో..






## మన రైతులపై భాజపాకు ఎందుకంత కోపం?

### యూరియా సరఫరాలో అన్యాయం

- మమ్మల్ని బద్నాం చేసేందుకు రైతులకు అన్యాయం చేయొద్దు
- కేంద్రంతో అనేక దఫాలుగా చర్చించిన ఫలితం లేదు
- వారి ప్రకటనలకు, సరఫరాకు చాలా తేడా ఉంది
- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడికి కూడా లేఖ రాశాం : మంత్రి తుమ్మల

**భద్రాద్రి కొత్తగూడెం(జనంసాక్షి):** యూరియా సరఫరాపై కేంద్రంతో ఏప్రిల్ నుంచి అనేక దఫాలుగా చర్చించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సంప్రదింపులు జరిపినా యూరియా సరఫరాలో కేంద్రం నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సంద

ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగం, యూరియా కొరతపై డిప్యూటీ సీఎం, మంత్రుల సమీక్ష

ర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9.8 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారన్నారు. జూన్‌లో 45 శాతం లోటు ఉందని తెలిపారు.

మిగతా 2లో..

### ఎరువుల కొరతపై బహిరంగ చర్చకు మంత్రి తుమ్మల సిద్ధమా?

- తెలంగాణలో భాజపా ఒంటరిగానే పోటీ చేస్తాం
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

2లో

### అన్నీ ఆలోచించే భాజపాకు రాజీనామా చేశా

ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్(జనంసాక్షి):** తాను అన్నీ ఆలోచించే భాజపాకు రాజీనామా చేశానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. భాజపాలో తిరిగి చేరేందుకు తాను ప్రయత్నిస్తు న్నట్లు.. కార్యకర్తల బృందాన్ని రాష్ట్ర కార్యాలయానికి పంపినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని

మిగతా 2లో..



## మలి వయసులో మేమున్నామని..

### వయో వృద్ధులకు తీపికబురు

- మల్టీసర్వీస్ డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా 37 కేంద్రాల ఏర్పాటు
- రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వాహణ
- అందుబాటులో డాక్టర్లు.. ఉచితంగా హెల్త్ చెకప్.. మందులు అందజేత

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో రాష్ట్రంలో వయోవృద్ధుల సంక్షేమం కోసం మల్టీసర్వీస్ డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కుటుంబ సభ్యులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఒంటరి జీవితాన్ని గడుపుతున్నవారి కోసం దాదాపు 37 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.పగటి పూట అంతా వృద్ధులు ఈ కేంద్రాల్లో సేదతీరవచ్చు. అటల్ వయో అభ్యుదయ యోజన నిబంధనల మేరకు ఈ డేకేర్ సెంటర్లు నిర్వహించేందుకు సిద్ధం చేసిన దస్త్రంపై ఇప్పటికే మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి

మిగతా 2లో..



## జైపాల్ రెడ్డికి ఘన నివాళి



- రాష్ట్ర, దేశ రాజకీయాల్లో ఆయన ఒక ఉన్నత శిఖరం
- ప్రజాస్వామ్యం, రాజకీయాల పట్ల లోతైన అవగాహన ఉన్న వ్యక్తి : సీఎం రేవంత్

**హైదరాబాద్(జనంసాక్షి):**ఉత్తమ పార్లమెం టేరియన్, మాజీ కేంద్రమంత్రి, సూదిని జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి ఒక ఉన్నత శిఖరం, ప్రజాస్వామ్యం, రాజకీయాల పట్ల లోతైన అవగాహన ఉన్న వ్యక్తి జైపాల్ రెడ్డి అని అన్నారు. ప్రతి అంశంపై అద్భుతమైన వాగ్ధాటి, చతురత ఆయన సొంతమన్నారు. విద్యార్థి నాయకుడిగా,

మిగతా 2లో..



## ఆలయంలో అపశ్రుతి..

### హరిద్వార్‌లోని మానసాదేవి ఆలయం వద్ద తొక్కిసలాట

ఆరుగురి భక్తుల మృతి.. పలువురికి గాయాలు

**హరిద్వార్(జనంసాక్షి):**ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌లోని మానసాదేవి ఆలయం వద్ద అపశ్రుతి చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరావడంతో..తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడినట్లు గఢ్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి



మిగతా 2లో..

## మేం ఏ పార్టీలోనూ కలవం



### కాంగ్రెస్ వచ్చాక ఎరువులకు కరువొచ్చింది

- కమీషన్లు వచ్చే చోటనే కాంగ్రెస్ పాలకులు పనిచేస్తున్నారు
- గ్యారంటీల పేరుతో ప్రజలను బురిడీ కొట్టించారు : కేటీఆర్

**వరంగల్(జనంసాక్షి):** భాజపాలో భారత రాష్ట్ర సమితి విలీనం కోసం ప్రయత్నాలు జరిగాయంటూ భాజపా ఎంపీ సీఎం రమేశ్ చేసిన ఆరోపణలపై ఆ పార్టీ కార్య నిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు.తాము ఎవరితోనూ కలిసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "తెలంగాణ ఉన్నంతకాలం భారత రాష్ట్ర సమితి ఉంటుంది. పాలిచ్చే బర్రెను పక్కనపెట్టి దున్నపోతును తెచ్చుకున్నారు. మేం కరోనా సంక్షోభంలోనూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆపలేదు. ఇప్పుడు రాష్ట్రంలో ఎరువుల కోసం యుద్ధం చేయాల్సి వస్తోంది. కేసీఆర్ మరోసారి సీఎం అయ్యాక మన కష్టాలు తొలిగిపోతా యి"అని పేర్కొన్నారు.కాంగ్రెస్ పాలకులు డబ్బులు దండుకోవడానికే పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌లో టెండర్ పేరుతో రూ.170కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. టెండర్లు పిలిచి ప్రజాధనం లూటీ చేశారని అన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా పరకాలలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కేటీఆర్ కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడు తూ.. పరకాలలో జరుగుతున్న అవినీతిపై అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు.కమీషన్లు వచ్చే చోటనే కాంగ్రెస్ పాలకులు పనిచేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గృహలక్ష్మీ పథకం కింద పరకాల మహిళలకు 3వేల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. పథకం పేరు మార్చి లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్

మిగతా 2లో..

### సీఎం రమేష్ ప్రశ్నలకు జవాబు చెప్పు

కేటీఆర్‌కు కాంగ్రెస్,బీజేపీ నేతల డిమాండ్

12లో

### సీఎం రమేష్ వ్యాఖ్యలు వాస్తవమే

**హైదరాబాద్(జనంసాక్షి):**భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై భాజపా ఎంపీ సీఎం రమేశ్ చేసిన ఆరోపణలు వాస్తవమే అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సీఎం రమేశ్ సవాల్‌కు కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. వారిద్దరి మధ్య బహిరంగ చర్చ ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. 'కేటీఆర్‌తో చర్చకు సీఎం రమేశ్‌ను నేను తీసుకొస్తా. బహిరంగ చర్చకు తదీ, సమయం కేటీఆర్ చెప్పాలి. భారత రాష్ట్ర సమితి కుటుంబ

మిగతా 2లో..





## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు

### మాపై కోపముంటే మమ్మల్ని జైల్లో పెట్టండి: హరీశ్

- గురుకులాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా పట్టింపులేదా?
- ఢిల్లీ వెళ్లడానికి సమయం ఉంటుంది కానీ.. విద్యార్థుల
- సమస్యలపై చర్చించడానికి లేదా? అని ఆగ్రహం

**నాగర్‌కర్నూల్(జనంసాక్షి):** 'సీఎం రేవంత్‌రెడ్డి.. మాపై కోపం ఉంటే జైల్లో పె ట్టండి.. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవ ద్దు"అని మాజీ మంత్రి, భారత రాష్ట్ర స మితి నేత హరీశ్‌రావు అన్నారు.

మిగతా 2లో..

### గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్

- 79 మంది బాలికలకు అస్వస్థత
- ఆస్పత్రికి తరలించిన అధికారులు
- నాగర్‌కర్నూల్‌లోని ఉయ్యాలవాడలో ఘటన

2లో

### ఆస్ట్రేలియాలో మరో ఘాతుకం

భారతీయ విద్యార్థిపై కత్తితో దాడి చేసిన దుండగులు

ఘటనలో సౌరభ్ ఆనంద్‌కి తీవ్రగాయాలు.. తెగిపడిన చేయి

### కొండాపూర్‌లో రేవ్ పార్టీ..

డ్రగ్స్ స్వాధీనం

11 మందిపై కేసు



పై వార్తల వివరాలు 2 లో

### శత్రువులకు భారత్ సేఫ్ కాదని

## ఆపరేషన్ సిందూర్ నిరూపించింది

### ప్రధాన మంత్రి మోదీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారతదేశం– తన సార్వభౌమాధికారంపై దాడి జరిగితే, ఎలా స్పందిస్తుందో ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి చూపించిందని ప్రధాని మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ దేశవ్యాప్తంగా కొత్త ఆత్మవిశ్వాసాన్ని సృష్టించిందని, దీని ద్వారా భారత్ బలం ప్రపంచానికి తెలిసిందని ఆయన అన్నారు.'భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకునే శత్రువులకు, ఉగ్రవాదులకు ఇక ఇది ఏమాత్రం స్వర్గధామం కాదని ఆపరేషన్ సిందూర్ నిరూపించింది. నేను హెలీప్యాడ్ నుంచి అక్కడకు వచ్చినప్పుడు, 3–4 కి.మీ దూరం

మిగతా 2లో..

### స్పేస్‌డే నాటికి సలహాలు, సూచనలు పంపండి

మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

వార్త 9లో

### మళ్లీ ట్రంప్ ఎంట్రీతో థాయ్, కంబోడియా శాంతి చర్చలకు

## గ్రీన్‌సిగ్నల్

### ఆగ్నేయాసియాలో ఘర్షణలను తన మధ్యవర్తిత్వంతో విరమింపజేస్తున్నట్లు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు



**వాషింగ్టన్(జనంసాక్షి):**థాయ్‌ల్యాండ్–కంబోడియా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగారు. ఆగ్నేయాసియాలో కమ్ముకున్న యుద్ధ మేఘాలను తన మధ్యవర్తిత్వంతో విరమింపజేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. రెండు దేశాల మధ్య జరుగుతున్న ఘర్షణలకు త్వరలోనే ముగింపు పడనుందని ట్రంప్ చెప్పారు. ఇరు దేశాలు తక్షణ కాల్పుల విరమణ చర్చలకు అంగీకరించాయని వెల్లడించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా.. కాల్పుల విరమణకు సంబంధి కంబోడియా ప్రధాని హున్ మానెట్, థాయ్ తాత్కాలిక ప్రధాని ఫుమ్తామ్ వెచాయాచాయ్‌లతో మాట్లాడానని.. ఇరువురు తక్షణ కాల్పుల విరమణకు, శాంతి నెలకొల్పేందుకు అంగీకరించారని చెప్పారు.

మిగతా 2లో..

## మోసాల 'సృష్టి'

### సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబి సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత అరెస్టు

- దంపతులను నమ్మించి మోసం చేశారు
- డాక్టర్ నమ్రత అసలు సరోగసీ చేయలేదు
- వివరాలు వెల్లడించిన డీసీపీ

**హైదరాబాద్(జనంసాక్షి):** సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను పోలీసులు అరెస్టు చేశారు. అర్ధరాత్రి 2గంటల వరకు సిబ్బందిని ప్రశ్నించిన పోలీసులు, వైద్యాధికారులు పలు కీలక పత్రాలతో పాటు వీర్యకణాల శాంపిల్స్ తీసుకెళ్లారు.

మిగతా 2లో..





## చొరబాటుదారుల ఆటకట్టు

### సాయుధ బలగాల శరీరాలకు బాడీ కెమెరాల ఏర్పాటు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలోకి వచ్చిన అక్రమ చొరబాటుదారులను వెనక్కి పంపించే క్రమంలో సాయుధ బలగాలపైనే తిరగబడుతూ దాడులు చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న సరిహద్దు బలగాలు.. ఇటువంటి ఘటనలను ఆధారాలతో చిత్రీ కరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 28.07.2025

## మోసాల 'సృష్టి'

సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌కు ఇండియన్ స్పెర్మ్ టెక్ సంస్థకు సంబంధాలు ఉన్నట్టు గుర్తించారు. అద్దె గర్భాల కోసం అక్రమంగా వీర్యాన్ని, అండాలను సేకరిస్తున్నట్టు దర్యాప్తులో తేలింది. వీర్యకణాలు, అండాలను గుజరాత్, మధ్యప్రదేశ్ తరలిస్తున్నట్టు గుర్తించారు. అనుమతులు లేకుండానే రెజిమెంటల్ బజార్‌లో ఇండియన్ స్పెర్మ్‌టెక్ సంస్థను నిర్వహిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆ సంస్థ రీజినల్ మేనేజర్ పంకజ్ సోనీని నిందితుడిగా చేర్చారు. పంకజ్, సంపత్, శ్రీను, జితేందర్, శివ, మణికంఠ, బోరోను అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేసు వివరాలివీ.. రాజస్థాన్‌కు చెందిన దంపతులు నాలుగేళ్లుగా సికింద్రాబాద్‌లో ఉంటున్నారు. సంతానలేమితో మూడేళ్ల క్రితం సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాన్ని సంప్రదించారు. సరోగసీ ద్వారా పిల్లలకు అవకాశం ఉందని నిర్వాహకురాలైన డాక్టర్ నమ్రత వారికి చెప్పారు. రూ.30 లక్షల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. గతేడాది ఆగస్టులో మొత్తం డబ్బు చెల్లించారు.బిడ్డ జన్మించిన తర్వాత తమతో పాటు సరోగసీకి అంగీకరించిన మహిళ డీఎన్ఏ నమూనాలు సేకరించి.. పోల్చాలని దంపతులు షరతు విధించారు. ఈ ఏడాది బిడ్డ జన్మించింది. షరతు ప్రకారం డీఎన్ఏ పరీక్షలు చేయించాలని భార్యాభర్తలు నమ్రతను కోరగా ఆమె తరచూ వాయిదాలు వేస్తున్నారు. దిల్లీలో డీఎన్ఏ పరీక్షలు చేయించుకోగా.. తల్లిదండ్రుల డీఎన్ఏతో బిడ్డ డీఎన్ఏ సరిపోలలేదు. జూన్ రెండోవారంలో ఆ వైద్యురాలిని సంప్రదించి బిడ్డ తమకు జన్మించలేదని.. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు ఇవ్వాలని చెప్పారు. తప్పును అంగీకరించిన వైద్యురాలు.. సమస్యను పరిష్కరించేందుకు సమయం ఇవ్వాలని అడిగారు. కానీ తర్వాత నుంచి ఆచూకీ లేకుండా పోయారు. తాము మోసపోయామని భావించి దంపతులు గోపాలపురం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదైంది.

**డాక్టర్ నమ్రత అసలు సరోగసీ చేయలేదు: డీసీపీ**

సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు సరైన అనుమతులు లేవని డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఆ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరిందని చెప్పారు. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ వ్యవహారంపై ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలు విషయాలను డీసీపీ వెల్లడించారు. సంతానం కలగని దంపతులను ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత మోసగించారని చెప్పారు. "సంతానం కలగని దంపతులు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు వెళ్లారు. దంపతులకు డాక్టర్ నమ్రత పలు పరీక్షలు నిర్వహించి ఐవీఎఫ్ సాధ్యం కాదని.. సరోగసీ ద్వారా పొందవచ్చని చెప్పారు. రూ.30లక్షలు ఖర్చు అవుతుందన్నారు. సరోగసీ కోసం విశాఖకు చెందిన దంపతులను ఒప్పించానని నమ్రత చెప్పారు. వారు రూ.5లక్షలు అడిగారని తెలిపారు. దంపతుల నుంచి అండం, వీర్యం సేకరించి సరోగసీ చేస్తున్నామన్నారు. విశాఖలోని ఓ గర్భిణిని సరోగసీ మదర్ అని చూపించారు.

అనుమానంతో డీఎన్ఏ టెస్టు చేస్తే..

కొన్నాళ్ల తర్వాత విశాఖ ఆస్పత్రిలో ఓ బాబును దంపతులకు ఇచ్చారు. సరోగసీకి అంగీకరించిన మహిళ అదనంగా డబ్బు అడుగుతున్నారన్నారు. డాక్టర్ అడిగిన అదనపు డబ్బులు కూడా దంపతులు ఇచ్చారు. ఈ కేసులో నమ్రత అసలు సరోగసీ చేయలేదు. శిశువు వద్దనుకున్న అస్సాంకు చెందిన ఒక మహిళకు రూ.90వేలు చెల్లించారు. ఆమెకు శిశువు పుట్టగానే తీసుకున్నారు. ఆ తర్వాత దంపతులకు అనుమానం వచ్చింది. దీంతో డీఎన్ఏ టెస్టు చేయించారు. ఈ క్రమంలో శిశువు ఆ దంపతులకు చెందినది కాదని తేలింది.

**డాక్టర్, సిబ్బంది సరైన నిపుణులు కాదు**

సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు చాలా నిబంధనలు ఉల్లంఘించారు. ఆ ఆస్పత్రికి సరైన అనుమతులు లేవు.. చాలా ఫిర్యాదులు కూడా ఉన్నాయి. డాక్టర్, సిబ్బంది ఎవరూ సరైన నిపుణులు కాదు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్‌కు 2021లోనే గడువు తీరింది. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నారు. దీనిపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. అందుకే ఆస్పత్రిని మూసివేస్తున్నట్లు కోర్టుకు చెప్పారు. ఆస్పత్రిని చాటుమాటుగా నిర్వహిస్తున్నందున అధికారులు గుర్తించలేకపోయారు. ఇది సరోగసీ కాదు.. చైల్డ్ ట్రాఫికింగ్. న్యాయవాదినని చెప్పుకొని నమ్రత కుమారుడు జయంత్ కృష్ణ బాధితులను బెదిరించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశాం. ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేశాం" అని డీసీపీ రష్మీ పెరుమాళ్ వివరించారు.

## గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్..

**నాగర్‌కర్నూల్(జనంసాక్షి):** రాష్ట్రంలోని మరో గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడలో ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి భోజనం చేసిన తర్వాత విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో 79 మంది బాలికలను పాఠశాల సిబ్బంది దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అందరి పరిస్థితి నిలకడగా ఉన్నదని వైద్యులు వెల్లడించారు. 12 మంది డిశ్చార్జి అవగా, ఇంకా 67 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. పూర్తిగా తోడుకోని పెరుగు తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తున్నది.కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు పరిపాటిగా మారాయి. పలువురు విద్యార్థులు మరణించినప్పటికీ సర్కార్‌లో చలనం రావడం లేదు. వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ జాగ్రత్తలు తీసుకోవడంలేదు. ఈ నెల 21న సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలంలోని మొర్గి ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో సోమవారం ఫుడ్ పాయిజన్‌తో 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మొర్గి మాడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం కలిపి 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆదివారం రాత్రి చికెన్ తిన్న 11 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురికాగా వాచ్‌మన్ నారాయణఖేడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.ఈ నెల 14న నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 35 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల సమాచారం మేరకు.. పాఠశాలలో సుమారు 310 మంది విద్యార్థినులు ఉండగా ఆదివారం సాయంత్రం విద్యార్థినులకు స్నాక్స్, పెసర గుగ్గిళ్లు అందించారు. రాత్రి భోజనం బగారాతో చికెన్ వడ్డించారు. రాత్రి భోజనం తర్వాత కొందరు విద్యార్థినులు కడుపునొప్పితో బాధపడటంతోపాటు విరేచనాలు చేసుకున్నారు. సోమవారం ఉదయం అల్పాహారంగా పులిహోర తిన్న తర్వాత 35మంది తీవ్రమైన కడుపునొప్పి, విరేచనాలతో బాధపడుతుండగా, పాఠశాల ఏఎన్ఎం, టీచర్లు 13మంది విద్యార్థినులను దేవరకొండ దవాఖానలో, తూర్పుపల్లి పీహెచ్‌సీలో 22మందిని చేర్పించారు.

## ఆలయంలో అపశ్రుతి

చికిత్స అందిస్తున్నామని.. ఆలయం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.విద్యుత్ షాక్ కారణంగా భయభ్రాంతులకు గురైన భక్తులు ఒక్కసారిగా పరుగులు పెట్టడంతో తొక్కిసలాట జరిగి ఉండొచ్చని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నట్లు గర్వాల్ కమిషనర్ తెలిపారు. విద్యుత్ షాక్‌కు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది బాధాకరమైన విషయమని.. ఘటనా స్థలంలో సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని.. అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని తెలిపారు.

# నేడు పార్లమెంటులో సిందూర్ మంటలు



విదేశాంగ మంత్రి జైశంకర్ సహా ఇతర సభ్యులు ఈ చర్చలో మాట్లాడనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ ప్రభుత్వ బలమైన వైఖరిని చెప్పనున్నారు. విపక్షాల తరఫున లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ తదితరులు తమ వాణి వినిపించనున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై వివరించడానికి అమెరికా సహా ఇతర దేశాలకు భారత బృందానికి నేతృత్వంవహించిన ఎంపీ శశిథరూర్‌ను ఈ అంశంపై మాట్లాడేందుకు కాంగ్రెస్ ఎంపిక చేస్తుందా లేదా అనేది ఇంకా స్పష్టంకాలేదు. పహల్గాం ఉగ్రదాడికి నిఘా వైఫల్యమే కారణమని కేంద్ర ప్రభుత్వాన్ని విపక్ష పార్టీలు తప్పుపడుతూ వచ్చాయి. ఉగ్రదాడికి పాల్పడ్డవారిని ఇంకా పట్టుకోకపోవడంపై విమర్శలు గుప్పించాయి. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణకు తన మధ్యవర్తిత్వమే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపైనా ప్రభుత్వాన్ని విపక్షాలు ఇరుకునపెట్టనున్నాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా విదేశాల నుంచి భారత్‌కు మద్దతు లభించకపోవడంపై మోదీ సర్కారును రాహుల్ గాంధీ ప్రశ్నిస్తూ వచ్చారు. ఐతే యుద్ధాన్ని తానే ఆపానంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కేంద్రం ఇప్పటికే వివరణ ఇచ్చింది. కాల్పుల విరమణ నిర్ణయాన్ని భారత్, పాక్ తీసుకున్నాయని ఇతర దేశాల జోక్యం లేదని తెలిపింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా వందశాతం లక్ష్యాలు సాధించామని, భారత స్వదేశీ ఆయుధ వ్యవస్థలు సత్తా చాటాయని వివరించింది. ఈ నేపథ్యంలో పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్ ఉభయ సభల్లో వాడీవేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది.

# మన రైతులపై భాజపాకు ఎందుకంత కోపం?




కేంద్రం ప్రకటనలకు, సరఫరాకు చాలా తేడా ఉందని చెప్పారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు లేఖలు రాశామన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుకు కూడా లేఖ రాసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు రైతులకు అన్యాయం చేయొద్దని సూచించారు. యూరియా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. అధికారులతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. జిల్లాలో వర్షాల పరిస్థితి, ముంపు ప్రాంతాల్లో తలెత్తుతున్న సమస్యలు, సీజనల్ వ్యాధుల వ్యాప్తి, రైతులకు ఎరువుల లభ్యత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలపైనా చర్చించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గతేడాది మాదిరిగా ముంపు పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో తాత్కాలిక నివాస శిబిరాలను సిద్ధం చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్యశాఖ సన్నద్ధంగా ఉండాలని.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాలు, అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని.. ఇసుక సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులో పూర్తికావాలన్నారు.

### సీఎం రమేష్ వ్యాఖ్యలు వాస్తవమే..

పార్టీ, అవినీతి పార్టీ అని ఎన్నో సార్లు చెప్పాం. ఆ పార్టీని భాజపాలో చేర్చుకునే ప్రసక్తే లేదు. ప్రధాని మోదీ నిజామాబాద్ సభలో ఇదే చెప్పారు" అని బండి సంజయ్ అన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు

నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలోని బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి ఫుడ్ పాయిజన్ అయి అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. సాంబార్‌లో కూడా పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు చెబుతున్నారన్నారు."గురుకులాల్లో మెనూ ప్రకారం తిండి పెట్టట్లేదు. రేవంత్‌రెడ్డి నుంచి మాటలు కాదు.. చేతలు కావాలి. ఈ సారి కలుషిత ఆహారం కేసులు వస్తే చర్యలు తీసుకుంటానని సీఎం అన్నారు. సీఎం మాటలు అధికారులు వినట్లేదా? దిల్లీకి వెళ్లడానికి ఆయనకు సమయం ఉంటుంది. విద్యార్థుల సమస్యలపై చర్చించడానికి లేదా? ఈ అంశంపై అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చించాలి. మానవహక్కుల కమిషన్, హైకోర్టు ఈ ఘటనల్ని సుమోటోగా తీసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది"అని హరీశ్‌రావు అన్నారు.



## కొండాపూర్‌లో రేవ్ పార్టీ..

### డ్రగ్స్ స్వాధీనం..

### 11 మందిపై కేసు నమోదు

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలోని కొండాపూర్‌లో రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి 11 మందిపై కేసు నమోదు చేశారు. 9 మందిని అరెస్టు చేయడంతో పాటు 6 కార్లు, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సోదాల్లో 2 కిలోల గంజాయి, 50 గ్రాముల ఓజీ కుష్‌డ్రగ్, 11.57 గ్రాముల మ్యాజిక్ మష్రుమ్, 1.91 గ్రాముల చెరాస్ డగ్స్ లభ్యమయ్యాయి. నిందితులను శేరిలింగపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విజయవాడకు చెందిన వాసు, శివంరాయుడు రేవ్ పార్టీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇందుకోసం వారు ఇతరుల గుర్తింపు కార్డులు వాడుతున్నట్లు దర్యాప్తులో తేలింది.

## అన్నీ ఆలోచించే రాజీనామా చేశా

చెప్పారు."నా రాజీనామా వెనుక ఏ కుట్రా లేదు. ఎవరితో పార్టీకి నష్టం జరిగిందో అధిష్ఠానానికి చెప్పాలనుకున్నా. లక్షలాది మంది భాజపా కార్యకర్తలు పార్టీ కోసం జీవితాలను త్యాగం చేశారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా నాకు ఫోన్ చేయలేదు. ఆయన ఫోన్ చేసేంత పెద్దవాడిని నేను కాదు. తెలంగాణలో భాజపా అధికారంలోకి రావాలంటే ఒక ఫైటర్ కావాలి" అని రాజాసింగ్ అన్నారు

## జైపాల్ రెడ్డికి ఘన నివాళి

ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా అనునిత్యం ప్రజల కోసమే పని చేశారు. తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్ రెడ్డి గారు పోషించిన పాత్ర ప్రజలెప్పుడూ మరిచిపోలేరని, రాజకీయాల్లో ఎప్పుడూ విలువల విషయంలో రాజీ పడలేదని, నిష్కళంక నేతగా నిలిచారన్నారు. దక్షిణాది నుంచి తొలిసారి ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారం అందుకున్న నేతగా ఘనత సాధించారన్నారు.

## చొరబాటుదారుల ఆటకట్టు

ఇందులో భాగంగా భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దులోని బీఎస్ఎఫ్ జవాన్లకు 5వేలకు పైగా శరీరానికి ధరించే కెమెరాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

## థాయ్, కంబోడియా శాంతి చర్చలకు గ్రీన్‌సిగ్నల్

వారు వెంటనే సమావేశమై చర్చించేందుకు సమ్మతించారన్నారు. అయితే ఇరు దేశాల మధ్య మధ్యవర్తిత్వం ఎవరు వహిస్తారు, శాంతి చర్చలు ఎక్కడ జరుగుతాయని వివరాలను ఆయన వెల్లడించలేదు. కాగా, కాల్పుల విమరణకు సూత్రప్రాయంగా సుముఖతను వ్యక్తం చేసినట్లు థాయ్‌లాండ్ తాత్కాలిక ప్రధాని ఫేస్‌బుక్ వేదికగా వెల్లడించారు. అయితే కంబోడియా నిజాయితీగా వ్యవరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఘర్షణలు ఇలాగే కొనసాగితే అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు ప్రమాదంలో పడతాయని ఇద్దరినీ హెచ్చరించానని వెల్లడించారు.ఇక, ఇటీవలి కాలంలో పలు దేశాల మధ్య యుద్ధాల విషయంలో ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధాన్ని ఆపిన ట్రంప్.. తన మధ్యవర్తిత్వంతోనే పాక్, భారత్ మధ్య కాల్పులు నిలిచాయని పదేపదే చెప్పారు. అనంతరం, భారత ప్రధాని మోదీ ప్రకటనతో ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు.ఇదిలా ఉండగా.. థాయ్‌ల్యాండ్, కంబోడియా మధ్య ఘర్షణలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఇప్పటి వరకూ 33 మంది మరణించారు. దాదాపు 1.68 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. సరిహద్దు వెంబడి ఉన్న అనేక గ్రామాల్లో దాడి ఘటనలు చోటుచేసుకున్నాయి.

## ఆస్ట్రేలియాలో మరో ఘాతుకం

**సిడ్నీ(జనంసాక్షి):**

ఆస్ట్రేలియాలో భారత సంతతి పౌరులపై వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఓ భారత విద్యార్థిపై దుండగులు తీవ్రంగా దాడి చేసిన ఘటన మరవకముందే మరో భారత విద్యార్థిపై కత్తితో దాడి చేసిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. మెల్‌బోర్న్‌లో ఉంటున్న భారత విద్యార్థి సౌరభ్ ఆనంద్ ఇటీవల ఓ ఫార్మసీ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో దుండగులు అతడిపై కత్తితో దాడి చేసి.. తీవ్రంగా గాయపరిచినట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో సౌరభ్ మెడ, తలకు తీవ్ర గాయాలు కాగా.. చేయి తెగిపడింది. సౌరభ్ ఆనంద్ ఆల్టోనా మెడోస్‌లోని ఓ ఫార్మసీ నుంచి మందులు తీసుకొని ఫోన్‌లో మాట్లాడుతూ ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో ఐదుగురు యువకుల బృందం అతడిపై కత్తితో దాడి చేసింది. వారు సౌరభ్ మెడ నరకడానికి ప్రయత్నించగా.. అతడు తీవ్రంగా ప్రతిఘటించాడు. ఆ సమయంలో అతడి చేతిలోకి కత్తి దూసుకుపోయింది. అనంతరం శరీరంలోని పలు చోట్ల కత్తులతో తీవ్రంగా గాయపరిచి నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

# మేం ఏ పార్టీలోనూ కలవం



ప్రభుత్వాన్ని కోరినప్పటికీ పట్టించుకోలేదని పేర్కొన్నారు. పరకాలలో ఉన్న 3వేల మందికి లబ్ధి చేకూరే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఆరు గ్యారంటీలని చెప్పి కాంగ్రెస్ నేతలు ప్రజలను బురిడీ కొట్టించారని కేటీఆర్ ఆరోపించారు. ఇంట్లో ఉన్న అత్తాకోడళ్లకు పింఛన్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని అన్నారు. అత్తకు రూ.4వేలు, కోడలికి రూ.2500 ఇస్తామని ఇచ్చింది లేదని చెప్పారు. ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని తెలిపారు. కల్యాణలక్ష్మీ కింద తులం బంగారం అని చెప్పి మభ్యపెట్టారని మండిపడ్డారు. రైతు బంధు రూ.15వేలు ఇస్తామని రెండు నెలలు ఎగ్గొట్టారని అన్నారు. ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇస్తోందని తెలిపారు. సమయం దొరికినప్పుడే కాంగ్రెస్ నేతలకు వాత పెట్టాలని అన్నారు. కాంగ్రెస్ నేతల బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని స్పష్టం చేశారు. కర్రుకాల్చి వాత పెట్టకపోతే కాంగ్రెస్ నేతలకు బుద్ధిరాదని అన్నారు.బీఆర్ఎస్ హయాంలో ఎరువుల కోసం క్యూలైన్‌లో నిలబడిన రోజులు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. పరకాలకు వస్తుంటే పలుచోట్ల రైతులు క్యూలైన్‌లో నిలబడి కనిపించారని తెలిపారు. ఈ ముఖ్యమంత్రికి సమయానికి యూరియా ఇచ్చే సోయి లేదని విమర్శించారు. కోటిమందిని కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన తీర్పిస్తే ప్రయత్నం దిగి వచ్చి పథకాలు అమలు చేస్తారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంటికి వచ్చిన మన బీఆర్ఎస్ నాయకులను ఆదరించాలని కోరారు. కేసీఆరే వచ్చిండని కడుపులో పెట్టుకుని చూసుకోవాలన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని సీఎం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. ప్రాణం పోయినా సరే బీజేపీతో పొత్తు ఉండదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల సమయంలోనే బీజేపీతో పొత్తు అని వార్తలు వచ్చాయని.. అప్పుడే ప్రాణం పోయినా సరే బీజేపీతో పొత్తు ఉండదని కేసీఆర్ చెప్పారని తెలిపారు. ఈరోజుకు కూడా అదే మాట మీద ఉన్నామని పేర్కొన్నారు. సీఎం రమేశ్ లాంటి బ్రోకర్లు చెప్పే మాటలు పట్టించుకోవద్దని సూచించారు. బీజేపీ తెలంగాణకు పనికివచ్చే పార్టీ కాదని.. బీఆర్ఎస్ భావజాలం వేరు.. బీజేపీ భావజాలం వేరు అని కేసీఆర్ చెప్పారని జగదీశ్ రెడ్డి తెలిపారు. చిన్న, పెద్ద బ్రోకర్లు మాట్లాడితే అది పట్టించుకోవద్దని.. చంద్రబాబు నాయుడు అలాంటి వారికే పదవులు ఇచ్చారని అన్నారు. సీఎం రమేశ్ ఇంటికి నేను కూడా మిత్రునిగా వెళ్ళాను. ఆయన ఇంటికి కేటీఆర్ లేదా నేను వెళ్తే తప్పు ఏంటి అని ప్రశ్నించారు. సీఎం రమేశ్ ఢిల్లీలో ఉన్న రేవంత్ రెడ్డి ఇంట్లోనే ఉంటున్నాడని జగదీశ్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని 23వ బంగ్లాలో ఉన్న రేవంత్ రెడ్డి ఇంట్లోనే సీఎం రమేశ్ ఇంట్లోనే ఉంటున్నాడు.. ఆ సీసీ టీవీ ఫుటేజి తీద్దామా అని నిలదీశారు. సీసీ టీవీ ఫుటేజ్‌లు తీయాలంటే సీఎం రమేశ్ తన జీవితకాలంలో ఎక్కువగా చంద్రబాబు నాయుడు, సీఎం రేవంత్ రెడ్డి ఇంట్లో ఉంటాం`న్నారు. తమను భయపెడితేనే బీజేపీలోకి వెళ్లామని సీఎం రమేశ్ తనతో చెప్పారని జగదీశ్ రెడ్డి తెలిపారు. తాను బీజేపీలోకి వెళ్లినా కూడా ఎప్పటికీ చంద్రబాబు మనుషులమే అని ఆయన చెప్పారని అన్నారు. కవిత జైలుకు వెళ్తే బెయిల్ ఇచ్చేది కోర్టు.. ఆమె విషయంలో పార్టీని బీజేపీలో విలీనం చేస్తామని కేటీఆర్ ఎట్లా అంటారని ప్రశ్నించారు.

## మలి వయసులో మేమున్నామని...

ధనసూరి సీతక్క సంతకం చేసిన విషయం తెలిసిందే. వృద్ధుల్లో ఒంటరి భావనను పోగొట్టేందుకు ఈ కేంద్రాలు పనిచేయనున్నాయి. నిర్వహణకు ప్రభుత్వం ఏటా ఏకంగా రూ.4.61 కోట్లు ఖర్చు చేయనుంది.జీవితంలో ఎక్కువ సమయం తల్లిదండ్రులు పిల్లల ఉన్నతికే పాటుపడతారు. ప్రస్తుతం వారు వృద్ధాప్య వయసుకు చేరారు. వీరిలో చాలా మంది పరిస్థితి వృద్ధాప్య దశలో దయనీయంగా మారింది. వృద్ధులను తమ పిల్లలను పట్టించుకోకపోవడంతో తీవ్ర నిరాదరణకు గురవుతున్నారు. ఇది ఆందోళనకర పరిణామంగా తయారైంది.కొందరు ఉద్యోగం, ఉపాధి కోసం విదేశాల్లో ఉంటే ఇక్కడ ఉంటున్న వారి తల్లిదండ్రులకు ఒంటరితనం మాత్రం తప్పడం లేదు. ఇలాంటి వయోవృద్ధుల ఇబ్బందులు దూరం చేయాలన్న లక్ష్యంతో డే కేర్ సెంటర్ల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 33 జిల్లాకు ఒకటి చొప్పున మంజూరు చేస్తున్నట్లు గతంలోనే ప్రకటించింది. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని నిర్వహించనున్న తెలిపారు.సంగారెడ్డి జిల్లాకు మంజూరైన వయో వృద్ధుల డే కేర్ సెంటర్‌ను జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇటీవల జిల్లా సంక్షేమ అధికారిణి లలితకుమారి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు వనజారెడ్డి వసతులను పరిశీలించారు. ఇంట్లో ఒంటరిగా జీవనం సాగిస్తున్న వారికి డే కేర్ సెంటర్‌తో చాలా ప్రశాంతమైన ప్రయోజనం చేకూరనుంది. కొందరు తమ కుమారుల వద్ద ఉంటున్నారు. కుమార్తెలు, అల్లుళ్లు, కుమారులు, కోడళ్లు ఉద్యోగాలకు, వారి పిల్లలు స్కూళ్లకు వెళితే సాయంత్రం వరకు ఇంట్లో ఒంటిరిగా ఉండాల్సిన పరిస్థితి. డే కేర్ సెంటర్‌కు వెళితే అక్కడ సాయంత్రం వరకు కాలక్షేపం చేసేందుకు వీలుగా ఉంటుంది. డే కేర్ సెంటర్‌లో చేరాలంటే ముందుగా అక్కడ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా డే కేర్‌లో చేరేందుకు అర్హత కల్పిస్తారు. సెంటర్‌లో కిచెన్ ఉంటుంది. నమోదైన వారికి ఒక పూట భోజనం కూడా అందించనున్నారు. అటు ఇటు సంచారించడానికి విశాలమైన హాల్ అందుబాటులో ఉంటుంది. క్యారమ్, చెస్ వంటి ఆట వస్తువులను ఏర్పాటు చేస్తారు. ఆధ్యాత్మిక, సాహిత్య, దినపత్రికలు, వార్తాపత్రికలతో కూడిన లైబ్రరీ ఉంటుంది.ఆరోగ్యానికీ మొదటి డే కేర్ సెంటర్‌లో డాక్టర్లు కూడా అందుబాటులో ఉంటారు. వీరి కోసం ప్రత్యేకంగా ఓ రూం కేటాయిస్తారు. వారానికి రెండుసార్లు వృద్ధులకు హెల్త్ చెకప్స్ చేస్తారు. అవసరమైన వారికి మందులు ఫ్రీగా అందిస్తారు. ఎవరికైనా ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎక్కువగా ఉంటే వెంటనే ఆసుపత్రికి సిఫారసు చేస్తారు.తెలంగాణలోని అనేక వయోజన డే కేర్ సెంటర్లు మరియు వృద్ధాశ్రమాలు వృద్ధులకు సేవలను అందిస్తున్నాయి, కొన్ని ప్రత్యేకంగా సీనియర్ సిటిజన్ల అవసరాలను తీరుస్తాయి.

## ఎరువుల కొరతపై బహిరంగ చర్చకు మంత్రి తుమ్మల సిద్ధమా?

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో భాజపా ఎప్పటికీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ సింగిల్‌గానే బరిలో ఉంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల అనారోగ్య పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులకు సరైన భోజనం పెట్టడం లేదని.. కలుషిత ఆహార ఘటనలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎరువుల కొరతపై బహిరంగ చర్చకు మంత్రి తుమ్మల సిద్ధమా**

మోదీ ప్రభుత్వం ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూస్తోందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. తెలంగాణలోనే ఎరువుల కొరత ఎందుకు ఉందని ప్రశ్నించారు. దీనిపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో భాజపా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాన్ని అప్రతిష్ఠ పాల్జేసేందుకుకే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు.

## శత్రువులకు భారత్ సేఫ్ కాదని ఆపరేషన్ సిందూర్ నిరూపించింది

అకస్మాత్తుగా రోడ్‌షోగా మారింది. అందరూ ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తున్నారు' రాజరాజ చోళ, ఆయన కుమారుడు రాజేంద్ర చోళ-1లు భారతదేశ గుర్తింపు, గర్వానికి పర్యాయపదాలు అని మోదీ అన్నారు. తమిళనాడులో వారి కోసం గొప్ప విగ్రహాలను నిర్మిస్తామని ప్రకటించారు. "ప్రజాస్వామ్యం గురించి వ్యాఖ్యానిస్తూ చాలా మంది యూకే మాగ్నాకార్టా గురించి మాట్లాడుతుంటారు. కానీ చోళ యుగం నాటి 'కుడవోలై వ్యవస్థ' వందల సంవత్సరాల కిందటే ప్రజాస్వామ్యం గురించి తెలియజేసింది. చోళుల కాలంలో ఉన్న ఈ వ్యవస్థ దాదాపు 1000 సంవత్సరాల క్రితం నాటిది" మోదీ అన్నారు. తమిళనాడు అరియలూరులోని గంగైకొండ చోళపురం ఆలయంలో నిర్వహించిన 'ఆది తిరువతిరై' ఉత్సవం ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్దే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, జులై 27 (జనంసాక్షి) :** మహిళల ఆర్థికాభివృద్దే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం ఆయన బెల్లంపల్లి పట్టణం ఆర్పీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి సంబరాల్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళలు ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్ కు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన బతుకమ్మతో మహిళలతో కలిసి నృత్యాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామజిక అభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం మహిళలకు మహిళా సమైక్యత పెట్రోల్ బంకులు, ఎలక్ట్రిక్ బస్సులు అందిస్తుందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రతి మహిళా ఒక ఇందిరా గాంధీ లాంటి శక్తివంతమైన మహిళగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారత, పేదలకు న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి, ఆత్మగౌరవంతో జీవించాలని కోరారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. బెల్లంపల్లిలో 25 కోట్ల రూపాయలు స్వయం సహాయక సంఘాలకు అందించామన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబడి అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేసి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందించి ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని, ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్ కార్డు గల అభ్యర్థులు పథకాల కొరకు దరఖాస్తులు చేసుకున్నారని, రేషన్ కార్డు లేని వారు రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నారని, వాటితో పాటు కార్డులో సభ్యుల చేర్పుల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని తెలిపారు. మీ -సేవా కేంద్రాల ద్వారా నిరంతర ప్రక్రియగా రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. పాత రేషన్ కార్డులలో పేర్లు కలిగి ఉండి, వివాహం అనంతరం నూతన రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ముందు తమ పాత రేషన్ కార్డులో వివరాలు తొలగించుకోవాలని తెలిపారు. వివరాల తొలగింపు అనంతరం నూతన రేషన్ కార్డు కొరకు అందిన దరఖాస్తులను గిర్థవర్, తహసిల్దార్, జిల్లా పౌరసరఫరాల శాఖ స్థాయిలలో పరిశీలించి మంజూరు కొరకు ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం 3 వేల నుండి 3 వేల 500 మంది విద్యార్థులు పాఠశాలలలో చేరుతుండగా, ఈ విద్యా సంవత్సరంలో 7 వేల మంది పిల్లలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయం చెక్కులు, రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ కార్డులు, గౌడ కులస్తులకు కాటమయ్య రక్షా ఫీట్లను పంపిణీ చేశారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలోని 100 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్ లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డీఆర్డీఓ కిషన్, డీపీఎం స్వర్ణలత, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, బెల్లంపల్లి పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలతో మభ్యపెడతారా?

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, జులై 27 (జనం సాక్షి):** భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సిద్ధాంత పరంగా మాట్లాడాలి కానీ తప్పుడు ఆరోపణలతో ప్రజలను మభ్యపుచ్చాలని ప్రయత్నం చేయడం సరైన పద్ధతి కాదు అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.ఆదివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన పత్రికా మీడియా మిత్రుల సమావేశంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ సంస్కారహీనంగా మాట్లాడుతున్నారు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కాంట్రాక్టు పనుల కోసం దోపిడి వాస్తవం కాదా,సీఎంఆర్ఎఫ్ నిధులను దోచుకున్నది వాస్తవం కాదా, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని కైటెక్స్ వారిని బ్లాక్ మెల్ చేసి 15 కోట్లు బి ఆర్ ఎస్ పార్టీ కోట్టి వేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.కాళ్లకు చెప్పులు లేని అయ్యకు ఇన్ని వేల కోట్లు ఎక్కడ నుండి వచ్చాయి, అభివృద్ధి ముసుగులో రాష్ట్రాన్ని దోచుకుతున్నారని, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రోడ్డు తన కాంట్రాక్టు పనుల కోసం వెడల్పు పేరుతో ఇండ్లు కూల్చి రోడ్లు వేసి కోట్లు దోచుకున్నారు.గృహలక్ష్మి పథకం పేరుతో పేదలకు నిలువ నీడ లేకుండా చేసి, వారిని మోసం చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.ఫామ్ హౌస్ లో జరిగిన పాపాలు కడుక్కోవడానికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్నారని,గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని సర్పంచ్ లకు బిల్లులు ఇవ్వకుండా పెండింగ్లో పెట్టి ఇబ్బంది గురి చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వారికి బిల్లులు ఇప్పిస్తున్నాం అన్నారు.అభయ హస్తం క్రింద మీరు దోచుకున్నది,మేము తిరిగి ఇచ్చాము, ఇప్పటి వరకు పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 6 కోట్ల పావుల వడ్డీ రుణాలు మహిళలకు ఇచ్చాము.ప్రతి నెలకు దాదాపు 6500 కోట్ల అప్పు కట్టుకుంటూ ఆరు గ్యారెంటీ హామీలను అంచెలంచెలుగా నెరవేరుస్తున్నాం అని తెలిపారు.10 సంవత్సరాలు అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా 5.98వేల పైచిలుకు రేషన్ కార్డులను ఇచ్చామని, నూతన రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అన్నారు.మూడు నెలల ముందు ఇండ్లు ఇచ్చి మోసం చేసింది మీరు కాదా, ప్రగతి భవన్ సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఉచిత ఎరువులు ఇస్తానన్నది వాస్తవం కాదా అన్నారు.మొరం దోపిడీ చేసిన పెద్ద దొంగ మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మ రెడ్డి, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లకు మోరాన్ని అందజేస్తున్నాం అని తెలిపారు.పార్టీలకు అతీతంగా కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, తదితర సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నాం. అవినీతి రహిత పాలన మేము చేస్తున్నామని,గోదాం నుండి రాత్రి 11.30 గంటలకు యూరియాని దొంగిలించిన వారిని పోలీసులు కేసులు పెడితే తప్పా,బీసీల గురించి మాట్లాడే నైతికత మీకు లేదు, నీ పాలనలో బీసీ మంత్రిగా కెప్టెన్ లక్ష్మీకాంతారావు కాదా అని ఎన్నికల ముందు రైతు భరోసా ఎగగొడితే మేము ఇచ్చాం, రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ పార్టీకి లేదన్నారు. ప్రగతి భవన్ సాక్షిగా రైతులకు ఉచిత ఎరువులు ఇస్తానన్నారు,బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు సబ్సిడీ రద్దు చేసారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీలు ఇస్తున్నాం అని అన్నారు.

# ఆధార్ కార్డులో కీలక మార్పులు

- అంత సులువుగా అడ్రస్ మారదు, బలమైన పత్రాలు ఉండాల్సిందే
- ఇక పై కేరాఫ్ లేనట్లే
- తండ్రి, తల్లి, భర్త అంటూ కేరాఫ్ ను తొలగించిన యుడిఎఐఏ.
- పూర్తి డేట్ ఆఫ్ బర్త్ ను తొలిగించిన యుడిఎఐఏ
- 5 సం.రాలు దాటిని పిల్లలకు తప్పనిసరిగా అప్డేట్ అవసరం




**ములుగు ప్రతినిధి, జూలై27(జనం సాక్షి) :** ఆధార్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. మొబైల్ సిమ్, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు, ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు ఇలా మరిఎన్నో ప్రభుత్వ పథకాలకు, అవసరాలకు గుర్తింపుగా తీసుకునే ఆధార్ కార్డులపై ఇక నుంచి తండ్రి/భర్త పేరు ఉండదు.ఆధార్‌లో పేరు కింద ఉండే ఈ వివరాలను తొలగించారు.నిజానికి మొదట్లో తండ్రి/భర్త పేరు అని ఉండేది.తర్వాత కేరాఫ్ అని మార్చారు. ఇప్పుడు పూర్తిగా తొలగిస్తూ భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ)నిర్ణయం తీసుకుంది.ఇక నుంచి కొత్త ఆధార్ నమోదులో తండ్రి/భర్త వివరాలు సమర్పించాలని కోరబోమని యూఐడీఏఐ తెలిపింది. అలాగే అడ్రస్ అప్డేట్ కూడా ఇంతకు ముందు లా సులువు గా ఉండదు అని యూఐడీఏఐ తెలిపింది. గతం లో లాగా అప్డేట్ చేస్తే రిజెక్ట్ అవుతున్నాయని ఆపరేటర్, సూపర్వైజర్ లు మొరపెట్టుకున్నారు. అలాగే పుట్టినతేదీకి బదులు ఇకనుంచి కేవలం పుట్టిన సంవత్సరాన్నే నమోదు చేస్తారు. దీనికి సంబంధించి యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ హిమాన్షు ఉత్తర్వులు జారీచేశారు. కొత్త మార్పులను గతంలోనే పేర్కొనగా..ఈ నెల 18 నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చాయి. ఇప్పటికే తండ్రి/భర్త పేరు ఉన్న ఆధార్ కార్డులను అప్డేట్ చేస్తే ఆ పేర్లు తొలగించబడతాయి. అలాగే పుట్టినతేదీ స్థానంలో పుట్టిన సంవత్సరం మాత్రమే వస్తుంది.18 ఏళ్లలోపు ఉండే పిల్లల (మైనర్ల) ఆధార్‌లోనే మాత్రమే కేరాఫ్ స్థానంలో వారి తండ్రి పేరు ఉంటుంది. వాళ్ళ పూర్తి డేట్ ఆఫ్ బర్త్ వుంటుంది అని యూఐడీఏఐ తెలిపింది. ఆధార్ కార్డు తీసుకొని 10 సం.రాలు దాటిన వారందరూ తప్పకుండా డాక్యుమెంట్ అప్డేట్ చేసుకోవాలని, అదే విధం అడ్రస్ అప్డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ తెలిపింది.

# సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

- బీఆర్ఎస్ పార్టీ ని వీడి మంత్రి సీతక్క సమక్షంలో చేరిన 30 కుటుంబాలు, నాయకులు
- పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, నిరంతర ప్రక్రియ : మంత్రి సీతక్క



**ఏటూరునాగారం- తాడ్వాయి, జులై 27(జనంసాక్షి) :** తాడ్వాయి మండలం మేడారం ఐటిడిఎ ప్రాంగణంలో నార్లపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పార్టీని వీడి తాడ్వాయి మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజు, మండల ఉపాధ్యక్షులు ఇప్ప నాగేశ్వర్ రావు, నార్లపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోలు సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర మంత్రి సీతక్క సమక్షంలో పార్టీలో చేరారు. వారికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన రాష్ట్ర మంత్రి సీతక్క.

ఈ సందర్భంగా మంత్రీ సీతక్క మాట్లాడుతూ పేదలకు అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుంది అంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదవాళ్లను గుర్తించి ఇవ్వడం జరిగింది. అదేవిదంగా రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా నాయకులు కార్యకర్తలు సమన్వయం తో ముందుకు వెళ్ళి సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు. మేడారంలో టూరిజం ను ఏర్పాటు చేయనున్నారు, చుట్టూ పక్కల ఉన్న గ్రామాలలో ఉన్న యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాణోత్ రవి చందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్, జిల్లా నాయకులతో పాటు బొప్ప వినోద్, సంకే శ్రావణ్, తామస్ రెడ్డి, ఎనగంటి నరేష్, మాచర్ల రాజు, ఎనగంటి రామయ్య, మడకం శోభన్, నూనావత్ శ్రీను, కల్వల సమ్మయ్య, కుక్కల ఉప్పలయ్య, చార్ నేతాజీ, తోలేం కృష్ణ, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు అందించడంలో రేవంత్‌రెడ్డికి ముందుచూపు లేదు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత





**చెన్నారావుపేట, జూలై 27 (జనం సాక్షి):** రైతులకు ఎరువులను అందించడంలో సీఎం రేవంత్ రెడ్డికి ముందు చూపు లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం చెన్నారావుపేట మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామంలో పోచమ్మ గుడి ఆలయ ప్రాంగణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని రైతులకు సరిపడా ఎరువులను అందించడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలం చెందారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ రైతులకు ముందుగానే ఎరువుల కొరత లేకుండా చూశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు తీవ్రంగా ఎరువుల కొరత సృష్టించారన్నారు. ఎరువుల గోదాముల ముందు రైతులు బారులు తీరి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎరువుల కొరత లేకుండా రైతులకు సరిపడా ఎరువులను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

### మహిళలతో కోలాటమాడిన ఎమ్మెల్సీ కవిత..!

మహిళలతో తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోలాట మాడారు. మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామంలో పోచమ్మ గుడి ఆలయ ప్రాంగణ ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని బయటకి వస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిపై మహిళలు ఆమెను కోలాట మాడాలని కోరారు. దీంతో ఆమె కారు దిగి మహిళలతో కొద్దిసేపు కోలాట మాడి మహిళలను అలరించారు.

# ములకనూరు ప్రజా గ్రంథాలయంలో ఘనంగా కథోత్సవం 2025



**భీమదేవరపల్లి, జూన్ 27(జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములకనూరు గ్రామంలో ప్రజా గ్రంథాలయం ఆధ్వర్యంలో, నమస్తే తెలంగాణ తో కలిసి నిర్వహించిన 'కథోత్సవం - 2025' 'కోడూరు రాజయ్య స్మారక కాంపిటీషన్స్ - పాటల పోటీలు విజేతలకు రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా పాలనలో భాగంగా గ్రామీణ స్థాయిలో జ్ఞానాన్ని పంచే కేంద్రాలుగా ప్రజా గ్రంథాలయాలు నిలవాలన్నారు. ములకనూరు గ్రంథాలయం రాష్ట్రవ్యాప్తంగా ఒక ఆదర్శంగా నిలిచింది. ఈ గ్రంథాలయ అభివృద్ధికి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ సహకారంతో తగిన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వంగా కృషి చేస్తాము అని పేర్కొన్నారు. కథ, కవిత, పాటల విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 450 కథలు పంపారు. పెద్ద ఎత్తున విద్యార్థులు, యువకులు పాల్గొనడం విశేషం. ఎంపికైన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించిన విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.ఈ వేడుకలో సహజ కవి అందే శ్రీ,మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ములకనూరు గ్రంథాలయ చైర్మన్ వంగ రవీందర్,రాష్ట్ర గ్రంథాలయాల అధ్యక్షుడు రియాజ్,తహశీల్దారు రాజేష్,ఎదులపురం తిరుపతి,మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య,మాజీ ఉపసర్పంచ్ కొలుగూరి రాజు,పలువురు కవులు, రచయితలు, సాంస్కృతిక వేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన మంత్రి పొన్నం

భీమదేవరపల్లి మండలం కొప్పూర్ లో ఆదివారం కొప్పురు నుండి కొత్తపల్లి వెళ్లే మార్గంలో 3.9 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం కొత్తకొండలో ఉన్న చారిత్రక శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం కమాన్ వద్ద త్రిశూల చౌరస్తాకు మంత్రి పొన్నం ప్రభాకర్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి పంచాయతీ రాజ్ డి.ఇ.ఇ శిరీష, తహశీల్దారు రాజేష్, నయాబ్ తాహశీల్దార్ సూర్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రత్నకుమారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిట్టెంపెల్లి ఐలయ్య, కొత్తగూడ దేవస్థానం చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలుగూరి రాజు, కారోబార్ తాళ్లపల్లి మల్లయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు మండ సమ్మయ్య,మాజీ సర్పంచ్ కొయ్యడ జనార్ధన్,ముల్కనూర్ సహకార బ్యాంకు డైరెక్టర్ మండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న పుట్ట మధుకర్


### జ్యోత్స్నకు రూ.2లక్షల చెక్కు అందించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్



**కాటారం జూలై 27 (జనం సాక్షి) :** కాటారం మండల కేంద్రానికి చెందిన గంట జ్యోత్స్న ఎంబీబీఎస్ కోర్సు పూర్తయ్యే వరకు ఖర్చులు భరిస్తానని మాట ఇచ్చిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తన మాట నిలబెట్టుకున్నారు. రెండు రోజుల క్రితం భీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బాగంగా గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా ఏడాదికి ఖర్చు అయ్యే రూ.2లక్షల సాయం అందిస్తానని జ్యోత్స్న కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివారం భూపాలపల్లి జిల్లా మొగుళ్ళ పల్లి మండలం ఇస్సిపేట గ్రామంలోనీ శ్రీ లక్ష్మీ సాయి గార్డెన్ లో గంట జ్యోత్స్నకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా రూ.2లక్షల చెక్కు అందజేశారు. మాట ఇచ్చి తన భవిష్యత్‌కు బంగారు బాట వేసిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు జ్యోత్స్న కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ జిల్లాపరిషత్ ఛైర్పర్సన్ జక్కు శ్రీహర్షిణి- రాకేష్ గారు మరియు వారి వెంట, మండల అధ్యక్షులు జోడు.శ్రీనివాస్, రామిళ్ళ.కిరణ్, గాలి.సదవళి, కొండగోర్ల వెంకటస్వామి,జక్కు.శ్రావణ్, నరివేద్ది.శ్రీనివాస్, వంగల రాజేంద్రాచారి, చీమల వంశీ,గుండ్లపల్లి.అశోక్ ఉప్పు.సంతోష్, శ్రీరాముల,రజినీకాంత్, గాజుల విక్రమ్, ప్రమోద్, జాడి శేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా ప్రత్యేక అధికారి హరి కిరణ



**బోథ్, జూలై 27(జనంసాక్షి) :** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి హరి కిరణ అదేశించారు. ఆదివారం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి నీ జిల్లా పాలనాధికారి రాజర్షి షా తో కలిసి సందర్శించారు.ఓపీలను, అత్యవసర సేవ విభాగాలను తనిఖీ చేశారు..వైద్యశాలకు వచ్చిన రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు,మందుల నిల్వల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పిఎసిఎస్ కేంద్రాల్లో అమలవుతున్న ఆన్లైన్ నగదు, ఎరువులు పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. పిఎసిఎస్ ఆగ్రోస్ తదితర దుకాణాల్లో అవసరమైన ఎరువుల నిలువలు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి నరేందర్ రాథోడ్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, తహసిల్దార్ సుభాష్ చంద్ర, ఇతర శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హక్కులకై ఉద్యమిస్తే...
## హత్యాకాండే మిగులుతుంది



బ్రిటిష్ పాలకులు ఆదివాసీ తెగల జీవన అవసరాలకు వ్యతిరేకంగా అడవుల రక్షణ పేరుతో చట్టాలు రూపొందించి, వారిని ఆ చట్టాల పరిధిలోనే పరిమితం చేశారు. వ్యవసాయం సమిష్టి నుంచి వ్యక్తిగత ఆస్తిగా మారడం, భూమికి విలువ ఏర్పడి క్రయవిక్రయాలలోకి రావడం, అటవీ ప్రాంతాల్లో 28 రకాల ఖనిజ నిక్షేపాలు ఉండటం ఈ చట్టాలకు కారణాలు. 'జల్-జంగల్-జమీన్ హమారా' నినాదంతో కొమురం భీం సారథ్యంలో ఆదిలాబాద్ అడవుల్లో జరిగిన తిరుగుబాటు నిజాం ప్రభుత్వాన్ని కుదిపేసింది. తర్వాత నగ్జల్బరీ, తేబాగ, ఉన్నంవాయిలార్ సాయుధ రైతాంగ పోరాటాలు, శ్రీకాకుళం, గోదావరి లోయలలో ఆదివాసీ సాయుధ పోరాటాలు పాలకుల దృష్టిని ఆదివాసీల వైపు తిప్పాయి. ఈ పోరాటాలు ఆదివాసీ హక్కులు, సంక్షేమం కోసం కొనసాగాయి. మధ్య భారతంలో గత రెండున్నర దశాబ్దాలుగా మావోయిస్టు ఆదివాసీ పోరాటాలు బలంగా కొనసాగుతున్నాయి. కానీ, ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని యుద్ధభూమిగా మార్చాయి. 2024 నుంచి 'ఆపరేషన్ కగార్' పేరుతో మోడీ-అమిత్ షా ప్రభుత్వాలు హత్యాకాండలను కొనసాగిస్తున్నాయి. 57 ఎన్‌కౌంటర్లలో 600 మందికి పైగా మావోయిస్టులు, ఆదివాసీలు హతమయ్యారు. ఎమర్జెన్సీకి ముందు, తర్వాత ఏర్పడిన హక్కుల సంఘాలు ఎన్‌కౌంటర్లపై సత్యశోధన చేసి, సత్యాలను బయట పెట్టడానికి ప్రాణాలు త్యాగం చేశాయి. కానీ, కగార్ ఆపరేషన్‌లో హక్కుల సంఘాలు బస్తర్‌లో పర్యటించకుండా, నిజాలు బయటకు రాకుండా అణచివేత జరుగుతోంది. ఇది ప్రజాస్వామ్యంలో హక్కుల సంఘాల దుస్థితిని చూపిస్తుంది. ఇంత నియంతృత్వ అణచివేత జరుగుతున్న చోట ఆదివాసీ హక్కులు ఎలా అమలవుతాయి? అందుకే ఆదివాసీ ఉద్యమాలు తరతరాలుగా కొనసాగుతున్నాయి. ఈ ఉద్యమాల ఫలితంగా 1996 పేసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం, 5వ, 6వ షెడ్యూల్స్ రూపొందాయి. అయినప్పటికీ, ఈ చట్టాలు అమలు కాకుండా అణచివేతకు గురవుతున్నాయి. బీర్సా ముండా కాలం నుంచి సాధించిన హక్కులను కార్పొరేట్ సంస్థల కోసం సవరణల పేరుతో బలహీనం చేస్తున్నారు. హక్కుల కోసం ఉద్యమిస్తే నక్సలైట్లుగా ముద్రవేసి, ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తున్నారు. 2006 అటవీ హక్కుల చట్టం ఆదివాసీలకు అడవులపై, వనరులపై వ్యక్తిగత, సామూహిక హక్కులను గుర్తిస్తుందని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అమలులో లోపాలు కొనసాగుతున్నాయి. గ్రామ సభలకు అధికారాలు ఇచ్చినప్పటికీ, సంపూర్ణ హక్కులు ఆదివాసీలకు అందలేదు. 1995లో దిలీప్ సింగ్ భూరియా కమిటీ నివేదిక ఆధారంగా 1996లో పేసా చట్టం ఆమోదమైంది. ఈ చట్టం గ్రామ సభలకు పరిమిత అధికారాలను కల్పించినప్పటికీ, సంపూర్ణ అధికారాలు ఆదివాసీలకు అందలేదు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కాలంలో షెడ్యూల్డ్ ప్రాంతాల ఖనిజ సంపదను విదేశీ బహుళజాతి సంస్థలకు అప్పగించేందుకు అటవీ విధానాలు రూపొందాయి. ఆదివాసీ ఉద్యమాలపై అణచివేతలో పోలీసులు పంటల విధ్వంసం, మహిళలపై అత్యాచారాలు, హత్యలకు తెగబడ్డారని సి.ఆర్. బిజోయ్ నివేదికలో పేర్కొన్నారు. 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం 10 ఎకరాల భూమి హక్కులు కల్పిస్తామని ప్రకటించినప్పటికీ, ఆచరణలో అమలు కాలేదు. 2008లో అటవీ హక్కుల చట్టం నియమావళి అమల్లోకి వచ్చినా, లోపాల వల్ల ఆదివాసీలకు పూర్తి హక్కులు అందలేదు. స్వేచ్ఛగా జీవించాలనే ఆదివాసీల ఆకాంక్షలను నూతన అభివృద్ధి నమూనా నిర్వీర్యం చేస్తోంది. వారి సంపద, భూమి పరాయీకరణకు గురవుతోంది. దండకారణ్యంలో ఆదివాసీ మహిళలపై రాజ్య యంత్రాంగం విచ్చలవిడి లైంగిక హింస, అమానవీయ చర్యలను కొనసాగిస్తోంది. సాల్వాజుడుం, రిజర్వ్ డిస్ట్రిక్ట్ గార్డ్స్ వంటి సైనిక బలగాలు ఈ హింసలో పాల్గొంటున్నాయి. మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేసే పేరుతో దండకారణ్యం సైనిక మండలంగా మారింది. ఆదివాసీ పల్లెలు, గూడెంలను జల్లెడపట్టి భీభత్సం సృష్టిస్తున్నారు. ఈ హింసకు తగిన ప్రచారం లభించడం లేదు. లైంగిక హింసను శిక్షగా ఉపయోగిస్తున్నారు. మావోయిస్టు ఉద్యమంతో సంబంధం ఉందనే కారణంతో ఈ హింసను విచ్చలవిడిగా కొనసాగిస్తున్నారు. కార్పొరేట్ సంస్థల కోసం 7 లక్షల కోట్ల విలువైన 28 రకాల ఖనిజ సంపద దోపిడీ కొనసాగుతోంది. ఈ హింసా వలయం ఆగాలంటే సమాన హక్కులతో స్థానిక అభివృద్ధి నమూనా రూపొందాలి. కార్పొరేట్ ఒప్పందాలు రద్దు చేయాలి, సాయుధ బలగాలను ఉపసంహరించాలి, కగార్ ఆపరేషన్ నిలిపివేయాలి. చట్టబద్ధ పాలన అమలు కావాలి. ఆదివాసీలకు అడవులపై సంపూర్ణ హక్కు కల్పించాలి. పై నుంచి రుద్దబడే అభివృద్ధి స్థానంలో కింది నుంచి పైకి ఎగబాకే అభివృద్ధి విధానం అమలు కావాలి. సహజ వనరులు సమిష్టి సంక్షేమం కోసం వినియోగించాలి. నేడు జరుగుతున్న యుద్ధం ఆగడంలేదు. మావోయిస్టు పార్టీ 5 నెలలుగా 10 ప్రకటనలతో శాంతి చర్చల కోసం మేధావులతో, అఖిల భారత, రాష్ట్ర స్థాయిలో శాంతి కమిటీల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, ప్రభుత్వం 'చంపేస్తాం, నిర్మూలిస్తాం' అనే భాషను వాడుతోంది. ఉద్యమాలు బలంగా కొనసాగినప్పటికీ, సామాజిక, రాజకీయ, ఆర్థిక, న్యాయ అంశాలు లేకపోతే అవి ఎక్కువ కాలం నిలవవు. మోడీ-అమిత్ షా ప్రభుత్వం ఈ ఉద్యమాలను కార్పొరేట్ సంస్థల కోసం నిర్మూలించాలనుకుంటోంది. శాంతి చర్చలు జరపాలి, కాల్పుల విరమణ ప్రకటించాలి. మధ్య భారతంలో శాంతిని నెలకొల్పాలి, ఆదివాసీ జీవన హక్కులను కాపాడాలి. హక్కుల సంఘాలకు నిజనిర్ధారణకు అవకాశం కల్పించి, సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా హత్యాకాండలపై విచారణ జరిపించాలి. ఇది ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని పెంచుతుంది. కానీ, కార్పొరేట్ సంస్థల కనుసన్నల్లో రాజ్య పాలన సాగుతోంది. పాలకులు, అధికారులు, పోలీసులు, కార్పొరేట్ సంస్థలు, క్రిమినల్స్ కలిసి ఆదివాసీ సంపదను దోచుకుంటున్నారు. చట్టాలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. అవినీతి గతంలో కంటే ఎక్కువైంది. విశాఖ మన్యాలు, ఇతర ఆదివాసీ ప్రాంతాల్లో ఈ సంఘర్షణ కొనసాగుతో ంది. మావోయిస్టు ముద్రతో సాయుధ బలగాలను ఉసిగొల్పితే పోరాటాలు మరింత ఉధృతమవుతాయని చరిత్ర, వర్తమానం చూపిస్తున్నాయి. ఆదివాసీల రోదన అరణ్య రోదనగా మారింది. రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూల్స్‌ను పటిష్ఠంగా అమలు చేస్తే ఆదివాసీ స్థితిగతులు, ఆర్థిక, సామాజిక అంశాల్లో మెరుగుపడతా యి. కానీ, ప్రభుత్వ యంత్రాంగం గాడి తప్పింది. షెడ్యూల్డ్ ప్రాంతాల ఆదివాసీ స్థితిగతులను సమీక్షించి, ప్రత్యేక చర్యలు చేపట్టే అధికారం గవర్నర్, రాష్ట్రపతికి ఉన్నప్పటికీ, దీనిపై శ్రద్ధ చూపడం లేదు. సల్వాజుడుం, గ్రీన్‌హంట్, సమాధాన్, కగార్ వంటి ఆపరేషన్లు ఆదివాసీల జీవన హక్కును అణచివేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామిక ఉద్యమాలు ఆదివాసీలకు అండగా నిలవాలి. ఆదివాసీలు స్వేచ్ఛగా జీవించేం దుకు, వారి భూమి, సంపదను కాపాడేం దుకు ప్రజాస్వామిక శక్తులు ఏకమై పోరాటం చేయాలి.



**ఎన్. నారాయణ రావు**
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

## పెట్రేగిపోతున్న ప్రేమలు



(ఇటీవల వివాహేతర
బంధాల్లో
పెరుగుతున నేర
సంస్కృతికి స్పందిస్తూ
రాసిన కవిత

ప్రేమ తన సాన్నిహిత్యాన్ని
కోల్పోయింది
లాలిత్యానికి
విడాకులిచ్చింది
కఠినత్వాన్ని కర్కషత్వాన్ని
వెళ్ళకక్కుతుంది

గట్లు తెగిన ప్రేమదాహాలు
గడపలు దాటిన
మొహాలు
దాంపత్య జీవిత
అసంతృప్తి
విలాసాల విందు
బోగలాలసత
కూడ పలుక్కొని ప్రేమను
మోసం చేస్తున్నాయి
కట్టుబాట్లను కొట్టి
పారేస్తూ

ప్రేమకు కామానికి మధ్య
లక్ష్మణ గీతను
చెరిపేస్తున్నాయి

యువ దంపతుల్లో
అసహనం అసంతృప్తి
రాజీపడే ధోరణులు
సన్నగిల్లి అనుమానాల
పెనుభూతం
ఆవరించింది
ప్రేమరాహిత్యం
రాజ్యమేలుతుంది

ప్రేమ నశించి పగ
ప్రతీకారాలు ఉక్రోష
జ్వాలల్లోభార్యాభర్తలు
చిక్కుకుపోయి
దంపతుల
మధ్య ఉండాల్సిన
విశ్వసనీయత
అంతరించింది

భార్యాభర్తను
హత్యచేయడం
భర్త భార్యను
హత్యచేయడం
ఇటీవల సమాజంలో
నిత్యకృత్యమైంది

గృహ హింస
హింసాత్మక ధోరణులు
పేట్రేగిపోతున్నాయి
సమాజాన్ని రక్షించే
మెరుగైన కుటుంబ
వ్యవస్థ పునర్జీవనానికి
పాటుపడుదాం

ప్రేమ పూరితమైన
పెంపకం
పరిష్కార మార్గాలు
తెలిసిన
మనసులను
రూపొందిస్తాం

కుటుంబ సభ్యులకు
ఆత్మీయత ప్రేమ
ఆప్యాయత
సంస్కృతినీ నేర్పిద్దాం

ప్రేమ ప్రేమగా ఉంటే
ఊపిరి
పోస్తుంది ఉన్మాద స్థితికి
చేరితే ఉసురుతీ స్తుంది

సామాజిక మాధ్యమాలు
భలి కోరుకుంటున్న
ప్రేమలను అంటు
వ్యాధులా వ్యాపింప
చేస్తున్నాయి
జీవితంలో సంతోషాన్ని
త్యాగాన్ని ఆనందాన్ని
ఇవ్వాల్సిన ప్రేమ వక్రించి
మనుషుల జీవితాలను
భలికొంటుంది

నిష్కళంక ప్రేమలను
ప్రోత్సహించే సామాజిక
సాంస్కృతిక
వాతావరణాన్ని సృష్టిద్దాం
ప్రేమే మానవ జాతి
వికాసానికి మార్గమని
విశ్వసిద్ధాం మమత
అనురాగాల
పరిమళాలను
సమాజంలో
వెదజల్లుదాం

**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్
ఫోరం సామాజిక ఆర్థిక
అధ్యయన వేదిక
కరీంనగర్
9440245771

## బ్రహ్మ పాదాలు!



పేదలంతా కలవకుండా
ఎదురు తిరగకుండా
మానసానికిమగ్గిపోయేజ
ఉద్దేశ్య పూర్వక రచనే
చాతుర్వర్ణ సిద్ధాంతం!
తల భుజాలు తొడలు
పాదాలు..జన్మస్థలాలా!
ఇదెక్కడి సిద్ధాంతం!
అవకాశాలు ఇవ్వకుండా
తప్పించటానికే ఈ మాయ

అవకాశం దొరకబట్టే
అంబేద్కర్ రాణించాడు!
అవకాశాల్లేక నా దేశం
ఎందరో అంబేద్కర్ లను
కోల్పోవటం నిజం!
ఈ సిద్ధాంతం'తప్పు'అని

పేదలకు అర్థమయ్యేట్టు
పేటల్లో గట్టిగా చెప్పండి
తక్కువఎక్కువల్లేవని
పేదలంతాఒక్కటేనని!
బ్రహ్మ పాదాల పుట్టటం
'అగ్ర'సేవలతోచావటం
ఇదంతామాకర్మఅంటారు
ఇంతకంటే ద్రోహం లేదు!
ఇంతకంటే ద్రోహుల్లేరు!

**తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## కొత్త మాట

మీకు కావలసిన
గొప్ప విషయాలన్నీ నేర్పించే
అద్భుతమైన శక్తులు
తల్లిదండ్రులు, గురువులు మాత్రమే
అడగకుండా అన్నీ ఇచ్చే
వారిని మీరు అమితంగా ప్రేమించండి
ఇష్టంగా.. క్షుణ్ణంగా పరిశీలించండి.
ఎన్నో పుస్తకాలు చదివినంత
విజ్ఞానం మీకు లభిస్తుంది.

**కొత్త అనిల్ కుమార్**



## తెలంగాణ కవితా
# భాస్వరం అన్నవరం



తెలంగాణ మలి ఉద్యమాన్ని మలుపు దిప్పిన కరీంనగర్ సాహిత్య ఉద్యమానికి కూడా కేంద్రమైంది.అక్కడి నుండి వివిధ ప్రక్రియలలో వెలువడిన రచనలు తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత నిబద్ధతను సమకూర్చాయి. అలాంటి విశిష్ట వినూత్న రచనలు చేసిన కవితా స్వరమే అన్నవరం దేవేందర్. తెలంగాణ భాష యాస సంస్కృతులు అవహేళనకు గురవుతున్న కాలం లో ఎడారిలో వయాసిస్టుల ఆయా కవితల్లో దేవేందర్ దట్టించి పేల్చిన తెలంగాణ మాండలికం ఎందరినో ప్రభావితం చేసింది. సమైక్య పాలనలో సందు గల్లోనే పాత బట్టలు లాగా మిగిలిన మండలికం దేవేందర్ కవితా సంపుటాల పుణ్యమా అని పట్టుబట్టల్లాగా రూపుదిద్దుకున్నాయి. అన్నవరం సమకాలీన సామాజిక స్పృహతో సమూహంతో నడిచాడు కాబట్టే అతని కవిత్వానికి సాహిత్యంలో ఒక స్వయం ప్రతిపత్తి ఉంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుషత్వానికి వ్యతిరేకంగా అగ్ని ధార కురిపించి రుద్రవీణ వాయించి మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలను పురస్క రించుకొని ఆ స్ఫూర్తితో మలిదశ తెలంగాణ ఉద్యమంలో విశిష్ట రచనలు చేసిన అన్నవరం దేవేందర్‌కు ఆ మహాకవి పేర పురస్కారాన్ని అందించటం అభినందనీయం. ఈ సందర్భం గా మిత్రులు అన్నవరం దేవేందర్ గారికి హార్దిక అభినందనలు.


తేదీ 17.10.1962 న పోతారం గ్రామంలో దశరథం కేదారమ్మ దంపతులకు జన్మించిన అన్నవరం ఎంఏ సామాజిక శాస్త్రాన్ని అధ్యయనం చేశారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగించారు. చదువుకున్న చదువు చేస్తున్న ఉద్యోగం రెండు నిత్యం సమాజంతో సంబంధం ఉన్నవే కనుక సహజంగానే స్పందన గల దేవేందర్ గ్రామీణ జీవనం, పల్లె భాష, అట్టడుగు వర్గాలు, తెలంగాణ ఉద్యమం, ఉనికి, ప్రపంచీకరణ తదితర అంశాలన్నీ వస్తువుగా తీసుకొని ఇప్పటివరకు 12 కవిత సంపుటాలను వెలువరించారు. ఇప్పటివరకు ఆయన రచించిన తొవ్వ, నడక, మంకమ్మ తోట లేబర్ అడ్డా, బొడ్డు మల్లె చెట్టు, పొద్దుపొడుపు, ఒక్కిలి వాకిళ్ళ పులకరింత, బువ్వకుండ, ఇంటి దీపం, వరి గొలుసులు, గవాయి, జీవన తాత్పర్యం ముఖ్యమైనవి. మరో కోణం, ఊరి దస్తూరి అన్నవి వ్యాస సంపుటాలు కాగా తాజాగా వెలువడిన అంతరంగం వర్తమాన సామాజిక జీవిత చిత్రణ. అన్నవరం దేవేందర్ 2005లో వెలువరించిన మంకమ్మ తోట లేబర్ అడ్డా అనే కవితా సంపుటి డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశం కాగా పొక్కిలి వాకిళ్ల పులకరింతకు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కవితా సంపుటిగా పురస్కారాన్ని అందజేసింది.

ప్రపంచీకరణ పేరుతో ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలను వాటి చరిత్ర సంస్కృతులను అణచివేస్తున్న తరుణంలో అన్నవరం"నా ప్రాదేశికత ముందు, ప్రపంచీకరణ గుడ్డ పేలిక అని ఈసడించాడు. అంతేకాదు విస్తరిస్తున్న విస్వీకరణకు ప్రాంతీయాత్మే ప్రతిఘటన అంటూ జవాబిచ్చారు. ఆప్యాయతకు అనురాగానికి మారుపేరు పల్లెలు. అందుకే అక్కడ కులాలకు మతాలకు అతీతంగా ప్రజలంతా వరుసలు పెట్టుకొని పిలుచుకుంటారని గుర్తు చేస్తూ "పూసిన తంగేడు పూలు, తాంబాలాలలో, బతుకమ్మ అయినట్లు, పల్లె కడుపునిండా, అందరికి అందరూ కలుస్తారు అని గుర్తు చేశారు. ఆధునికత వల్ల ఊరంతా మారుతున్న ఆధిపత్యవర్గాల భావజాలం అలాగే ఉందని చెబుతూ"గడి గుడి పదిలంగానే ఉంది, చింతలు యాపలు పెరిగి విరుగుతున్న, మర్రి మాత్రం కొత్త ఊడలతో నిలబెడుతుంది అంటూ మరో నయా రూపంలో వస్తున్న ఫ్యూడల్ వ్యవస్థను జ్ఞాపకం చేశారు. పంచాయతీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల దాకా పొద్దు తిరుగుడు పువ్వుల్లా ప్రజల చుట్టే తిరిగే నాయకులను వారి చేతలను గురించి రాస్తూ"ఐదోద్దులు చుట్టు తిరుగు తరు, ఐదేళ్లదాకా చుట్టూ తిప్పుతరు"అంటూ వారి నైజాన్ని వ్యక్తం చేస్తూ"మా ఓట్లకు పుట్టిన బాపులు, జర చెప్పుండ్రి అయ్యలాల, అడుగుల్లేని కదుముంతలు, నీళు మూలె కట్టినట్లు, మాట్లాడకుండ్రి"వారి చేతగానితనాన్ని అమలుపరచలేని వాగ్దానాలను ఇవ్వొద్దని పరోక్షంగా హెచ్చరించాడు. ఆరుగాలం కష్టపడిన తెచ్చిన అప్పు తీర్చలేక అతివృష్టి అనావృష్టి మరోవైపు గిట్టుబాటు ధర లేకుండా దగా చేసే దళారుల మధ్య అష్ట కష్టాలు పడుతున్న అన్నదాత" బతుకుదామంటే బతుకనిస్తా లేరు, మెతుకు లేని బతుకెందుకు, నామీద నాకే ఒకా రం పుడుతుంది... పచ్చి పులుసు కన్నా పల్చనైన, గోవుల సుంటోళ్లం, గోస తగిలి సస్తరు.. అంటూ వ్యవస్థను హెచ్చరిస్తూ భార్యకు"ఆఖరి మాట"ను వినిపించిన రైతు ఆక్రందన పాఠకుల మనసుల్ని ద్రవింప చేస్తుంది. పల్లెల్లో వర్షాలు లేక చేసుకోవడానికి పనులు దొరకక రైతులు దగ్గరలోని పట్టణాలకు వెళ్లి వలస కూలీలుగా మారిన వైనాన్ని చిత్రిస్తూ"మంకమ్మ తోట లేబర్ అడ్డా"పేరుతో రాసిన కవిత తెలంగాణ జీవన చిత్రపటాన్ని ఆవిష్కరిస్తుంది. ఇది కరీంనగర్ కే కాదు తెలంగాణ అంతటికి ప్రాతినిధ్యం వహిస్తున్న కవిత."పల్లె తరిమితే, పక్షులన్నీ అడ్డా మీద వాలుతాయి, చినుకులు కురువని పల్లెలు, ఎల్లగొడితే అడ్డ మీద కూలీలు అయిరీ"అని అక్షరీకరించాడు. వాయు జల శబ్ద కాలుష్యాలు పర్యావరణాన్ని దెబ్బతీస్తే వాక్ కాలుష్యం సమాజంలోని సంస్కారాన్ని దెబ్బతీస్తుందని వివరిస్తూ"మాట"గురించి అద్భుతమైన కవిత రాశాడు."పెదవుల నుంచి రాలి పడుతున్న, మాటల తరంగాలు, కాసానికి కొలమానాలు.. అంటూ మాటలు హృదయాలు కెలికినట్లు కాదు, అందంగా అలికినట్లు ఉండాలి"అని ప్రబోధించారు. ఇలా ఎన్నో నిత్య నైమి త్తికాంశాలను వస్తువుగా తీసుకొని అన్నవరం దేవేందర్ రాసిన కవిత్వం పాఠకుల హృదయాలకు సాన్ని హిత్యం సమకూరుస్తుంది. ముఖ్యంగా ఆయన ప్రయోగించిన"అనుం, నెవులు, కీస, తెర్లు, పొంటె, ఏతులు, గుడాలు, సొక్క, సోపతి, మొదలైన పదాలు స్థానిక పరిమళాన్ని అద్దుతున్నాయి. వస్తువు, అభివ్యక్తి, శిల్పం, శైలి వైవిధ్యం కలిగిన అన్న వరం దేవేందర్ కవిత్వం మరెంతో మందికి స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను. అభినందనలు.



**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**
99 891 48 305

# జనాభా పెరుగుదల, పర్యావరణ సమతుల్యత



జనాభా పెరుగుదల, పర్యావరణం మధ్య పరస్పర చర్యల గురించి అధ్యయనం, చర్చకు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఉదాహరణకు, బ్రిటిష్ ఆలోచనాపరుడు మాల్థస్ ప్రకారం, పెరుగుతున్న జనాభా వ్యవసాయ భూమిపై ఒత్తిడిని కలిగిస్తుంది, ఇది పర్యావరణ క్షీణతకు కారణమవుతుంది, అధిక, తక్కువ నాణ్యత గల భూమిని సాగు చేయమని బలవంతం చేస్తుంది. ఈ పర్యావరణ క్షీణత చివరికి వ్యవసాయ దిగుబడి, ఆహార లభ్యత, కరువు, వ్యాధులు, మరణాలను తగ్గిస్తుంది, తద్వారా జనాభా పెరుగుదల రేటును తగ్గిస్తుంది. జనాభా పెరుగుదల, పర్యావరణం యొక్క సమీకరణ సామర్థ్యంపై ఒత్తిడిని పెంచుతుంది కాబట్టి, గాలి, నీరు, ఘన-వ్యర్థాల కాలుష్యానికి కూడా ఒక ప్రధాన కారణంగా పరిగణించబడుతుంది. ఫలితంగా, మాల్థస్ సిద్ధాంతీకరించిన ప్రకారం, ఆదాయం, పర్యా వరణ నాణ్యత రెండింటిలోనూ తక్కువ స్థాయిలను అనుభవించే సమతౌల్య జనాభా. మాల్థస్ పేద చట్టాలను రద్దు చేయడంతో పాటు మానవ జనాభాపై సానుకూల నివారణ బలవంతపు నియంత్రణను సూచించాడు.

1798, 1826 మధ్య ప్రచురించబడిన మాల్థస్ సిద్ధాంతం అప్పటి నుండి విశ్లేషించబడింది, విమర్శించబడింది. ఉదాహరణకు, అమెరికన్ ఆలోచనాపరుడు హెన్రీ జార్జ్, మాల్థస్‌ను తోసిపుచ్చడంలో తన లక్షణమైన విచిత్రతతో గమనించాడు: "జైహాక్, మనిషి ఇద్దరూ కోళ్లను తింటారుబీ కానీ ఎక్కువ జైహాక్‌లు, తక్కువ కోళ్లు, ఎక్కువ మంది పురుషులు, ఎక్కువ కోళ్లు." అదేవిధంగా, అమెరికన్ ఆర్థికవేత్త జూలియన్ లింకన్ సైమన్ మాల్థస్ సిద్ధాంతాన్ని విమర్శించారు. మానవ చరిత్ర యొక్క వాస్తవాలు మాల్థస్ నియో-మాల్థుసియన్ల అంచనాలను లోపభూయిష్టంగా నిరూపించాయని ఆయన గుర్తించారు. 20వ శతాబ్దంలో భారీ రేఖాగణిత జనాభా పెరుగుదల మాల్థుసియన్ విపత్తుకు దారితీయలేదు. సాధ్యమయ్యే కారణాలు: మానవ జ్ఞానంలో పెరుగుదల, ఉత్పాదకతలో వేగవంతమైన పెరుగుదల, ఆవిష్కరణ మరియు జ్ఞానం యొక్క అనువర్తనం, వ్యవసాయ పద్ధతుల్లో సాధారణ మెరుగుదలలు (పారిశ్రామిక వ్యవసాయం), పని యొక్క యాంత్రీకరణ (ట్రాక్టర్లు), ఇతర మొక్కలలో అధిక దిగుబడి రకాల బియ్యం, గోధుమలను ప్రవేశపెట్టడం (హరిత విప్లవం), పంట తెగుళ్లను నియంత్రించడానికి పురుగుమందుల వాడకం పెరిగింది. దీనితో వ్యవసాయ దిగుబడులు కూడా గణనీయంగా పెరిగినప్పటికీ వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

2.ఎకాలజీ అనేది శాశ్వత ఆర్థిక వ్యవస్థ, పర్యావరణవేత్త సుందర్ లాల్ బహుగునచే ప్రాచుర్య, సహజ వనరులు వాటిని పరిరక్షించకుండా ఆర్థిక స్థిరత్వాన్ని దోపిడీ చేయకుండా ఆర్థిక అభివృద్ధి అసాధ్యం అనేది నిజం. వాతావరణ మార్పులు జీవ వైవిధ్యం వేగంగా కోల్పోవడం వంటి తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొం టున్నప్పుడు, ఈ ఆలోచనను మనం నిజంగా అర్థం చేసుకున్నామా, స్వీకరించారా అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి.

**సరైన సమతుల్యతను కొట్టడం:**

ప్రకృతి సంక్లిష్టతను అర్థం చేసుకోవడం సైన్స్ యొక్క గుండె వద్ద ఉంది. ఈ ప్రయత్నంలో, మానవులు పరిశీలన, ప్రయోగాలు, మోడలింగ్ ద్వారా విపరీతమైన ప్రయత్నాలు చేశారు, ఎందుకంటే వాతావరణ మార్పు వంటి పర్యావరణ సవాళ్లను పరిష్కరించడానికి, స్థిరమైన పద్ధతులను తెలియజేయడానికి ఈ అవగాహన చాలా ముఖ్యమైనది. ఈ శాస్త్రీయ చర్చలు విలువైనవి అయితే, పర్యావరణ శాస్త్రంపై దృష్టి పెట్టవలసిన మరింత అత్యవసర, ప్రాథమిక సత్యం నిజమైన ఆర్థిక వ్యవస్థ-మన మనుగడ, భద్రత, పురోగతి దానిపై ఆధారపడి ఉంటుంది. సరళంగా చెప్పాలంటే, పర్యావరణాన్ని పరిరక్షించడం, ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం సరైన సమతుల్యతను కనుగొనే స్థిరత్వాన్ని నిర్వచించడానికి ఇది స్పష్టమైన మార్గం కావచ్చు. ఈ సమతుల్యత లేకుండా, పర్యావరణం లేదా ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలంలో వృద్ధి చెందదు. జంతు రాజ్యంలో భాగం అయిన ప్పటికీ, మానవ పరిణామం, నాగరికత ద్వారా, ప్రకృతి నుండి పెరుగుతున్న డిస్కనెక్ట్‌కు దారితీసింది. ప్రకృతితో ఈ డిస్కనెక్ట్ కొనసాగుతున్న జీవవైవిధ్య నష్టానికి ఒక కారణం (జీవవైవిధ్యం ,పర్యావరణ వ్యవస్థ సేవలు లేదా ఐపిబిఎస్ ట్రాన్స్ఫర్మేటివ్ చేంజ్ రిపోర్ట్ పై ఇటీవలి ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్-పాలసీ ప్లాట్‌ఫాం) మానవ చరిత్ర యొక్క ప్రారంభ దశలలో సంచార జీవనశైలి వ్యక్తులు సహజ వనరులపై ఆధారపడటానికి, వారి ప్రాథమిక, రోజువారీ మనుగడ అవసరాల కోసం మాత్రమే దోపిడీకి గురి చేసింది. కాలక్రమేణా, ఇది వ్యక్తిగత-కేంద్రీకృత వనరుల ఉపయోగం పెరుగుతున్న సంఘాల అవసరాలను తీర్చడానికి ఉద్దేశించిన సామూహిక వినియోగంగా పరిణామం చెందింది. మానవ సమాజాలు విస్తరించి, తమను తాము దేశాలుగా నిర్వహించడంతో, ఈ డిమాండ్ మొత్తం దేశాల అవసరాలను తీర్చడానికి మరింత స్కేల్ చేసింది. చివరికి, ఈ పురోగతి ప్రపంచ పోటీకి దారితీసింది, ఇక్కడ దేశాలు ప్రకృతిని దోపిడీ చేయడం ప్రారంభించాయి .మనుషుల మాదిరిగా కాకుండా, జంతువుల రాజ్యంలోని ఇతర జాతులు ఏ పెద్ద-స్థాయి, సహజ వనరుల యొక్క ముందస్తు దోపిడీ యొక్క ఈ నమూనాను ప్రదర్శించవు. ఇతర జంతువులు తమ పరిసరాలతో సామరస్యంగా జీవిస్తాయి, వారు నివసించే పర్యావరణ వ్యవస్థల యొక్క దీర్ఘకాలిక సమతుల్యతకు భంగం కలిగించకుండా, తక్షణ మనుగడ కోసం అవసరమైన వాటిని మాత్రమే తీసుకుంటాయి. వర్గీకరణ, జీవావరణ శాస్త్రం, మడ అడవులు, సీగ్రాస్‌ల బయోజెకెమిస్ట్రీపై ఆసక్తి ఉన్న శాస్త్రవేత్త. అతను భారతదేశంలోని బ్లూ కార్బన్ ఆవాసాలలో మడ అడవులు, కార్బన్ డైనమిక్స్ పరిరక్షణ నిర్వహణపై పనిచేస్తున్నాడు ఈ సూత్రాన్ని అంగీకరించడం మానవ మనుగడకు పర్యావరణ ఆరోగ్యంపై దృష్టి పెట్టడానికి దారితీస్తుంది. ఆర్థిక స్థిరత్వం వాతావరణ స్థితిస్థాపకత మానవ వినియోగం, ప్రపంచ పోటీ యొక్క ఎప్పటికప్పుడు తీవ్రతరం చేసే చక్రం గ్రహం యొక్క పర్యావరణ వ్యవస్థలపై అపూర్వమైన ఒత్తిడిని కలిగి ఉంది, వాతావరణ పరిమితి యొక్క పిఏఎస్‌ను గణనీయంగా వేగవంతం చేసింది, సహజ దృగ్విషయాన్ని ఇప్పుడు మానవ కార్యకలాపాల ద్వారా ప్రమాదకరంగా విస్తరిం చింది. పెరుగుతున్న ఈ పర్యావరణ సవాళ్లకు ప్రతిస్పందనగా, ప్రపంచ పరిరక్షణ ప్రయత్నాలలో ప్రకృతి-ఆధారిత పరిష్కారాలు విస్తృతంగా సూచించబడ్డాయి, ఈ విధానాలు వాతావరణ ప్రభావాలను తగ్గించడానికి, జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించడానికి, స్థిరమైన అభివృద్ధికి తోడ్పడటానికి పర్యావరణ వ్యవస్థల యొక్క స్వాభావిక స్థితిస్థాపకతను ప్రభావితం చేయడం లక్ష్యంగా పెట్టుకుంటాయి. ఏదేమైనా, ఒక పారడాక్స్ ఉద్భవించింది: మన అవసరాలు, దురాశను తీర్చడానికి మేము ప్రకృతిని దోపిడీ చేస్తూనే ఉన్నాము, అదే సమయంలో అదే సహజ వ్యవస్థలపై ఆధారపడటం అటువంటి దోపిడీ యొక్క పరిణామాలకు వ్యతిరేకంగా బఫర్‌గా పనిచేయడానికి. ఈ ద్వంద్వ ఆధారపడటం క్రియేటిన్‌లోతైన పర్యావరణ అసమతుల్యతను దెబ్బతీస్తుంది, వాతావరణ సిఆర్‌ఐని సమర్థవంతంగా పరిష్కరించే సామర్థ్యాన్ని మరింత క్లిష్టతరం చేస్తుంది. ఈ సందర్భంలో, శాస్త్రీయ దృక్కోణం నుండి పర్యావరణ వ్యవస్థల యొక్క క్లిష్టమైన సంక్లిష్టతను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం కంటే. గుర్తించడానికి చాలా క్లిష్టమైనది.

3.దీర్ఘకాలిక నాయకత్వానికి స్వల్పకాలిక దోపిడీ, పర్యావరణ ఆరోగ్యాన్ని అడ్డంకిగా కాకుండా, మానవ మనుగడ, ఆర్థిక స్థిరత్వం, వాతావరణ స్థితిస్థాపకత యొక్క పునాదిగా ఉంచడం. ఈ పరిపూర్ణత సకాలంలో మాత్రమే కాదు, కొనసాగుతున్న పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడం, స్థిరమైన భవిష్యత్తును రూపొందించడం చాలా అవసరం. ఈ రీఫ్రామింగ్ ద్వారానే మానవత్వం రియాక్టివ్ పరిరక్షణ నుండి క్రియాశీల గ్రహాల సుస్థిరతకు వెళ్ళగలదు. వాతావరణ సంక్షోభం కేవలం శాస్త్రీయ సవాలు కాదు. ఇది మన ఉనికి యొక్క పర్యావరణ పునాదులతో నైతిక , అస్తిత్వ లెక్క.ప్రకృతి వాతావరణ మార్పులతో తిరిగి కనెక్ట్ అవ్వవలసిన అవసరం, జీవ వైవిధ్యం యొక్క పంపిణీ విధానాలలో మార్పు గ్రహం భూమికి కొత్తది కాదు. ఏదేమైనా, ఇప్పుడు సంభవిస్తున్న రేటు మానవులు గత స్థిరమైన అభివృద్ధి కార్యకలాపాల కారణంగా ప్రజలతో సహా గ్రహం యొక్క జీవ వైవిధ్యానికి హానికరం. అందువల్ల, మనకు అవసరమైన మార్పు లోపలి నుండి రావాలి.ప్రపంచవ్యాప్తంగా అన్ని అభివృద్ధి కార్యకలాపాలు మానవ అవసరాలను తీర్చడం లక్ష్యంగా ఉన్నందున, ప్రపంచ సుస్థిరత కార్యక్రమాల విజయాన్ని నిర్ధారించడానికి స్థిరమైన జీవనశైలిని అవలంబించడం ప్రతి వ్యక్తి యొక్క బాధ్యత. దీన్ని సాధించడానికి, మానవులు ప్రకృతిలో అంతర్భాగం అని మనం గ్రహించాలి. ఆ ఉన్న చారి సాంకేతిక పురోగతులు ప్రకృతి నుండి ఆధునిక జీవనశైలిని దూరం చేసినప్పటికీ, మానవులను కలిగి ఉన్న ఒక ప్రత్యేకమైన సహజ లక్షణం అనేది భావోద్వేగాన్ని ఉపయోగించి ప్రకృతితో తిరిగి కనెక్ట్ అయ్యే శక్తి (ఇది ఇప్పటికీ మనలో నివసిస్తుంది). అందువల్ల, ప్రకృతితో మన భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేయడానికి భవిష్యత్ పరిరక్షణ ప్రయత్నాలను రూపొందించాలి. దీనిని మండించటానికి, "పర్యావరణ శాస్త్రం శాశ్వత ఆర్థిక వ్యవస్థ" అని గ్రహించడం, పర్యావరణ సంక్లిష్టతను అర్థం చేసుకోవడం కంటే అత్యవసరం.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

# సంక్షోభంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

- ప్రజా ఉద్యమాలే మార్గం..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్

**కాప్రా, జూలై 27 (జనం సాక్షి) :** మతతత్వ రాజకీయాలకు కార్పొరేట్ శక్తులు మద్దతు ఇవ్వడం దేశానికి అత్యంత ప్రమాదకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ హెచ్చరించారు. ఆదివారం మేడ్చల్ జిల్లా సిపిఎం కార్యాలయం కమలానగర్‌లో జరిగిన సిపిఎం శాఖా కార్యదర్శుల విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జె.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ హాజరయ్యారు. ఈ సమావేశ ప్రారంభంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్‌కు నివాళి అర్పిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నయా ఉదారవాద విధానాలు, పెట్టుబడిదారులకు అనుకూలంగా రూపొందిన ఆర్థిక విధానాలే ఈ దుస్థితికి కారణం. అమెరికాలో కోవిడ్ అనంతర కాలంలో పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. నిరుద్యోగం, వలసలు పెరిగాయి. తమ ప్రయోజనాల కోసం అమెరికా యుద్ధాలను ప్రోత్సహిస్తోంది. చైనాతో వాణిజ్య యుద్ధాలు కొనసాగిస్తున్నది. భారతదేశంలోని పరిస్థితులపై




మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం నయా వాద విధానాలను అమలు చేస్తూ, దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతోంది. నిజ వేతనాలు తగ్గిపోతున్నాయి. సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. అమెరికాతో వ్యాపార ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం కలుగుతోంది. పాలు, సోయాబీన్ దిగుమతుల కారణంగా పంటలకు ధరలు పడిపోతున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల పరిస్థితులను ఉదాహరణగా చెబుతూ, "ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ ఆదేశాలతో ఆ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. భారత్ కూడా అదే దిశగా వెళ్లే ప్రమాదం ఉంది. ప్రజలే దీనికి ప్రతిఘటించాలి," అని పిలుపునిచ్చారు. మతతత్వ శక్తుల కుట్రల్ని విశ్లేషిస్తూ.. పాల్గాం దాడి సందర్భంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మోడీ మౌనంగా ఉండడం అనుమానాస్పదం. హిందుత్వాన్ని ముందుకు తేవాలనే కుతంత్రమే కనిపించింది అన్నారు. భారత్ నాలుగో ఆర్థిక శక్తిగా మారుతోంది అనే మోడీ మాటలు, కేవలం కార్పొరేట్‌లకు మద్దతుగా ఉన్నవే. సామాజిక అసమానతలు పెరిగిపోతున్న దేశంలో ఇది అర్థవంతమైన వాదన కాదు. ప్రభుత్వ రంగాన్ని సర్వనాశనం చేసి, సహజ వనరులను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు మావోయిస్టులపై ఆపరేషన్ కగార్ పేరుతో దాడులు చేయడం కుట్రే, అని పాలడుగు భాస్కర్ విమర్శించారు. ఈ సంక్షోభ పరిస్థితుల నుంచి బయటపడాలంటే ప్రజా ఉద్యమాలు, సామూహిక పోరాటాలే మార్గమని స్పష్టం చేశారు. అన్ని రంగాలలో ప్రజలతో కలిసి ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం కొనసాగించాలి. సమస్యలపై ప్రజా ఆందోళనలతో పాటు, పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలి అని అన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.రవి మాట్లాడుతూ.. స్థానిక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి. పార్టీ కార్యకలాపాల్లో యువతను ఆకర్షించేందుకు మరింత ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐ.రాజశేఖర్, ఎ.అశోక్, ఎం.వినోద, కమిటి సభ్యులు, సీనియర్ నాయకులు, పూర్తి కాలం కార్యకర్తలు, శాఖా కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక వర్షాలతో పాడైన పత్తి పంట

- తీవ్ర ఆందోళనకు గురైన అన్నదాత



**న్యాల్‌కల్, జూలై 27 (జనం సాక్షి) :** ఆరుగాలం శ్రమించే అన్నదాతకు కురుస్తున్న అధిక వర్షాలతో పలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రధానంగా లోతట్టు వ్యవసాయ భూముల్లో సాగుచేసిన పంటలకు అధికంగా నష్టం వాటిల్లింది. పంట పొలాల్లో వర్షం నీరు చేరడంతో పంటలు వాడి పోయాయి. మండలంలోని కాకిజనవాడ గ్రామానికి చెందిన రైతు బేగరి నాగప్పకు చెందిన పత్తి పంటకు నష్టం వాటిల్లింది. దాదాపు రెండు ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట దెబ్బతిందని బాధిత రైతు వాపోయాడు. ఎకరానికి రూ:20 / 25 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పత్తి పంటకు కురుస్తున్న అధిక వర్షంతో పంటంతా పాడైందని ఆందోళనకు గురయ్యాడు. ఎకరానికి దాదాపు 10 /12 క్వింటాల మేర దిగుబడి వచ్చే పత్తి పంట ప్రస్తుతం ఎకరాకు కనీసం 4/5 మేర దిగుబడి వచ్చే అవకాశాలు లేకుండా పోయాయని రైతు నాగప్ప తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అధిక వర్షాలతో గ్రామంలోని మరికొందరి రైతులకు చెందిన పత్తి పంటకు అధికంగా నష్టం వాటిల్లింది. సంబంధిత వ్యవసాయ అధికారులు పరిశీలించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ దృష్టికి "జనం సాక్షి" తీసుకుపోగా.. అందుకు సానుకూలంగా స్పందించిన ఏఓ.. అధిక వర్షం కారణంగానే పత్తి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. వెంటనే సంబంధిత ఏఈఓ తో కలిసి పత్తి పంటను పరిశీలించనున్నట్టు ఏఓ తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

**శామీర్‌పేట్, జూలై 27 (జనం సాక్షి) :** ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రిజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు.ఆదివారం రోజు తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవర యాంజాల్ లో న్యూ కాలనీ యూత్ ఆధ్వర్యంలో జీవీకే గ్రీన్ హెల్త్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి సుమారు 72 మందికి రక్త, షుగర్,థైరాయిడ్ పలు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్య క్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రిజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్,తూంకుంట మున్సి పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి ,మాజీ కౌన్సిలర్ పచ్చిమాడ్ల నర్సింగ్ రావు గౌడ్ ,ఆర్గనైజర్ కౌడే రూప్ కిరణ్ ,న్యూ కాలనీ యూత్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జీవీకే గ్రీన్ హెల్త్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పలు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం ద్వారా పేద ప్రజలకు మేలు జరుగుతుందని



ఇటువంటి వైద్య శిబిరాలు పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు జీవీకే గ్రీన్ హెల్త్ హాస్పిటల్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ పోటీ

- ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సాయి మహరాజ్

**చారకొండ, జూలై 27 (జనంసాక్షి) :** ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు చారకొండ మండలంలో ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ మహారాజ్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు సాయి మహరాజ్ గారు హాజరై వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని మండలాల్లో మరియు గ్రామాల్లో ఎంపీటీసీ,జెడ్పిటిసి సర్పంచ్,వార్డ్ మెంబర్లు గా పోటీ చేస్తుందని తెలియజేశారు. అదేవిధంగా ధర్మ సమాజ్ పార్టీ చారకొండ మండల ప్రజలందరికీ వారి సమస్యలు తీర్చడానికి వారికీ కావలిసిన విద్య వైద్యం, ఉపాధి కల్పించడానికి ఎల్లపుడు సిద్ధంగా ఉంటుందని, పార్టీ ఎజెండానే మొదటగా ప్రతి వ్యక్తికి ఉచితంగా విద్య, వైద్యం మరియు ఉపాధి కల్పించడం అని అన్ని అవకాశాలను యువతకు ఉపాధి కాల్పిస్తామని తెలియజేశారు. పార్టీ కార్యకర్తలందరు రాబోయే స్థానిక



ఎన్నికల్లో పోటీ చేయుటకు సిద్ధంగా ఉండాలని భవిష్యత్ కార్యాచరనను వివరించారు యువత ఎక్కువగా పోటీచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ మహారాజ్, మండల నాయకులు వెంకటేష్, పరుశురాం, సంజీవ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య తెలంగాణ సాధించడమే లక్ష్యం

- ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



**శంకర్‌పల్లి, జూలై 27 (జనం సాక్షి) :** పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఆరోగ్య తెలంగాణ సాధించడమే లక్ష్యంగా వైద్యులు కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్ విఫ్ మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి సూచించారు.రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్ లో బెజుగం రాజేశ్వర్, బెజగం వినయ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాణ: ఆసుపత్రిని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులు కనిపించే భగవంతునితో సమానమని, పేద ప్రజల ప్రాణాలను కాపాడుతూ మంచి వైద్యం అందించాలని సూచించారు. వైద్యో నారాయణో హరి:అంటే వైద్యులు దేవుడితో సమానమని అనే సూక్తిని గుర్తెరిగి వ్యాపార ధోరణితో కాకుండా సేవా భావంతో చికిత్సలు అందించాలని సూచించారు. అంతకుముందు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధర్మన్నగారి వెంకట్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్ ఆయా పార్టీల నాయకులు పుర ప్రముఖులు పట్టణ వివిధ ఆస్పత్రుల డాక్టర్లు సిబ్బంది ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫౌల్ట్రీ రైతులకు అండగా ఉంటా..

**అబ్దుల్లాపూర్మెట్, జూలై 27 (జనం సాక్షి) :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం పెద్దఅంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద తెలంగాణ ఫౌల్ట్రీ ఫెడరేషన్ నూతన భవనాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్రంలో పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాను" అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ రోడ్డు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఫెడరేషన్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రావు,



జక్క సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ భవనం ద్వారా రైతుల మధ్య సమన్వయం పెరిగి, సమస్యల పరిష్కారానికి ఇది కేంద్ర బిందువుగా నిలుస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రేషన్ డీలర్లకు వేతనాలు ఇవ్వాలి

**మల్దకల్, జూలై 27 (జనంసాక్షి) :** కేంద్రానికి సెంట్రల్ గిడ్డంగుల, గోదాముల రవాణా శాఖల చైర్పర్సన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన డీకే అరుణమ్మ మొదటిసారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆదివారం జోగులాంబ గద్వాల్ జిల్లాలోని రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించారు.డీలర్ల యొక్క సమస్యలను పరిష్కరించాలని కోరడంజరిగింది.డీలర్ల మార్జిన్ అమౌంటు ఒకే సారి పడే విధంగా అది కూడా తెలంగాణ భవన్ నుండే 14 రూపాయలు ఒకేసారి పడేవిధంగా డీలర్ల గౌరవేతనం పెంచాలని,ఎమ్మెల్యేఎస్ స్టాక్ పాయింట్ల వద్ద వే బ్రిడ్జి ఎలక్ట్రానిక్ ప్రింటెడ్ కాంటాలను, డీలరు చనిపోతే దహన సంస్కారాలకు 50 వేలు ఇప్పించేలా శాశ్వతమైన ఆథరేషన్ డీలర్ దిగుమతి హమాలినీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలే భరించేలా వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సమస్యలతో కూడిన



వినతిపత్రాన్ని గిడ్డంగుల, గోదాముల రవాణా శాఖ చైర్పర్సన్ డీకే అరుణమ్మ అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించి హామీలను నెరవేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ అసోసియేషన్ నాయకులు నిసార్, రాములు,సురేష్ బాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 29న దాదాపు 230 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**తాండూరు, జూలై 27 (జనంసాక్షి) :** ఈ నెల 29న దాదాపు 230 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో తాండూర్ నియోజకవర్గ పరిధిలోని యాలాల్ మండలం దౌలాపూర్ గ్రామ పరిధిలో నియోజకవర్గనికి మంజూరైన ఆరు నూతన విద్యుత్ సబ్ స్టేషన్ లకు మరియు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ తో పాటు వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమనికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క,,స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

## స్వర్ణకారులను ప్రభుత్వం కాపాడుకోవాలి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**కౌడిపల్లి, జూలై 27 (జనంసాక్షి) :** విశ్వకర్మల హక్కుల సాధన కోసం ఈనెల 31వ తేదీన గురువారం హైదరాబాదులోని ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండి కొండోజు నరసింహచారి, ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు, ఈనెల 31న జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... బంగారం వృత్తి వ్యాపారం చేసుకుని జీవనాధారం పొందే విశ్వకర్మ స్వర్ణాకారులను, బంగారు వ్యాపారంలో ఉన్న ఇతరులను, అక్రమ దొంగ బంగారం కేసుల పేరుతో పోలీసుల వేధింపులు మానుకోవాలని, 411 యాక్టులో సవరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దొంగ దొంగతననికి పాల్పడినట్లయితే దొంగ ఆస్తులు జప్తు చేసి రికవరీ చేయాలన్నారు. ఆ దొంగను జీవితాంతం జైల్లో పెట్టాలని అప్పుడే దొంగకు సరైన శిక్ష పడడం జరుగుతుందని మళ్లీ దొంగతనాలు పునరావృతం కాకుండా ఉంటుందని అన్నారు. ఈ మధ్యకాలంలో కొందరు పోలీసులు స్వర్ణకారులను బంగారు వ్యాపారస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని దొంగ బంగారం కొనని స్వర్ణకారుల వద్ద, బంగారు వ్యాపారస్తుల వద్దకు, ముక్కు మోఖం



తెలియని దొంగను పోలీసులు పట్టుకువచ్చి ఈ దొంగ వద్ద నువ్వు బంగారం కొన్నావ్ అంటూ బంగారు వ్యాపారస్తున్ని వేధించి బంగారాన్ని రికవరీ చేయడం నా దృష్టికి వచ్చింది అన్నారు. అనేక కార్పొరేట్ షాపులు వచ్చి స్వర్ణాకారుల కులవృత్తులు నశించి దుకాణం కిరాయిలు, ఇంటి కిరాయిలు, కట్టలేక పిల్లల ఫీజులు కట్టలేక ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న 411 యాక్టును ప్రభుత్వం వెంటనే సవరణ చేయకపోతే విశ్వకర్మ స్వర్ణకారులు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉంటామని అన్నారు.

## డాక్టర్ నోముల వెంకటేశ్వర్లకు వింగ్స్ ఆఫ్ ఫైర్ ఎక్సలెన్స్ అవార్డు

**హయత్‌నగర్, జూలై 27 (జనం సాక్షి) :** భారతరత్న మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం 10వ వర్ధంతిని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమా నగర్ లోని బాలవికాస కేంద్రంలో నివాసయోగ్యమైన భూగోళ పరిరక్షణ అనే అంశంపై లీడ్ గ్లోబల్ ఫౌండేషన్, ఆరోగ్య మిత్ర, లిబర్టీ ఫౌండేషన్ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఉమ్మడి వరంగల్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన పలువురు సామాజికవేత్తలు, పర్యావరణవేత్తలు గాలి, నీరు, భూమి నీ ఎలా పరిరక్షించుకోవాలో విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన, వకృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు డాక్టర్ నోముల వెంకటేశ్వర్లు, శ్రీ రామలింగారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా విద్య, మానసిక ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ మొదలగు అంశాలలో సేవలందించిన డాక్టర్ నోముల వెంకటేశ్వర్లకు వింగ్స్ ఆఫ్ ఫైర్ ఎక్సలెన్సు అవార్డు - 2025ని వందేమాతరం ఫౌండేషన్ కార్యదర్శి శ్రీ వందేమాతరం రామచంద్రారెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు రామలింగారెడ్డి, లీడ్ ఫౌండేషన్ అధ్యక్షులు హరి యప్పనపల్లి లు అందజేశారు. ఈ



కార్యక్రమంలో ఈసీజీ ఫౌండేషన్ సభ్యులు తులసి, ఉసిరి, సరస్వతి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నోముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం విలువలను స్పూర్తిగా తీసుకుంటూ, వారి ఆశయాల సాధనకు భవిష్యత్తులో కృషి చేస్తానని వారు వివరించారు. ఈ సందర్భంగా ఇన్నర్ బ్లూమ్ సిబ్బంది, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల హయత్ నగర్ ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

# రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 27 (జనం సాక్షి) :** రాష్ట్రంలో రానున్న రోజుల్లో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని బిజెపి అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ధీమా వ్యక్తంచేశారు. శనివారం రాత్రి నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన బిజెపి విస్తృత స్థాయి సమావేశంలో ఎంపి డికె.అరుణ,సీనియర్ నాయకుడు నాగురావు నామాజీ తో కలిసి పాల్గొన్నారు.సమావేశంలో రాంచందర్ రావు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారనీ అన్నారు.ఏ ఎన్నిక వచ్చిన గెలుపు బిజెపిదే కావాలని కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన సాధించిన అభి వృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి రాష్ట్రంలో ఏ ఎన్ని కలు వచ్చినా బిజెపి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపనిచ్చారు. ఈ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ఏ ఎన్నిక అయినా బిజెపి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైని కుల్లా పని చేయాలనీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల గారడీతో 6 అబద్ధాలు 66 మోసాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు రుణమాఫీ పూర్తి కాలేదు, ఏడాది అయినా రైతు బరోసా పూర్తిగా లేదని, మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేశారని అన్నారు. అలాగే గృహజ్యోతితో మహిళలను మోసం చేశారని, వృద్ధులకు చేయూత అందించలేదని, యువత వికాసం మరిచారని సొంతిల్లు కలగానే మిగిలి పోయిందని కార్యక ర్తలకే ఇళ్లు మంజూరు అవు తున్నాయని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పడ్డారనీ అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకోవడంలో ఆ రెండు పార్టీలు ఒక్కటేనని, అంతేకాకుండా పదేళ్లు బిఆర్ఎస్ కే.ట్యాక్స్ ఇప్పుడు కాంగ్రెస్ ఆర్ఆర్ ట్యాక్సుల్లిస్తున్నదని విమర్శించారు. అలాగే ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారని ప్రజలు వీరి పాలనలో భూమి, ఇళ్లు కోల్పోయారని. రాష్ట్రాన్ని అప్పుల కుప్పలు చేశారని ఆడబిడ్డలు ఆక్రందనలు చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం సబ్ కావికాస్, సబ్‌కా విశ్వాస్ నినాదంతో చేపట్టిన సంక్షేమ పథకాలను, వక్ఫ్ బోర్డు రద్దుతో ముస్లింలకు ఏమి నష్టం లేద న్న విషయాన్ని ప్రజలకు వివరించాలని బిజెపి గెలుపుకు పట్టుదలతో కృషి చేయాలని అన్నారు. ఆపరేషన్ సిందూరతో ప్రధాని నరేంద్రమోడీ పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడమే కాకుండా ప్రపంచ దేశాల్లో ఏకాకిని చేశారని అన్నారు. కరోనా నాటి నుంచి పేద లు ఆకలితో అలమటించే పరిస్తిని దూరం చేస్తూ ఉచితంగా ప్రతి ఒక్కరికీ 5 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నా రని అన్నారు. అంతే కాకుండా అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించారని అన్నారు. వాటిని ప్రజలకు వివరిస్తూ సంస్థ గతంగా పార్టీని మరింత పటి ష్టం చేయాలని కోరారు.

### రాంచందర్ రావుకు ఘన సన్మానం

రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి నారాయణపేట కు వచ్చిన ఎన్.రాంచందర్ రావును జిల్లా బిజెపి నాయకులు గజమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కొండయ్య,పున్నంచంద్ ,పగుడాకుల శ్రీనివాసులు, ప్రతాప్ రెడ్డి,లక్ష్మీకాంత్ రెడ్డి,గోవర్ధన్ గౌడ్, వెంకట్రాములు, రవికుమార్ రాష్ట్ర,జిల్లా,మండల పదాది కారులు,మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## విద్యార్థినులను పరామర్శించిన జూపల్లి కృష్ణరావు

- ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, జూలై 27 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి ఆహారం వికటించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వారికి అందుతున్న వైద్య సౌకర్యాల గురించి ఆరా తీసిన మంత్రి,ఎమ్మెల్యే, జిల్లా వైద్యాధికారి మరియు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు వైద్యులను అడిగి విషయాలను తెలుసుకోవడం జరిగింది. దీనికి గల కారణాన్ని సంభధిత పాఠశాల ప్రిన్సిపాల్ మరియు గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ మరియు జిల్లా విద్యాధికారిని అడిగి దానికి గల కారణాల గురించి సమీక్షించడం జరిగింది. చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి తల్లితండ్రులకు భరోసా ఇవ్వడం జరిగింది. ఎవ్వరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని వారికి చెప్పడం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటన మళ్ళీ పునరావృతం కాకుండా చూస్తానని దీనికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని మంత్రి, ఎమ్మెల్యే చెప్పడం జరిగింది. ఎమ్మెల్యే వెంట జిల్లా అధికారులు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా సీఐటీయూ జెండా

- భారీ వేతన ఒప్పందాలు సిఐటియుకే సాధ్యం
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు




**పటాన్చెరు, జూలై 27 (జనంసాక్షి) :** కార్మికులకు ఎల్లప్పుడూ సిఐటియు జెండా అండగా ఉంటుందని భారీ వేతన ఒప్పందాలు సిఐటియు తోనే సాధ్యమని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. పటాన్‌చేరులోని ఐలా భవన్ లో ఆదివారం నాడు కిర్బీ పరిశ్రమ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు హాజరై మాట్లాడారు. త్వరలో కిర్బీ పరిశ్రమలో వచ్చే ఎన్నికల్లో చుక్క గుర్తుపై ఓటు వేసి సిఐటియును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఇప్పటికే పరిశ్రమలో రెండు వేతన ఒప్పందాలు భారీగా చేశామని ఆయన అన్నారు, అనేక కొత్త, కొత్త సౌకర్యాలు సాధించిన చరిత్ర సిఐటియు కే ఉందని ఆయన అన్నారు. మరో అగ్రిమెంట్ కోసం సీఐటీయూ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు ద్వారానే కార్మికుల కు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు, సిఐటియు ఉన్నచోటనే భారీ వేతన ఒప్పందాలు అవుతున్నాయని, కొత్త, కొత్త సౌకర్యాలు సాధించబడుతున్నాయని ఆయన అన్నారు. యాజమాన్యాలతో పోరాడి హక్కులు సాధించడంలో సిఐటియు ముందు ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కే. రాజయ్య, మాణిక్,రాజు, నాగప్రసాద్, తలారి శ్రీనివాస్, లక్ష్మణ్, శంకర్,మల్లేష్, సోమన్న, ఏడుకొండల, మహేశ్వర్ రెడ్డి,రాములు, బిలాల్,తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి


- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి




**మక్తల్, జూలై 27 (జనంసాక్షి) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బిఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు.పట్టణ కేంద్రంలోని ద్వారక ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు,అధ్యక్షతన మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బిఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను గ్రామస్థాయిలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ అబద్దాలను ప్రజలు వివరించాలని గ్రామస్థాయిలో బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. గ్రామస్థాయిలో ఏ సమస్యలు ఉన్న తన దగ్గరకు తీసుకురావాలన్నారు. వచ్చే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, మునిసిపాలిటీ, జడ్పిటిసి ఎన్నికల్లో అందరూ సమిష్టిగా ఏకమై బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చిన ముందుండి పోరాడుతానని.పోలీసులు బిఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టెం సుచరిత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పి నరసింహ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు, మాజీ కౌన్సిలర్లు అన్వర్ హుస్సేన్, పసుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎరుకల మొగులప్ప, మాగనూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎల్లారెడ్డి. మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- మోడీ పాలనలో ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేష్ గౌడ్
- ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బిజెపిలో పలువురు చేరిక



**చేర్యాల, జూలై 27 (జనంసాక్షి) :** బిజెపితోనే దేషాభివృద్ధి సాధ్యమని, మోడీ పాలలలో రోజురోజుకు గ్రామాల్లో ఎంతో ఆదరణ పెరుగుతుందని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోంగోని సురేష్ గౌడ్ అన్నారు. బిజెపి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సమక్షంలో మద్దూర్ మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్ మేక మాధవి గోపాల్, వడ్డెర సంఘం మద్దూరు మండల అధ్యక్షులు కోడిదెల రాజు తో పాటు పలువురు బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దూరు మండలాధ్యక్షుడు బొంగోని సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో ఆదివారం పార్టీలో చేరగా వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో మద్దూరు మండలంలో బిజెపి జెండా ఎగరవేయాలని ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అవినీతిలో కూరుకుపోయిన బిఆర్ఎస్ పార్టీని పాలన చేతగాని కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపిలో చేరాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకుడు మోకు ఉదయ్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు యామ శ్రీకాంత్, పైస బాలకృష్ణ, బొల్లు కిట్టు ఉన్నారు.

## గ్రామపాలనాధికారి, లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**గద్వాల నడిగడ్డ, జూలై 27 (జనం సాక్షి) :** గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్నం సెక్షన్ ప్లాటింగ్ పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ బి.యం. సంతోష్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మధ్యాహ్నం అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 151 మంది అభ్యర్థులకు గాను, 129 మంది హాజరయ్యారని, 22 మంది గైర్హాజరు అయినట్లు, మధ్యాహ్నపు సెషన్‌కు కూడా యధావిధిగా అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్సెడ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహిస్తున్న ప్లాటింగ్ పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి. రామచంద్రం, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రేణుకా దేవి, పర్యవేక్షకులు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలి

- 42% బీసీ రిజర్వేషన్లలో 10% ముస్లింలకు పంచుతామంటే జరిగేది యుద్ధమే
- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, ఎంపీడీకే అరుణమ్మ



**వనపర్తి బ్యూరో, జూలై 27 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మి కృష్ణ గార్డెన్స్ లో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ మెంటే పల్లి పురుషోత్త రెడ్డి సమన్వయంతో వనపర్తి నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.గద్వాల మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు కి మర్రి కుంట ఎకో పార్కు దగ్గర జిల్లా అధ్యక్షులు డి.నారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ తీస్తూ చత్రపతి శివాజీ చౌరస్తాలో పట్టణ ప్రధాన కార్యదర్శి అరవింద్ నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు ,ఎంపీ డీకే అరుణమ్మ, మాజీ ఎంపీ పోతుగంటి రాములు ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు డి. నారాయణను, భారీ క్రేన్ ద్వారా గజమాలతో స్వాగతించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ పాల్గొన్నారు. ముఖ్యఅతిథి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో వేలాదిమంది చదువుకున్న యువత నిరుద్యోగులుగా నోటిఫికేషన్ల కొరకు, జాబ్ మేళాల కొరకై పట్టాలు చేత పట్టుకుని తిరుగుతున్నారని, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ జాబ్ క్యాలెండర్ ఏమైందని, కాంగ్రెస్ పార్టీ ఇప్పటిదాకా ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్కూల్ కాలేజీలలో గంజాయి మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా దొరకడం వల్ల యువత పెడదారి పడుతున్నారని డ్రగ్స్ పై కఠిన చర్యలు తీసుకుంటానన్న రేవంత్ రెడ్డి యువకులను మాదక ద్రవ్యాలకు బానిసలుగా చేసి రాష్ట్రాన్ని%ఎ% మాదకద్ర వేల తెలంగాణగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీల జాగీర్ కాదని పార్లమెంట్లో తెలంగాణ బిల్లు సమయంలో టిఆర్ఎస్ పార్టీ కున్న ఇద్దరి ఎంపీలు కూడా ఓటింగ్లో పాల్గొనలేదని కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ లేకునా బిజెపి పార్టీ సంపూర్ణ మద్దతుతోనే బిల్లు పాస్ అయి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించింది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలకు నమ్మకద్రోహం చేశారని టీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ప్రజలు బిజెపి పార్టీ వైపు చూస్తున్నారని ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల అవినీతిరహిత పాలన వికసిత్ భారత్ లక్ష్యాన్ని గడపగడపకు తెలియజేసి స్థానిక ఎన్నికల్లో బిజెపికి ఘనవిజయం సాధించి పెట్టాలని, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన బీసీలకు 42% రిజర్వేషన్లపై బిజెపి కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తుందని బీసీల 42% రిజర్వేషన్లలో ముస్లింలకు 10%ఇవ్వడం బిజెపి పార్టీ వ్యతిరేకిస్తుందని గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి రిజర్వేషన్ ఇస్తేనే హైకోర్టు కొట్టి వేసిందని రాబోయే డబుల్ ఇంజన్ బిజెపి ప్రభుత్వంలో ముస్లింలను కలపకుండా 42% రిజర్వేషన్ కేవలం బీసీలకే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు మాజీ డీకే అరుణమ్మ మాట్లాడుతూ పేద ప్రజలత ఆర్థికంగా ఎదగాలని ఆర్థికంగా ఎదిగిన రోజే పేదరికం పోయి ఆర్థిక సమానత్వంసాధ్యమవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిద్భారత్ లక్ష్యంతో పేదలకు మహిళలకు యువకులకు రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, విద్యారంగం వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పట్టణాలతో సమానంగా గ్రామాల అభివృద్ధిని కూడా అత్యధిక కేటాయిస్తున్నారని కరోనా సమయము నుండి నేటి వరకు 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఐదు కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారని ప్రతి రైతుకుపీఎం కిసాన్ సన్మానిది 6000/ఎ ఇస్తూ చరిత్రలోనే అత్యధికంగా రైతులకు మద్దతు ధర 2360/- మరియు ఎరువులకు ఇచ్చే సబ్సిడీతో ప్రతి రైతుకు ఎకరానికి 21000/-సాయం నరేంద్ర మోడీ అందిస్తున్నాడని ఈ విషయాలను ప్రతి కార్యకర్త ప్రతి రైతుకు తెలియజేయవలసిన ఆవశ్యకత ఉందని ఈనాడు ఏ గ్రామానికి పోయిన ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని తెలంగాణలో కూడా బిజెపి అధికారంలో రావాలని ప్రజలనుకుంటున్నారని దానికి బీజం వేయాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్లు సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి ఎంపీపీ జిల్లా పరిషత్ చైర్మన్ కౌన్సిలర్ మున్సిపల్ చైర్మన్ లను అత్యధికంగా బిజెపి గెలవాలని పదేండ్ల అవినీతి టిఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపించారని 421 హామీలతో అధికారంలోకి వచ్చి 20 నెలలైనా మాటలు తప్ప రేవంత్ చేతుల్లో లేదని రెండు వేల పెన్షన్ 4000 చేస్తాం ప్రతి ఆడబిడ్డకు 2500 ఇస్తాం కళ్యాణ లక్ష్మి స్కీం ద్వారా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం నిరుద్యోగ యువతకు ప్రతినెల 4 నిరుద్యోగ భృతి డిగ్రీ చదివే అమ్మాయిలకు ఉచిత స్కూటీ ఎస్సీ ఎస్టీలకు అధిక శాతం నిధులు ఇస్తామని రైతు భరోసా రైతులకు రైతు కూలీలకు కౌలు రైతులకు ఏడాదికి 15000 రెండు లక్షల రుణమాఫీ మొదలగు కాంగ్రెస్ వైఫల్యాలను మరియు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు చేరవేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బిజెపి జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి గత ఎన్నికల్లో నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ మాజీ శాసనసభ్యులు డా.రావుల రవీంద్రనాథ్ రెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి అయ్యగారి ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్ గౌని హేమారెడ్డి మోర్చాల రాష్ట్ర నాయకులు బి శ్రీశైలం జ్యోతి రమణ చిత్తారి ప్రభాకర్ కదిరే మధు అలివేలమ్మ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్ జిల్లా నాయకులు సుమిత్రమ్మ కుమారస్వామి వెంకటేశ్వర రెడ్డి బాశెట్టి శ్రీను సీతారాములు పెద్దిరాజు బోయల రాము శివారెడ్డి తిరుమలేష్ బాబురావు రాఘవేందర్ గౌడ్ అశ్విని రాధా ఎండి ఖలీల్ రవి నాయక్ ప్రవీణ్ కుమార్ రాజశేఖర్ గౌడ్ వెంకటేష్ తిరుపతిరెడ్డి చెన్నయ్య బుచ్చిబాబు గౌడ్ నాగరాజు క్రాంతి నాయుడు బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



**ఖిల్లా ఘనపురం, జూలై 27 (జనం సాక్షి) :** ఖిల్లా ఘనపురం ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఓ వారం లాంటిది అని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగారం ప్రకాష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త విధానం తో సీ,ఎం,ఆర్,ఎఫ్, చెక్కుల విధానం దరఖాస్తు దారునుకి వాట్సాప్ కి తమా వివరాలు చేరువయ్యేలా చేస్తునందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎప్పటికి పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరముగా మారింది అని నిరుపేదలకు రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 19 నెలలో 3.23 లక్షల మందికి సహాయం అందించడం జరిగింది అని ఇప్పటి నుండి ఎప్పటికి అపుడు ముఖ్యమంత్రి సహాయ నిది లబ్ధిదారులకు నేరుగా వారి వాట్సాప్ ద్వారా వివరాలు సంబంధిత పోర్టల్ ద్వారా వెల్లడిస్తారు ప్రజా ప్రభుత్వంలో మూడు కోట్ల 23 లక్షల మందికి సీఎంఆర్ఎఫ్ నిధులు నిరుపేదలకు వారి ఆర్థిక పరిస్థితులను వల్ల వారిని దృష్టిలో పెట్టుకొని ఎటువంటి అడ్డంకులు లేకుండా ఇన్ని వేళ కోట్ల మందికి నిధులు మంజూరు చేసినందుకు గాను వారి బాగోగులు చూసుకున్నందుకుగాను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి దక్కుతుంది ఇప్పటికీ సుమారు 1400 కోట్ల రూపాయలు ప్రజల ఖాతాల్లో జమా చేయడం జరిగింది. ఇది ప్రజా ప్రభుత్వానికి నిదర్శనం అని తెలంగాణ రాష్ట్ర ప్రజల తరపున ప్రజల పెన్నిధి పేదల దేవుడు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వనపర్తి శాసనసభ్యులు తుడి మెగా రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

## అక్రమ చొరబాటుదారుల ఓట్లు తొలగించడం హర్షనీయం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 27 (జనంసాక్షి) :** రోహింగ్యాలు బంగ్లాదేశ్ అక్రమ చొరబాటు దారుల ఓట్లు తొలగించడం పట్ల నారాయణపేట పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.తొలగించిన రోహింగ్యాల ఓట్లకు నిరస నగా కాంగ్రెస్ ఎంపీలు ప్లకార్డు లు పట్టుకొని నిరసన చేయడంపై దేశభద్రతపై కాంగ్రెస్ పార్టీ కున్న చిత్తశుద్ధిని చాటుతున్నదని అన్నారు. దేశంలోని మూలమూలల్లో అల్లర్లు రేకెత్తించడానికి రోహింగ్యాలను కాంగ్రెస్ పార్టీ, తృణముల్ కాంగ్రెస్ లే పెంచి పోషించి ఓటు బ్యాంకు ద్వారా బెంగాల్ అస్సాం తదితర రాష్ట్రాలలో అధికారంలోకి రావాలనే హేయమైన చర్యలను పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ డిఎన్ఏ లోనే దేశ వ్యతిరేకత ఉందని అందుకు ఇదే నిదర్శనం అన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ కుటిల నీతిని తిప్పి కొట్టడానికి, దేశ ప్రజల భద్రతా దృష్ట్యా ఎన్ ఆర్ సి, యు సి సి లాంటి చట్టాల ఆవశ్యకత ఎంతైనా ఉందని వీటిని దేశ ప్రజలంతా స్వాగతిస్తున్నారని,అన్నారు.రాబోవు రోజుల్లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు, బంగ్లాదేశ్ చొరబాటు దారు లను గుర్తించి దేశ ప్రక్షా ళన చేయడం తథ్యమని పేర్కొన్నారు.అక్రమంగా చొరబాట్ల ద్వారా దేశమంతా నివసి స్తున్న రోహింగ్యాల ఫేక్ ఓట్లను ఎన్నికల కమిషన్ గుర్తించి వాటిని తొలగించాడం శుభపరిణామమని పేర్కొన్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య

**జిల్లాలోనే అత్యధిక విద్యార్థులు**

**అన్నింటా మొదటి స్థానంలో మస్కాపూర్ విద్యార్థులు**

**పీఎం శ్రీ పథకానికి ఎంపికైన మస్కాపూర్ పాఠశాల**





**ఖానాపూర్ జూలై 27 (జనం సాక్షి) :** ఆంగ్ల మాధ్యమంలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ప్రభుత్వ పాఠశాలలో ఒక ప్రత్యేక గుర్తింపు సాధించిన పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ప్రథమ స్థానాన్ని సంపాదించుకుంది మండలంలోని మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. జిల్లాలోనే అత్యధిక విద్యార్థులతో వెలజిల్లుతున్న మస్కాపూర్ పాఠశాలలో విద్యార్థులు అన్నింటిలో జిల్లా స్థాయి గుర్తింపులతో దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని పాఠశాలతో పోల్చి చూస్తే మస్కాపూర్ పాఠశాలలోనే విద్యార్థుల సంఖ్య సగానికి పైగా కనిపిస్తుంది. కార్పొరేట్ కు దీటుగా పోటాపోటీగా విద్యార్థులకు పాఠాలు చెబుతూ ఆటపాటలతో వివిధ సంస్కృతిక కార్యక్రమాలలో సైతం విద్యార్థులను జిల్లా స్థాయిలో ముందు వరసలో నిలుపుతూ ఉపాధ్యాయులు అందరి మన్ననలు పొందుతున్నారు. అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తోడుగా పాఠశాల అభివృద్ధి కమిటీ మేము సైతం అంటూ ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంగ్ల మాధ్యమం ఆరంభమైన మస్కాపూర్ పాఠశాల అప్పట్లో ఒక వెలుగు వెలిగింది. ఈ నేపథ్యంలో 810 మంది విద్యార్థులతో కలకలలాడుతున్న ఈ పాఠశాలలో విద్యార్థుల చేరికల కోసం తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల కంటే మస్కాపూర్ పాఠశాలవైపే మొగ్గుచూపుతున్నారు. అలాంటి ఉన్నత పాఠశాల పి ఎం శ్రీ పథకానికి ఎంపిక కావడంతో మరింత అభివృద్ధి పథంలో నడుస్తోంది. అన్ని అంగులతో హంగులతో అభివృద్ధి పరుస్తున్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు సైతం తమవంతు కృషి చేస్తున్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలనే ఏకైక లక్ష్యంతో ఒక యజ్ఞంలా ఉపాధ్యాయులు విద్యాబోధనలో వెనుకాడకుండా విద్యార్థిని విద్యార్థుల్లో వెలుగులు నింపుతున్నారు. ఈ సంవత్సరం బడిబాట కార్యక్రమంలో 260 మంది కొత్త విద్యార్థులు ఈ పాఠశాలలో ప్రవేశం తీసుకున్నారంటే మస్కాపూర్ పాఠశాల గూర్చి ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. ఉత్తమ ఫలితాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిన ప్రభుత్వ జిల్లా పరిషత్ మస్కాపూర్ పాఠశాల ప్రతి సంవత్సరం ఎంతోమంది విద్యార్థులకు 500 పైగా పదవ తరగతిలో మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సైతం అడ్మిషన్లు పొందిన దాఖలాలు కోకొల్లలు. గత విద్యా సంవత్సరం చూసినట్లయితే 10వ తరగతి ఫలితాల్లో 56 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించి 10వ తరగతి ఫలితాల్లోనే కాకుండా ఎన్ ఎం ఎం ఎస్ పరీక్షలో ప్రతిభ చాటి అగ్రస్థానంలో నిలిచారు. 2016 నుండి 2025 వరకు జరిగిన ఎన్ ఎం ఎస్ పోటీ పరీక్షలలో 116 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనానికి అర్హత సాధించారు. జిల్లా యూనిట్ గా నిర్వహించిన ప్రతిభాపరీక్షల్లో సైతం ఈ పాఠశాల విద్యార్థులు అనేక సబ్జెక్టులలో మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయి క్రీడల్లో సైతం మస్కాపూర్ విద్యార్థులే మొదటి రెండవ వరుసలో నిలుస్తున్నారు. ప్రతిరోజు యోగా, వెయిట్ లిఫ్టింగ్ లలో శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు వీటిలో అగ్రగామిగా నిలుస్తున్నారు. ఈ సంవత్సరంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 9 బంగారు,వెండి, కాంస్య పథకాలు సాధించినారు. ఢిల్లీలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఈ పాఠశాల విద్యార్థి శివ సాయి తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొన్నారు. రాష్ట్ర ఉత్తమ పాఠశాల అవార్డు సైతం మస్కాపూర్ పాఠశాల కైవసం చేసుకుంది. క్రీడలు, నైతిక విలువలు పరిగణలోకి తీసుకొని చదువులో రాణిస్తున్న ఈ పాఠశాలకు హైబీస్ అనే స్వచ్ఛంద సంస్థ పాఠశాలను రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసి ఉత్తమ పాఠశాల అవార్డు అందించింది. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం సకల సదుపాయాలు సమకూరుస్తుంది. కూర్చోవడానికి బెంచీలు, త్రాగడానికి ఆర్వో ప్లాంట్, సంఖ్యకు తగినన్ని మరుగుదొడ్లు, భోజనానికి ప్రత్యేక భోజన గది, తదితర సౌకర్యాలు ఈ పాఠశాలలో ప్రత్యేకం. గ్రామస్తుల సహాయ సహకారాలు ఎల్లవేళలా పాఠశాలకు అందిస్తుండడంతో పాఠశాల మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. విద్యార్థులను ఆకర్షించుకునేందుకు ఉపాధ్యాయ బృందం ఎప్పటికప్పుడు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నారు. ఇంగ్లీష్ మాధ్యమం ఆరంభమైన క్రమంలో గ్రామస్తులు చందాల రూపంలో జమ చేసిన డబ్బుతో పాఠశాలలో విద్యా వాలంటరీలను నియమించారు. పాఠశాలకు ఏ అవసరం వచ్చినా ముందుండి అవసరం తీరే వరకు గ్రామస్తులు తమ వంతు సహకారాన్ని సమకూరుస్తారని అధ్యాపక బృందం చెబుతోంది. గ్రామస్తుల సహకారంతోనే పాఠశాల అభివృద్ధి పథంలో నడపగలుగుతున్నామని ముక్తకంఠంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం చెబుతున్నారు. ఏది ఏమైనా జిల్లాలోనే ప్రప్రథమ స్థానంలో నిలుస్తున్న మస్కాపూర్ పాఠశాల ఉపాధ్యాయులను మండల వాసులతోపాటు జిల్లా వ్యాప్తంగా అభినందిస్తున్నారు. అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థుల లక్ష్య చేదనే లక్ష్యంగా పెట్టుకొని ఉపాధ్యాయులు పాఠశాల సమయాన్ని లెక్కచేయకుండా విద్యార్థులకు విద్యాబోధనే లక్ష్యంగా పెట్టుకుని విధులు నిర్వహిస్తున్న మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని మిగతా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని విద్యావేత్తలు ఆకాంక్షిస్తూన్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## జిపిఓ, లైసెన్సుడ్ సర్వేయర్ పరీక్షా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**నిర్మల్ బ్యూరో, జూలై 27 (జనంసాక్షి) :** జిపి, లైసెన్సుడ్ సర్వేయర్ల నియామక పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అదనపు కలెక్టర్ (రెవెన్యూ)తో కలిసి పట్టణంలోని చాణక్య హై స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష గదుల్లో జరుగుతున్న పర్యవేక్షణ, అభ్యర్థుల హాజరు, నిబంధనలు పాటింపు, ప్రశ్న పత్రాల పంపిణీ వంటి అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరీక్షలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిపిఓ పరీక్షకు మొత్తం 55 మంది అభ్యర్థులు హాజరుకావలసి ఉండగా, 37 మంది మాత్రమే హాజరయ్యారని 18 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే లైసెన్స్ సర్వేయర్ పరీక్షకు 110 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 84 మంది హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్డీవో రత్నకళ్యాణి, నోడల్ అధికారి ఆర్. సుదర్శన్, పర్యవేక్షకులు మోతీరాం, సూర్యారావు, రాజేశ్వర్ గౌడ్, తహసిల్దార్ రాజు, పోలీసు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బంజారా యువ చైతన్యం పోస్టర్, లోగో ఆవిష్కరణ

**బంజారా యువ చైతన్యం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భానోత్ మోహన్ నాయక్ నియామకం**



**మహబూబాబాద్ ప్రతినిధి, జూలై 27 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లోని ముదు గుడిసెలతండా, లైన్ తండా, కొబల్ తండా గ్రామ పంచాయతీకి చెందిన యువకులు బంజారా యువ చైతన్యం వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసి మన గ్రామానికి మనమే సైనికులం పోస్టర్ లోగోను ఆవిష్కరించి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బంజారా యువ చైతన్యం అధ్యక్షులుగా బానోతు మోహన్ నాయక్, ఉపాధక్షడు. ఇస్లావత్ సుమన్, ప్రధానకార్యదర్శి తేజవత్ వెంకన్న, సంయుక్త కార్యదర్శి మాలోత్ బాలు గుగులోత్ బాలాజీ ట్రెజరి బోడ రవి బానోత్ రమేష్ రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా లేవుడియా సంగీత్ చౌహన్ బానోత్ శ్రీనివాస్ ఎగ్జిక్యూటివ్ గా భూక్యా రాకేష్ భూక్యా బన్సీలాల్ ఇస్లావత్ నరేష్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఇస్లావత్ హుస్సేన్ అంగోత్ అఖిల్ బాధవత్ సదర్ లాల్ భూక్యా సిద్దు తేజవత్ నరేష్ కోఆర్డినేటర్లు తేజవత్ విజయ్ అంగోత్ సుధాకర్ మూడ్ నవీన్ బోడ వెంకన్న తేజవత్ మహేష్ బానోత్ నవీన్ బానోత్ శ్రీను అజ్మీరా సరిబాబూ భూక్యా జీవన్ సోషల్ మీడియా కమిటీ సభ్యులు మూడ్ సురేష్ బోడ రాజు తేజవత్ గణేష్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులు తేజవత్ హరీష్ బోడ అనిల్ కల్చరల్ ఆక్టివిటీస్ కమిటీ సభ్యులు ఇస్లావత్ సతీష్ బానోతు వెంకన్న బోడ వెంకన్న భూక్యా సాగర్ సలహాదారులు బానోతు రమేష్ లక్ష్మణ్ బానోతు రమేష్ అమృ లావుడ్య బాలాజీ బానోతు బాలు ఇస్లావత్ చందా బోడ ఈర బానోతు రవి బొజ్జ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బానోత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలోని యువత గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ గ్రామ అభివృద్ధికి దోహదపడాలని యువత చెడు మార్గాలకు పోకుండా సన్మార్గంలో నడుచుకొనుటకు గ్రామ సమిష్టి కృషివల్లే గ్రామ అభివృద్ధికి యువత దోహదపడుతరని వారు అన్నారు. ఈ కార్యక్రమం బానోతు భద్రు తేజవత్ మోహన్ బానోతు కిషన్ బోడ చందులాల్ తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదివాసీ ఎరుకలకు ప్రాధాన్యత కల్పించాలి

**తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్యాల రాము**



కాళేశ్వరం , జూలై 27 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదివాసి ఎరుకలకు ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షులు దుగ్యాల రాము డిమాండ్ చేసారు. కాటారంలో జరిగిన తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా స్వతంత్రం వచ్చిన నాటి నుండి నేటి వరకు ఆదివాసి ఎరుకల ప్రజలు విద్యాపరంగా, ఉద్యోగ పరంగా, ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.లంబాడ, కోయ, గోండు జాతుల నుండి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ఉన్నప్పటికీ ఆదివాసి ఎరుకల జాతిని పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికీ గిరిజన కలెక్టర్లు, కమిషనర్లు, డైరెక్టర్లు, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు వారి వారి తెగలకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ ఆదివాసి ఎరుకల తెగను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదివాసి ఎరుకల తెగకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు లొకిని రాజు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుతాటి రవికుమార్, రాష్ట్ర కోశాధికారి వనం రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేమ్మసారం నాగులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేతిరి రాజశేఖర్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు కూరాకుల విజయకుమార్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మాన్పాటి రమేష్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దుగ్యాల బాపు, నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## జీపీఓ, లైసెన్సుడ్ సర్వేయర్ పరీక్షా కేంద్రాల తనిఖీ



**ములుగు ప్రతినిధి, జులై 27(జనంసాక్షి) :** గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 27 మంది అభ్యర్థులకు గాను, 26 మంది హాజరయ్యారని, 01 మంది గైర్హాజరైనట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. లైసెన్సుడు సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్ లో 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన థియరీ పరీక్షకు 80 మంది అభ్యర్థులకు గాను 71 మంది హాజరయ్యారని, 09 మంది గైర్హాజరు అయినట్లు వివరించారు. లైసెన్సుడు సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సెకండ్ సెషన్ లో జరిగే ప్లాటింగ్ పరీక్షకు పరీక్షకు 80 మంది అభ్యర్థులకు గాను 71 మంది హాజరయ్యారని, 09 మంది గైర్హాజరు అయినట్లు వివరించారు. గట్టి పోలీసు బందోబస్తు నడుమ ఎలాంటి కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహిస్తుండడాన్ని గమనించిన అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాలుజారి వాగులో పడి వ్యక్తి మృతి



**మహబూబాబాద్ ప్రతినిధి, గూడూరు. జులై 27 (జనం సాక్షి):** గూడూరు మండలంలోని కొబాల్ తాండాకు చెందిన బానోత్ బాలు (50)శనివారం మధ్యాహ్నం నుండి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వారి ఆచూకీకోసం వెతికగా రాల్లవాగు వద్ద కాలుజారి వాగులో పడి మృతి చెందినట్టు గుర్తించి గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు, మృతుని భార్య బానోత్ బుజ్జి ఫిర్యాదు మేరకు మృతుడు ప్రమాదవశాత్తు జారి పడినట్లు గూడూరు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపారు.

## వ్యాపారం ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలి



**వరంగల్ ఎంజీఎం, జూలై 27(జనంసాక్షి):** వరంగల్ పట్టణంలో వైశ్య బిజినెస్ లీడర్స్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జీవిబిఎల్ ఫౌండర్ చైర్మన్ మంచి రాజ శేఖర్ పాల్గొని మాట్లాడారు వ్యాపారం లో సేవతో పాటు ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఉండాలని, సంప్రదాయ వ్యాపారాలను కొత్త పుంతలు తొక్కించాలని అన్నారు. వరంగల్ చాప్టర్ చైర్మన్ గా ఓలాం ప్రభు కిరణ్, వైస్ చైర్మన్ ఆపరేషన్స్ గా బొడ్ల రవీంద్ర నాథ్, వైస్ చైర్మన్ గౌరీశెట్టి ప్రభాకర్ ఎన్నికయ్యారు, ఈ కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

## బొగత జలపాతం సందర్శన నిలుపుదల

**ప్రజలు ఎవ్వరు కూడా ప్రాజెక్టులు, చెరువుల దగ్గరకు వెళ్ళవద్దు**

**పర్యాటకులు సహకరించాలి : ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ములుగు ప్రతినిధి, జులై 27(జనంసాక్షి) :** భారీ వర్షాల కారణంగా బొగత జలపాతాలను సందర్శకుల భద్రత దృష్ట్యా తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగిందని, ప్రజలు ఎవ్వరు కూడా ప్రాజెక్టులు, చెరువుల దగ్గరకు వెళ్ళవద్దనీ, పర్యాటకులు పర్యటించకుండా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఇతర ప్రాంతాలు ముత్యందర జలపాతాలు, కొంగల జలపాతాలు, మామిడిలోద్ది జలపాతాలు, కృష్ణపురం జలపాతాలు మొదలైన వాటిని కూడా పర్యాటకుల భద్రతా కారణాల దృష్ట్యా శాశ్వతంగా మూసివేయడం జరిగిందని, ఈ జలపాతాలను సందర్శించడానికి అనుమతి లేదని, ఈ సూచనలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరించి, కేసు నమోదు చేయడం జరుగుతుందని, తిరిగి పై జలపాతాలను సందర్శించే తేదీలను తర్వాత ప్రకటిస్తామనీ ఆ ప్రకటనలో ఆయన తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా తక్షణ సహాయం కొరకు కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ నెంబర్. 18004257109 ల్యాండ్ లైన్ నెంబర్ లకు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటూ, వర్షానికి, జలమాయమైయ్యే ప్రాంతాల సమస్య కు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని, ప్రజలు అత్యవసర సేవలకు తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. వరద ఉధృతి ఎక్కువ ఐతే వెంటనే జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రజలు సహకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# ములుకనూరు డెయిరీ వేల మంది మహిళా కుటుంబాల్లో వెలుగు

**జీఎం.మార్పాటి భాస్కర్ రెడ్డి...**




**భీమదేవరపల్లి, జూలై 27 (జనం సాక్షి) :** హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు మహిళా డెయిరీ పరిధిలో పాల సంఘాలు,సభ్యులు లాభాల బాటలో నడుస్తున్నది. వేల మంది మహిళా కుటుంబాలలో వెలుగు ఈ డెయిరీ,ఈనెల 28న మహాసభ నిర్వహించనున్నట్లు డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ జిఎం మార్పాటి భాస్కర్ రెడ్డి తెలిపారు. ములుకనూరు మహిళలు కష్టాలకే సవాల్ విసిరారు.. కరువు కాటకాలతో ముల్కనూరు ప్రాంతం విలవిలలాడుతున్న సమయంలో ధైర్యాన్ని కూడగట్టుకుని ముందుకు నడిచారు. గ్రామీణ మహిళలు నిర్వహిస్తున్న డెయిరీ ములుకనూరులో ఆగస్టు 17 2002లో ములుకనూరు మహిళా సహకార డెయిరీ ని ప్రారంభించారు.గొప్ప గొప్ప చదువులు చదివిన వారు కాకపోయినా,పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు ఇందులో లేకపోయినా, కృషితో నాస్తి దుర్భిక్షం అన్న నానుడికి నిదర్శనంగా మహిళలు ఈ డెయిరీలోని అన్ని విభాగాలలోని పనులను అలవోకగా చేసేస్తారు.ప్రతి సంవత్సరం జూలై మాసంలో మహాసభ నిర్వహించి ఎక్కువ స్థాయిలో పాలను అందించిన పాల సంఘాలకు ప్రోత్సాహకాలను కూడా అందిస్తారు.

**డెయిరీ నిర్వహణలో ప్రెసిడెంట్ జనరల్ మేనేజర్ ది కీలక పాత్ర...**

డెయిరీ నిర్వహణలో ప్రెసిడెంట్,జనరల్ మేనేజర్ ది కీలక పాత్ర ప్రస్తుతం ములుకనూరు మహిళా సహకార డెయిరీకి ప్రెసిడెంట్ గా రైతు కుటుంబం నుండి, పశు పోషణ చేసిన స్థాయి నుండి ఎదిగి వచ్చిన ధనశ్రీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.ఈ సహకార మహిళా డెయిరీ సంఘాన్ని ఏకతాటి మిద ముందుకు నడిపిస్తున్నారు.ములుకనూరు మహిళా కో ఆపరేటివ్ డెయిరీకి జనరల్ మేనేజర్‌గా భాస్కర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు.ఎప్పటికప్పుడు వారికి



# ఇందిరమ్మ ఇండ్లు చారిత్రాత్మక పథకం

- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27 (జనంసాక్షి) :** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై పాల్వంచలోని ఐడిఓసి సమావేశ మందిరంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమీక్ష సమావేశంలో జిల్లాల్లో వర్షాభావం, వరద ముంపు, సీజనల్ వ్యాధులు, ఎరువుల సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల పంపిణీ, వనమహోత్సవ కార్యక్రమం, విద్యా రంగ అభివృద్ధి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించబడింది. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దుర్శెట్టి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రులకు జిల్లాల ప్రస్తుత పరిస్థితులపై వివరాలు ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ..: భారీ వర్షాలు, వరదలను ఎదుర్కునేందుకు యాక్షన్ ప్లాన్ తో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఇందిరా సౌర జలవికాసం పథకం కింద రైతులకు సోలార్ పంపులు, డ్రిప్, స్ప్రింక్లర్లు, ఉద్యానపంటల సాగుకు ఉచితంగా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. మూడు సంవత్సరాల్లో రూ. 12,600 కోట్లు ఖర్చు చేసే ఈ పథకం ద్వారా గిరిజన రైతుల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జి మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని అన్నారు. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, రైతుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, యూరియా తక్కువ ఉన్నట్టు తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి మోడల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గత పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు లేవన్న ఆయన, ఈ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేయడంపై కట్టుబడి ఉందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ప్రజా సంక్షేమ ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుంచుకొని పనిచేయాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్క సంరక్షణ చేపట్టాలన్నారు. రెవెన్యూ శాఖలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్ష సమావేశంలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ ఐఏఎస్, ఎస్పి రోహిత్ రాజు ఐ పి ఎస్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, టి జి ఐ డి సి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, జిల్లా అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన జీపీఓ, లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్షలు

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 27 (జనంసాక్షి) :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టం అమలులో భాగంగా అధికార కేంద్రీకరణ ధ్యేయంగా, గ్రామాలలో భూ సమస్యలను పరిష్కరించుట కొరకు లైసెన్స్ డ్ సర్వేయర్, గ్రామానికి ఒక రెవిన్యూ అధికారిని నియమించేందుకు నిర్వహించిన పరీక్షలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కాలేజ్ లో జరిగిన లైసెన్స్ సర్వేయర్, గ్రామ పరిపాలన అధికారి పరీక్షల కేంద్రంను అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్ పరీక్షకి 238 మందికి గాను 195 మంది హాజరు, 43 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.గ్రామ పరిపాలన అధికారి పరీక్షకి 80 మందికిగాను 77 హాజరు కాగా,ముగ్గురు గైర్హాజరు అయినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి వివి అప్పారావు,ఎడి ఎస్ఎల్ఆర్ శ్రీనివాసరెడ్డి,ఆర్డీఓ వేణుమాధవరావు, సూపరింటెండెంట్ సంతోష్ కిరణ్,తహసీల్దార్ కృష్ణయ్య, కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారింజవాగులో పడి వృద్ధుడు మృతి



**ఝరాసంగం, జూలై 27 (జనం సాక్షి) :** తన ఇంటి నుండి వెళ్లి అదృశ్యమైన ఓ వృద్ధుడు నారింజ వాగులో పడి శవమై తేలిన సంఘటన ఝరాసంగం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచ్నూర్ శివారులో ఆదివారం చోటు చేసుకుంది ఝరాసంగం ఎస్సై 2 నారయణ కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఝరాసంగం మండలంలోని పొట్టిపల్లి గ్రామానికి చెందిన ముంగి రాములు(75) ఈనెల 23న ఇంటి నుండి వెళ్లి కనిపించకుండా పోయాడు.ఈ విషయమై ఆయన కుమారుడు ముంగి నర్సింలు జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఆ స్టేషన్ ఎస్ఐ కాశీనాథ్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు.అయితే ఆదివారం మాచ్నూరు శివారులోని నారింజ పరివాహక ప్రాంతంలో శవం కనిపించడంతో అది గమనించిన స్థానిక రైతులు ఝరాసంగం పోలీస్ స్టేషన్కు సమాచారం అందించారు.అయితే జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు ఆధారంగా మృత్యుడి కుమారుడు ముంగి నరసింహులకు సమాచారం చేరవేగా ఆయన అక్కడికి వచ్చి తన తండ్రి శవాన్ని గుర్తుపట్టారు.అనంతరం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి శవాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.తదుపరి శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ పేర్కొన్నారు.

## రేషన్ కార్డు అనేది పేదల ఆత్మ గౌరవం

- రేషన్ కార్డుల పంపిణీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**చందంపేట, జూలై 27 (జనం సాక్షి) :** చందంపేట మండలంలోని నూతన రేషన్ కార్డు కార్యక్రమంలో భాగంగా దేవరకొండ నియోజకవర్గంలో షెడ్యూల్డ్ కులాలు, తెగలు, అల్పసంఖ్యాక వర్గాల ప్రజల సంక్షేమానికి తనవంతుగా ఎక్కువ నిధులు అందించి సహకరిస్తానని, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆదివారం చందంపేట మండలం, పోలేపల్లి లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. దేవరకొండ శాసనసభ్యులు కోరిన విధంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, రోడ్ల అభివృద్ధి, ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి తన వంతు సహకారాన్ని అందిస్తానని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, అలాంటిది తమ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతున్నదని, అంతేకాక ధనవంతులతో సమానంగా సన్న బియ్యం ఇస్తున్నామని, 5 లక్షల రూపాయలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని, ఉచిత బస్సు ప్రయాణం, 60 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అమలు చేసిన ఘనత తమదేనని అన్నారు. తమ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణతో పాటు, 42 శాతం బీసీ రిజర్వేషన్ కు సిఫారసు చేయడం జరిగిందని, ఎక్కడా లేని విధంగా కులగణన చేశామని, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న కార్యక్రమాలు పేదలకే చేరాలని తెలిపారు. తన మంత్రిత్వ శాఖల ద్వారా తప్పనిసరిగా దేవరకొండకు ఎక్కువ నిధులను ఇచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి పునరుద్ఘాటించారు. స్థానిక శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రేషన్ కార్డు నిరంతర ప్రక్రియ అని, అయితే చనిపోయిన వారి పేర్లను రేషన్ కార్డులో నుండి తొలగించే విధంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెప్పాలని కోరారు. సన్న బియ్యం పంపిణీ విషయంలో చౌకధర దుకాణా డీలర్లు పారదర్శకంగా ఉండాలని, ఈ విషయంలో ఎలాంటి ఆరోపణలున్న తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలతో కోరారు. అన్ని ప్రభుత్వ పథకాలు పొందేందుకు, ముఖ్యంగా హెల్త్



ఇన్సూరెన్స్ పథకాన్ని పొందేందుకు రేషన్ కార్డు తప్పనిసరి అని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ మాట్లాడుతూ నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 62155 కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, అంతేకాక 80201 మందిని రేషన్ కార్డులలో కొత్తగా సభ్యులుగా చేర్చడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, అటవీ భూముల సర్వే తదితరాల వల్ల భూ సమస్యలు తీరే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్ జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సాంఘిక సంక్షేమ శాఖ డి డి శైలజ ,మాజీ పిఎసిఎస్ చైర్మన్‌లు మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్యంపై చెరగని సంతకం సినారె

- హైకోర్టు న్యాయ మూర్తి కునూరు లక్ష్మణ్

**భువనగిరి, జూలై 27 (జనం సాక్షి) :** తెలుగు సాహిత్యం పై జ్ఞానపీఠ అవార్డు గ్రహీత , పద్మభూషణ్ డాక్టర్ సి. నారాయణరెడ్డి సాహిత్యం చెరగని సంతకం లాంటిదని హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ అన్నారు., భువనగిరి ఎస్ ఎల్ ఎన్ ఎస్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సినారే 94వ జయంతిని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సినారే సాహిత్య పురస్కార ప్రదాన కార్యక్రమం జరిగింది.

### సినారె రాష్ట్రస్థాయి పురస్కార గ్రహీతలు

హైదరాబాద్ కు చెందిన ఆచార్య డి గౌరీ శంకర్, ఉమ్మడి వరంగల్ మనోహర బాబు, ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన కోట్ల వెంకటేశ్వర రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వంశీకృష్ణ, ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు చెందిన దామెర రాములు, ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన కందుకూరి శ్రీరాములు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అన్నవరం దేవేందర్, ఉమ్మడి నిజాంబాద్ జిల్లాకు చెందిన డాక్టర్ వి శంకర్, ప్రత్యేక పురస్కార గ్రహీతగా వరంగల్ కు చెందిన నెల్లుట్ల రమాదేవి లు పురస్కారాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి, డాక్టర్ జె



.చెన్నయ్య, తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సద్ది వెంకటరెడ్డి, ఆలేరు శ్రీ రామకృష్ణ విద్యాలయం అధినేత బండిరాజుల శంకర్, భువనగిరి చెందిన కవి, రచయిత ,నటులు శెట్టి బాలయ్య యాదవ్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, ప్రధాన కార్యదర్శి బండారు జయశ్రీ ,ప్రజాభారతి, రచన సాహితీ కళావేదిక, అక్షర కళాభారతి, తేజ సాహిత్య సేవా సంస్థ, భువన భారతి ,సామాజిక సమరసత వేదిక, అమ్మయాది పెండెం ఫౌండేషన్, ఆత్మీయ భారతి ,మహిళాభారతి, శ్రీ ఫౌండేషన్ ,జాతీయ సాహిత్య పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు

**సూర్యాపేట ప్రతినిధి, జూలై 27 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా హుజూర్ నగర్ నుండి సన్నబియ్యం పంపిణి, తిరుమలగిరి నుండి నూతన్ రేషన్ కార్డులు పంపిణి చేయటం మన జిల్లా అదృష్టమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.ఆదివారం కలెక్టరేట్ లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూర్యాపేట మండలంకు చెందిన వారికి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 32274 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయటం ద్వారా కొత్తగా 95309 మందికి సన్నబియ్యం పొందే హక్కు లభించిందని అన్నారు.సూర్యాపేట మండలంలో 4016 నూతన కార్డుల ద్వారా 12193 మందికి సన్నబియ్యం పంపిణి అర్హత లభించిందని, అలాగే ఇప్పటికే ఉన్న 8008 కార్డులలో 11930 అదనంగా చేర్చి, కొత్తగా అవకాశం కల్పించటం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు,ఆర్డీఓ వేణుమాధవరావు,గ్రంధాలయ సంస్థ చైర్మన్ రామారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్,డిఎస్ఓ మోహన్ బాబు,తహసీల్దార్ కృష్ణయ్య,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**దేవరకొండ, జూలై 27 (జనం సాక్షి) :** దేవరకొండ మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో ఆదివారం జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సీసీ రోడ్డు శంకుస్థాపన చేశారు. వీరితో పాటు స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ 1.35 కోటి నిధులతో సిసి రోడ్డు కు శంకుస్థాపన చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి,మునిసిపల్ కమీషనర్ వై. సుదర్శన్, పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ (పి హెచ్) కె. వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్, మాజీ కౌన్సిలర్లు, మునిసిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండల, వార్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ హాకీకి మాయని మచ్చ రాష్ట్ర హాకీ కార్యదర్శి భీమ్ సింగ్

- తెలంగాణ క్రీడాకారులకు తీరని అన్యాయం..
- భీమ్ సింగ్‌కు వ్యతిరేకంగా జిల్లా కార్యదర్శుల ఫిర్యాదులు..

**హైదరాబాద్, జూలై 27 (జనంసాక్షి) :** మన దేశానికే వన్నెతెచ్చిన జాతీయ క్రీడ హాకీ కి మాయని మచ్చలా మారుతుంది తెలంగాణ రాష్ట్ర హాకీ కార్యదర్శి బీమ్ సింగ్ తీరు. ఏకంగా తెలంగాణ రాష్ట్రంలోనే హాకీ కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. వివరాల్లోకి వెళితే తెలంగాణ రాష్ట్ర హాకీ కార్యదర్శి భీమ్ సింగ్ తన ఇష్టా రీతిగా వ్యవహరిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం కొంతమందికి మాత్రమే ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రవర్తించడం సర్వత్ర విమర్శలకు తావిస్తోంది. గతంలో తెలంగాణ హాకీ కార్యదర్శిగా పనిచేసిన ట్రిపుల్ ఒలంపియన్ ముఖేష్ కుమార్ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల అసోసియేషన్‌లో తన పదవికి రాజీనామా చేయడం అందరికీ తెలిసిందే. అనంతరం కార్యదర్శి పదవిని అలంకరించిన భీమ్ సింగ్ తన ఒంటెద్దు పోకడతో తెలంగాణ హాకీకి తీవ్ర నష్టం కలుగజేస్తున్నట్లు పలువురు జిల్లా కార్యదర్శులు బాహాటంగానే విమర్శించడం గమనార్హం.

### హాకీ ఇండియా నిబంధనలకు తూట్లు..




తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ హాకీ ఇండియా నిబంధనలను తుంగలో తొక్కి తమ సొంత ఎజెండాను మాత్రమే కొనసాగిస్తున్నారు భీమ్ సింగ్. వాస్తవానికి అంతర్ జిల్లా క్రీడా పోటీలను తప్పనిసరిగా నిర్వహించాలని క్రమం తప్పకుండా హాకీ అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించడానికి కార్యనిర్వాహక సభ్యులతో సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఈ విషయాలను పూర్తిగా పక్కన పెట్టి రాష్ట్ర కార్యదర్శి భీమ్ సింగ్ ఒంటెద్దు పోకడలకు తెరలేపడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది.

### జిల్లా కార్యదర్శుల మూకుమ్మడి ఫిర్యాదు..

గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అన్యాయాలను భరించలేక పలు జిల్లాల కార్యదర్శులు మూకుమ్మడిగా హాకీ ఇండియాకు ఫిర్యాదు చేయడం పరిస్థితులు ఏ స్థితికి చేరాయో గమనించవచ్చు. అంతర్ జిల్లా పోటీల నిర్వహణ పైన ఇతర రాష్ట్రాల క్రీడాకారులను ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయడం ఆర్థికపరమైన లావాదేవీల పైన వివరణ ఇవ్వకపోవడం సమావేశాలను నిర్వహించాలని కోరేంతవరకు నిర్వహించకపోవడం తదితర అంశాలపై జిల్లా కార్యదర్శులు హాకీ ఇండియాకు లేఖలు ఇప్పటికే రాయడం జరిగింది. హాకీ క్రీడపై మక్కువతో హాకీ క్రీడకు సహకరిస్తూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కొండ విజయ్ కుమార్ కు సైతం భీమ్ సింగ్ చేసేటటువంటి సొంత నిర్ణయాలు తెలియకపోవడం వల్ల రాష్ట్ర హాకీ క్రీడాకారులు నష్టపోతున్నారని కార్యదర్శులు వాపోతున్నారు. రాష్ట్ర కార్యదర్శి భీమ్ సింగ్ తెలంగాణ హాకీని తన సొంత ఎజెండాతో నడపడాన్ని పలువురు కార్యదర్శులు క్రీడాభిమానులు విమర్శించడం పైన ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ సైతం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని విచారణ నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. లేదంటే తెలంగాణ రాష్ట్రంలో హాకీ కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు.

## బగీచ రెస్టారెంట్‌ను ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్ కుమార్



**వికారాబాద్, జూలై 27 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి మా సరదా హాస్పిటల్, మహవీర్ రోడ్డు సర్కిల్ నందు, గంగారం కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు కుమారుల నూతన బగీచ రెస్టారెంట్ ను ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ యువత వ్యాపార రంగాల్లో రానించాలని మంచి లాభాలతో సాగాలని రెస్టారెంట్ యాజమాన్యం సింధూర్, శ్రీకర్ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శశాంక్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పీలారం మల్లేష్, షరీఫ్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# తగ్గిన కొనుగోలు శక్తి




### యూపీఐ చెల్లింపులపై జీఎస్టీ..

## కేంద్ర ప్రభుత్వం క్లారిటీ

**జనంసాక్షి:**యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధించే అంశంపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. రూ.2000 మించిన యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధించే యోచన ప్రభుత్వానికి లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ రాజ్యసభలో స్పష్టం చేసింది. రూ.2000 దాటిన యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధించాలని జీఎస్టీ కౌన్సిల్ నుంచి ఎలాంటి సిఫారసు చేయలేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభ వర్షాకాల సమావేశాల్లో చెప్పారు. రూ.2000 మించిన యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందా అనే ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, జీఎస్టీ రేట్లు, మినహాయింపులను కేంద్రం, రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల సభ్యులతో కూడిన రాజ్యాంగ సంస్థ అయిన జీఎస్టీ కౌన్సిల్ సిఫార్సుల ఆధారంగా నిర్ణయిస్తామని సభకు తెలిపారు. యూపీఐ ట్రాన్సాక్షన్ డేటా ఆధారంగా కర్ణాటకలోని వ్యాపారులకు దాదాపు 6,000 జీఎస్టీ డిమాండ్ నోటీసులు అందాయి.మరోవైపు యూపీఐ లావాదేవీలను మరింత లోతుగా స్క్రూటినీ చేస్తూ, వాటి ఆధారంగా జీఎస్టీని దూకుడుగా అమలు చేస్తే మొదటికే మోసం రావొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ ఒక నివేదికలో హెచ్చరించింది. దీనివల్ల చిన్న వ్యాపారులు తిరిగి నగదు లావాదేవీల వైపు వెళ్లిపోయే అవకాశం ఉందని పేర్కొంది. అలా జరగకుండా జీఎస్టీ అమలు విషయంలో జాగ్రత్తగా, బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందని నివేదిక సూచించింది.

**చేతులు మారుతున్న హౌసింగ్ బ్రోకరేజీ సంస్థ**

హౌసింగ్ బ్రోకరేజీ సంస్థ 'ప్రాప్‌టైగర్'ను కొనుగోలు చేస్తున్నట్టు ఆరమ్ ప్రాప్‌టెక్ లిమిటెడ్ ప్రకటించింది. రూ.86.45 కోట్ల విలువ మేర షేర్లను జారీ చేయడం ద్వారా ఆస్ట్రేలియాకు చెందిన ఆర్ఈఏ గ్రూప్ నుంచి ప్రాప్‌టైగర్‌ను సొంతం చేసుకుంటున్నట్టు తెలిపింది. ఇందులో భాగంగా ఆర్ఈఏ ఇండియాకు ప్రిఫరెన్షియల్ షేర్లను జారీ చేయనున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వెల్లడించింది.ప్రాప్‌టైగర్ మార్కెటింగ్ సర్వీసెస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ 100 శాతం షేర్లను కొనుగోలు చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపినట్టు పేర్కొంది. ఒక్కోటీ రూ.5 ముఖ విలువ కలిగిన 42,42,537 షేర్లను ఆర్ఈఏ ఇండియాకు జారీ చేయనున్నట్టు వెల్లడించింది. షేర్ల జారీ అనంతరం ఆరమ్ ప్రాప్‌టెక్‌లో ఆర్ఈఏ ఇండియాకు 5.54 శాతం వాటా లభించనుంది.ప్రాప్‌టైగర్ నిర్వహణలో రియల్ ఎస్టేట్ ప్రకటనల పోర్టల్ అయిన హౌసింగ్ డాట్ కామ్ ఉండడం గమనార్హం. 2023-24లో హౌసింగ్ డాట్ కామ్ ఆదాయం రూ.101 కోట్లుగా ఉంది. ఆరమ్ ప్రాప్‌టెక్ రియల్ ఎస్టేట్ రంగానికి సాఫ్ట్‌వేర్, టెక్నాలజీ పరిష్కారాలను అందిస్తుంటుంది.




**జనంసాక్షి** సామాన్యుడి సొంతింటి కల మరింత దూరమవుతోంది. అందుబాటు గృహాల నిర్మాణాలు తగ్గుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఇసుక, సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో పాటు డెవలపర్లు విలాసవంతమైన ఇళ్ల నిర్మాణానికే మొగ్గు చూపిస్తున్నారు. గతంలో ప్రభుత్వాలు కూడా సామాన్య, మధ్యతరగతి కోసం వేర్వేరు పథకాల ద్వారా సొంతింటి కలను నెరవేర్చేవి. కేంద్రం ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గృహరుణ ఆధారిత వడ్డీ సబ్సిడీతో కొనుగోలుదారులకు భారం తగ్గి ఈఎంఐ చెల్లింపుల్లో కొంత వెసులుబాటు లభించేది. ఎంఐజీ విభాగంలో 1,800 చ.అ. విస్తీర్ణం వరకు ఈ పథకం అమలు చేసినప్పుడు ఎక్కువ ప్రయోజనం పొందారు. ఇప్పుడిది ఎల్ఐజీ వరకే పరిమితమైంది. దీంతో సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. పట్టణాల్లో హౌసింగ్ బోర్డుల ఆధ్వర్యంలో గృహ నిర్మాణం చేపట్టినప్పుడు అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని కాలనీలను నిర్మించేవారు. అధిక ఆదాయం, మధ్య, తక్కువ ఆదాయ వర్గాలుగా హెచ్ఐజీ, ఎంఐజీ, ఎల్ఐజీగా విభజించి ఇళ్లు, స్థలాలను విక్రయించే పరిస్థితి ఉండేది. అయితే డిమాండ్‌కు అనుగుణంగా, కొనుగోలుదారుల అవసరాలకు తగ్గట్టుగా నిర్మాణాలు చేపట్టడంలో హౌసింగ్ బోర్డులు వెనకబడటంతో ప్రైవేట్ రంగం విజృంభించింది. మొదట్లో అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్న ఇళ్ల నిర్మాణం చేపట్టినా.. తర్వాత డిమాండ్ ఉన్న ప్రీమియం ఇళ్లవైపు వ్యవస్థీకృత రియల్ ఎస్టేట్ మొగ్గింది. భూముల ధరలు అనూహ్యంగా పెరగడంతో సరసమైన ధరల ప్రాజెక్టులు చేపట్టలేకపోతున్నామని.. విలాసవంతమైన ఇళ్ల నిర్మాణం చేపడితే విక్రయాలు బాగుంటున్నాయని బిల్డర్లు అంటున్నారు.మధ్యతరగతి వర్గాల్లో అత్యధిక శాతం మంది గృహరుణం ద్వారానే ఇల్లు కొంటుంటారు. అధిక వడ్డీ రేట్లు, రుణ లభ్యత తగ్గిపోవడంతో సొంతింటి కల సవాల్‌గా మారింది. భూముల ధరలు పెరగడం.. ఆ మేరకు ఇంటి ధరలను పెంచాల్సి రావడంతో అందుబాటు ధరల్లో ఇళ్ల లభ్యత తగ్గిపోయింది. బిల్డర్ ఎవరైనా ముందుకొచ్చి సరసమైన ధరల ఇళ్ల నిర్మాణం చేపడితే వాటిని విక్రయించడం పెద్ద సవాల్‌గా మారిందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఆయా వర్గాల్లో మేరకు కొనుగోలు శక్తి లేకపోవడమే దీనికి కారణం. అన్ని వనరులను సమీకరించుకుని కొంతమంది కొనుగోలు చేస్తున్నారు.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.25 | ₹ 4.27 |


**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 91,600 (22 క్యారెట్లు) | ₹ 99,930 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,26,000

### రూ. 353 కోట్ల ఐపీవోకి హైదరాబాదీ సంస్థ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నెఫ్రోప్లస్ బ్రాండ్ పేరిట డయాలసిస్ సేవలందించే హైదరాబాదీ సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ తాజాగా పబ్లిక్ ఇష్యూకి (ఐపీవో) రానుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. దీని ప్రకారం ఐపీవో ద్వారా కంపెనీ రూ. 353.4 కోట్లు సమీకరించనుంది. ప్రమోటర్లు, ప్రస్తుత షేర్‌హోల్డర్లు, ఓఎఫ్ఎస్) రూపంలో 1.27 కోట్ల షేర్లను విక్రయించనున్నారు.ప్రీ-ఐపీవో ప్లేస్‌మెంట్ ద్వారా నెఫ్రోప్లస్ రూ. 70.6 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇన్వెస్ట్‌కార్ప్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ టూ, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ మొదలైనవి కంపెనీ ప్రమోటర్లుగా ఉన్నాయి. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 129.1 కోట్లను దేశీయంగా కొత్తగా డయాలసిస్ క్లినిక్‌లను ప్రారంభించేందుకు, రూ. 136 కోట్లను రుణాల చెల్లింపునకు, మిగతా మొత్తాన్ని ఇతరత్రా కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది.




### హైదరాబాద్‌కు ఐసీఐసీఐ లాంబార్డ్ 'డిజాస్టర్ రికవరీ' మార్పు

న్యూఢిల్లీ: బీమా రంగ సంస్థ ఐసీఐసీఐ లాంబార్డ్ తమ డిజాస్టర్ రికవరీ మౌలిక సదుపాయాలను అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో ఆసియా-పసిఫిక్ (ముంబై) నుంచి ఆసియా పసిఫిక్ రీజియన్‌కు అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించింది. నిర్వహణపరమైన రిస్కులను సమర్థంగా ఎదుర్కొంటూ, కస్టమర్లకు నిరాటంకంగా సేవలు అందించేందుకు ఇది సహాయపడగలదని పేర్కొంది. టెక్నాలజీపరమైన అంతరాయాలు, అంతర్జాతీయంగా ఐటీ పరిశ్రమలో రిస్కులు పెరుగుతున్న నేపథ్యంలో డౌన్‌టైమ్‌ను గణనీయంగా తగ్గించడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు తెలిపింది.


### ఈసీఎం స్కీమ్.. రూ.16 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు

**జనంసాక్షి:**ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ స్కీమ్ (ఈసీఎంఎస్) కింద రూ. 16,000 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు కేంద్రానికి అందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అనుమతుల ప్రక్రియ ఇప్పటికే మొదలైందని, షార్ట్‌లిస్ట్ చేసిన ప్రాజెక్టుల పేర్లను సెప్టెంబర్‌లో ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. దేశ, విదేశ కంపెనీల నుంచి ఈ స్కీముకు మంచి స్పందన లభించినట్లు వివరించాయి.రూ. 22,805 కోట్ల ఈసీఎంఎస్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మే 1న దరఖాస్తులు ఆహ్వానించింది. ఎలక్ట్రానిక్ విడిభాగాల డిమాండ్‌కు తగ్గట్లుగా దేశీయంగా సరఫరాను పెంచేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. టాటా ఎలక్ట్రానిక్స్, డిక్సన్ టెక్నాలజీస్, ఫాక్స్‌కాన్‌లాంటి సంస్థలు దీనిపై ఆసక్తి కనపర్చినట్లు సమాచారం.విడిభాగాల సెగ్మెంట్లో 2030 నాటికి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి 500 బిలియన్ డాలర్లకు చేరనుండగా, డిమాండ్-సరఫరా మధ్య వ్యత్యాసం 248 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 21 లక్షల కోట్లు) చేరుతుందని ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంచనా వేస్తోంది. దేశీయంగా ఉత్పత్తిని పెంచేందుకు తగు చర్యలు తీసుకోకపోతే ఈ కొరతను అధిగమించేందుకు దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది.

### అమెరికా వాల్‌మార్ట్‌లో కత్తిపోట్ల కలకలం..

**సినిమాను తలపించేలా..**

**జనంసాక్షి:**అమెరికాలో కత్తిపోట్లు కలకలం రేపాయి. మిచిగాన్ ట్రావర్స్ సిటీలోని వాల్‌మార్ట్ స్టోర్‌లో శనివారం రాత్రి జనంపై ఓ దుండగుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనలో 11 మంది గాయపడ్డారు. బాధితుల్లో ఆరుగురు పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అందుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటన గురించి ప్రత్యక్ష సాక్షులు వివరిస్తూ.. ఒక్కసారిగా షాక్‌కు గురయ్యామని తెలిపారు. ఈ ఘటన సినిమా సన్నివేశాన్ని తలపించిందన్నారు.




# మస్క్ నమ్మిన బంటు.. మనోడే..


**అమెరికా కుబేరుడి ఆర్థిక సామ్రాజ్యం భారత సంతతికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ వైభవ్ తనేజా చేతిలో..**



**జనంసాక్షి:**ప్రపంచ అపర కుబేరుడు ఎలాన్ మస్క్ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు ఆర్థిక భారత సంతతికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ వైభవ్ తనేజా. ప్రస్తుతం టెస్లా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ)గా ఉన్న ఆయనకు ఇప్పుడు మరింత పెద్ద బాధ్యతలు అప్పగించారు మస్క్. కొత్తగా ప్రకటించిన రాజకీయ వెంచర్ అయిన అమెరికా పార్టీకి వైభవ్ తానేజాను ట్రెజరర్, రికార్డుల కస్టోడియన్‌గానూ చేశారు. సంప్రదాయ ఐఐటీ-ఐఐఎం నుంచి వచ్చినవాడు కాకపోయినా తనేజా రూ.1,100 కోట్ల వేతన పరిహారాన్ని అందుకుంటున్నారని ది వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.తనేజా అధికారికంగా అమెరికా పార్టీ ఆర్థిక వ్యవహారాల బాధ్యతలు చేపట్టినట్లు ఇటీవల ఫైనాన్షియల్ ఎక్స్ ప్రెస్ నివేదిక ధృవీకరించింది. ఈ పాత్రలో ఆయన రాజకీయ నిధులు, బడ్జెట్ పంపిణీని పర్యవేక్షించడం, ఆర్థిక చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు. ఇది కార్పొరేట్ ఫైనాన్స్ లో ఆయన ప్రస్తుత పాత్ర నుండి రాజకీయ రంగానికి గణనీయమైన మార్పును సూచిస్తుంది. తనేజాపై ఉన్న నమ్మకంతో మస్క్ ఇప్పుడు తన రాజకీయ పార్టీ ఆర్థిక బాధ్యతలనూ అప్పగించారు.

**ఢిల్లీ యూనివర్సిటీ నుంచి మొదలై..**

వైభవ్ తనేజా ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఫైనాన్స్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 1999 లో కామర్స్ లో పట్టభద్రుడయ్యారు. ఆ తర్వాతి సంవత్సరం చార్టర్డ్ అకౌంటెంట్‌గా అర్హత సాధించారు. 2006లో అమెరికా వెళ్లి సర్టిఫైడ్ పబ్లిక్ అకౌంటెంట్ (సీసీఏ) అయ్యారు. ఇదే ఆయన ప్రపంచ ఆర్థిక జీవితాన్ని విస్తరించింది.ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ (పీడబ్ల్యూసీ)లో ఆయన దాదాపు 17 సంవత్సరాలు పనిచేశారు. అక్కడాయన 500 మందికి పైగా క్లయింట్లకు రెగ్యులేటరీ ఫైలింగ్స్, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, ఐపీఓలను నిర్వహించారు.అక్కడాయన 500 మందికి పైగా క్లయింట్లకు రెగ్యులేటరీ ఫైలింగ్స్, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, ఐపీఓలను నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన రంగంలోకి ఆయన ప్రవేశం 2016లో సోలార్సిటీతో జరిగింది. ఈ సంస్థ తరువాత టెస్లాలో విలీనమైంది.




**రూ.1,100 కోట్ల వేతనం**

2017లో టెస్లాలో చేరిన తనేజా క్రమంగా ఎదుగుతూ 2023లో ఆ సంస్థకు సీఎఫ్ఓ అయ్యారు. 2024లో ఆయన 139.5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1,157 కోట్లు) వేతన పరిహారం అందుకున్నారు. ఇందులో మూల వేతనంగా అందుకున్నది 4 లక్షల డాలర్లే అయినప్పటికీ మిగిలినది స్టాక్ ఆప్షన్లు, ఈక్విటీ అవార్డుల ద్వారా వచ్చింది. టెస్లా ఇండియా మోటార్స్ అండ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ లో డైరెక్టర్‌గా కూడా తానేజా పనిచేశారు.

### స్పేస్‌డే నాటికి సలహాలు, సూచనలు పంపండి

**మన్ కీ బాత్‌లో పథాని మోదీ**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆగస్టు 23వ తేదీన నేషనల్ స్పేస్‌డే సందర్భంగా ప్రజలు సలహాలు, సూచనలు పంపాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.ఇందుకు నమో యాప్‌ను వాడుకోవాలన్నారు. ప్రధాని మోదీ 124వ మన్‌కీ బాత్ కార్యక్రమం నేడు ప్రసారమైంది. ఈ సందర్భంగా ప్రధాని పలు అంశాలను తన కార్యక్రమంలో ప్రస్తావించారు. "గత కొన్ని వారాలుగా స్పేస్, సైన్స్ రంగాల్లో విజయాల గురించి మనం మాట్లాడుతున్నాం. వ్యోమగామి శుభాంశు శుక్లా భూమిపైకి తిరిగి వచ్చారు. చంద్రయాన్-3 విజయవంతం సమయంలో కూడా దేశంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. ఆగస్టు 23న నేషనల్ స్పేస్‌డే ఈ సందర్భంగా మీరు సలహాలు, సూచనలు నమో యాప్ ద్వారా పంపండి. 1908లో ముజఫర్‌పూర్‌లో ఓ యువకుడిని ఉరితీశారు. ఆ సమయంలో అతడి ముఖంలో భయం లేదు.. ఆత్మవిశ్వాసం ఉంది. అతడి పేరు ఖుదిరామ్ బోస్. వయసు 18 ఏళ్లు. దేశాన్ని కదిలించాడు. అలాంటి చాలా త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకొంటున్నాం. ఆగస్టు నెల ఓ విప్లవ మాసం. ఆగస్టు 15 నాడు మనం స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకొంటాం.1905 ఆగస్టు 7వ తేదీన సరికొత్త ఉద్యమం మొదలైంది. స్వదేశీ ఉద్యమం స్థానిక ఉత్పత్తుల్లో మరింత జవసత్వాలను నింపింది. ముఖ్యంగా వస్త్రపరిశ్రమలో ఇది కనిపించింది. దానికి చిహ్నంగానే ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం.వస్త్ర తయారీ రంగం దేశానికి అదనపు బలంగా మారింది. మహారాష్ట్ర నుంచి కవిత ధావ్లె, ఒడిశా నుంచి మయూర్‌భాంజ్, బిహార్ నుంచి నవీన్ కుమార్ చేనేతలో స్ఫూర్తిమంతంగా ఉంటున్నారు. మహారాష్ట్రలో 12 కోటలను ప్రపంచ వారసత్వ సంపదగా యూనెస్కో గుర్తించింది. కొన్నేళ్ల క్రితం రాయగఢ్‌కు వెళ్లాను. అది నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అస్సాంలోని కజిరంగా నేషనల్‌పార్క్‌లో గడ్డి భూమి పక్షులకు నిలయం. అక్కడ 40 రకాలు ఉన్నాయి. టెక్నాలజీ బృందాలు వాటి కూతలు, ఏఐ ఆధారంగా లెక్కించాయి. టెక్నాలజీ, సెన్సివిటీ కలిస్తే ప్రతిదీ తేలిక అవుతుంది" అని మోదీ పేర్కొన్నారు.

### ఈ బ్యాంకుల లాభాలు తగ్గాయ్..

**జనంసాక్షి:**ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం స్టాండెలోన్ ప్రాతిపదికన లాభం రూ. 3,282 కోట్లకు పరిమితమైంది.గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నమోదైన రూ. 3,520 కోట్లతో పోలిస్తే 7 శాతం క్షీణించింది. రిజర్వ్ బ్యాంక్ కీలక పాలసీ రేట్లను తగ్గించడం, ఫీజు ఆదాయాల వృద్ధి నెమ్మదించడం, ప్రొవిజనింగ్ పెరగడం వంటి అంశాలు ఇందుకు కారణం. వార్షికంగా చూస్తే మొండిబాకీలకు ప్రొవిజనింగ్ 109 శాతం ఎగిసి రూ. 1,208 కోట్లకు చేరింది. ఇక నికర వడ్డీ ఆదాయం 6 శాతం పెరిగి రూ. 7,259 కోట్లకు చేరగా, నికర వడ్డీ మార్జిన్ (నిమ్) 4.65 శాతంగా నమోదైంది. మరోవైపు, కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన బ్యాంక్ లాభం స్వల్పంగా 1 శాతం వృద్ధితో రూ. 4,472 కోట్లకు చేరింది. జనరల్ ఇన్సూరెన్స్ విభాగం విక్రయానికి సంబంధించి రూ. 3,000 కోట్లు కూడా జత కావడంతో గత క్యూ1లో లాభం రూ. 7,448 కోట్లుగా నమోదైంది. తాజాగా నిర్వహణలోని మొత్తం ఆస్తుల పరిమాణం (ఏయూఎం) 18 శాతం పెరిగి రూ. 6,36,311 కోట్ల నుంచి రూ. 7,50,143 కోట్లకు పెరిగింది. స్థూల ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో రిటైల్ కమర్షియల్ వాహన రుణాల పోర్ట్‌ఫోలియోలో ఒత్తిడి నెలకొన్నట్లు బ్యాంకు తెలిపింది.సమీక్షాకాలంలో అసెట్ క్వాలిటీ స్వల్పంగా క్షీణించింది. స్థూల నిరర్థక ఆస్తుల పరిమాణం (జీఎన్‌పీఏ) 1.39 శాతం నుంచి 1.48 శాతానికి పెరిగింది. నికర ఎన్‌పీఏలు స్థిరంగా 0.34 శాతంగా నమోదయ్యాయి. అటు కరెంట్ అకౌంట్ సేవింగ్స్ అకౌంట్ (కాసా) నిష్పత్తి 43.4 శాతం నుంచి 40.9 శాతానికి తగ్గింది. సగటున మొత్తం డిపాజిట్లు 13 శాతం వృద్ధితో రూ. 4,35,603 కోట్ల నుంచి రూ. 4,91,998 కోట్లకు, రుణాలు 14 శాతం పెరిగి రూ. 4,44,823 కోట్లకు చేరాయి. కరెంట్ డిపాజిట్లు 9 శాతం పెరిగి రూ. 62,200 కోట్ల నుంచి రూ. 67,809 కోట్లకు, సేవింగ్స్ డిపాజిట్లు 2 శాతం వృద్ధితో

### విరుచుకుపడ్డ వైతరణి



- భారీ వరదలకు ఉగ్రరూపం దాల్చిన నది
- ఒడిశాలో ఉప్పొంగుతున్న నదులు
- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- అంతకంతకూ పెరుగుతున్న నీటిమట్టం
- అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం

భువనేశ్వర్: రాష్ట్రంలో వరదలతో నదులు పొంగిపొర్లుతున్నాయి .పలుచోట్ల ప్రమాద సంకేతం దాటి తీర ప్రాంతాల్లో కట్టలను బలహీనపరుస్తున్నాయి. నదీతీర ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు. ప్రాణహాని జరగకుండా సమగ్ర యంత్రాంగం చురుకుగా పని చేస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ పేర్కొంది. ప్రధానంగా సువర్ణ రేఖ, వైతరణి, జలకా నదుల్లో వరద ఉద్ధృతి విపరీతంగా కొనసాగుతోంది. ఈ నదుల్లో నీటిమట్టం పలు తీర ప్రాంతాల్లో గరిష్ట పరిమితికి మించి ఉంది. వైతరణి నది ఆనందపూర్, అఖుపొదా, జలకా నది మథాని తీరం, సువర్ణ రేఖ నది జంసోలా ఘాట్, రాజ్‌ఘాట్ తీర ప్రాంతాల్లో గరిష్ట పరిమితిని మించి ప్రవహిస్తున్నాయి. ఈ నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల అంచనా.రాష్ట్రంలో వరద ముంపు పరిస్థితి తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితి నివారణ కోసం ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. నదుల్లో వరద పరిస్థితిని నియంత్రించడానికి ప్రభుత్వం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి కార్యాచరణ ఖరారు చేసింది. అల్ప పీడనం కారణంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో వివిధ నదుల నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. నదుల్లో నీటిమట్టం పెరుగుతున్నందున వరద ముంపు పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాఢి శనివారం విలేకరులకు తెలియజేశారు. అవసరమైతే లోతట్టు వరద తాకిడి ప్రాంతాల్లో ప్రజలను ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకు తరలిస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బాలాసోర్ జిల్లాలో 4 మండలాలు మళ్లీ ప్రభావితం అవుతాయని భావిస్తున్నారు. వాటిలో బలియాపాల్, భొగొరాయ్, బొస్తా, జలేశ్వర్ ఉన్నాయి.ఉప్పొంగుతున్న నదీతీర ప్రాంతాల్లో పరిస్థితులపై అనుబంధ యంత్రాంగం నిరంతర నిఘా పెడుతోంది. రాష్ట్ర వరద విభాగం రాత్రింబవళ్లు చురుకుగా పని చేస్తుందని చంద్రశేఖర్ పాఢి తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లకు అప్రమత్తం చేశారు. జాజ్‌పూర్, భద్రక్ - బాలసోర్ జిల్లా కలెక్టర్లు నదీతీర ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, క్షేత్రస్థాయిలో అనుబంధ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సువర్ణరేఖ, బుధా'లంగ్, మహానది, బ్రాహ్మణి, వైతరణి వ్యవస్థ నుంచి చీఫ్ ఇంజినీర్లు, బేసిన్ మేనేజర్లు జిల్లా యంత్రాంగంతో సమన్వయ కార్యాచరణను పర్యవేక్షిస్తున్నారు. భువనేశ్వర్ నుంచి ఇద్దరు ఇంజినీర్ ఇన్ చీఫ్‌లను ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఉన్నతాధికారులు సువర్ణరేఖ బేసిన్, వైతరణి బేసిన్ పరిధిలో వారు క్షేత్రస్థాయిలో వరద నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ఈ రెండు నదుల్లో నీటి మట్టాలు ప్రమాద స్థాయిని దాటిన తర్వాత ఈ అధికారులను తరలించారు. భద్రక్ జిల్లా అఖుపొడా తీరంలో వైతరణి ఉగ్రరూపం దాల్చుతోంది. ఈ మేరకు కలెక్టర్ వరద హెచ్చరికను జారీ చేశారు. చాంద్‌బాలి, ధామ్‌నగర్‌లు తీవ్రంగా, భొండారి, పొఖొరి ప్రాంతాలు పాక్షికంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మయూర్‌భంజ్ జిల్లాలో రాసగోవింద్‌పూర్, మోర్దా, షులియాపడా, చిత్రాడ్ మొదలైన ప్రాంతాల్లో ఎగువ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా జలకా నది నీటిమట్టం పెరుగుతోంది. ఇటీవల ఈ ప్రాంతం వరదలకు గురై వందలాది హెక్టార్లలోని వరి పొలాలు నాశనమయ్యాయి.



## మెటల్ రోడ్ల నిర్మాణం చేపట్టి రైతుల ఇబ్బందులు తొలగించాలి

**మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేసిన సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు**

మంథని, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ సగ్రిగేషన్ షెడ్డు నుండి కమాన్ పూర్ పెద్ద చేరువు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర మెటల్, ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అలాగే కమాన్ పూర్ ఎస్సి ప్రభుత్వ బాలుర హాస్టల్ మీదుగా జూలపల్లి, ముల్కలపల్లి రహదారి సుమారు రెండు కిలోమీటర్ల మేర మెటల్, ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ రోడ్ల వెంబడి నిత్యం రైతులు కూలీలు వ్యవసాయ వెళ్తూ ఉంటారని బురద రోడ్లతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రోడ్ల నిర్మాణం పనులు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు.

## బహుజన అలయ్‌బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న ష్రబ్బీర్ అలీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 27 (జనంసాక్షి) :



ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలో కళాభారతి లో నిర్వహించిన బహుజన అలయ్ బలయ్ కార్యక్రమంలో షబ్బీర్ ఆలీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.భారత రాజ్యాంగ సంరక్షనే బహుజనుల పంతమని,అబ్ కీ బార్ చార్ సౌ పార్ అన్న బిజెపి అహంకారాన్ని రాహుల్ గాంధీ పాదయాత్ర ద్వారా అడ్డుకున్నాం. రాజ్యాంగాన్ని రద్దుచేసి మనువాదాన్ని తీసుకు రావాలనుకుంటున్న కలలు కలలుగానే మిగిలిపోతాయని అన్నారు,కంచె ఐలయ్య లాంటి మేధావులు ఈరోజు బయటకు వచ్చి రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటు న్నారు. దేశంలోనే మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న మన తెలంగాణ రాష్ట్రంలో నే 42% రిజర్వేషన్ అమలు మొదలు పెడుతున్నామని,స్థానిక ఎన్నికల్లో మనమందరం ఏకమై కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి సత్తా చాటండని.బహుజనులందరూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కామారెడ్డి పట్టణంలో నిర్వహిస్తున్న బహుజన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని.ఎస్సీ బీసీ ఎస్టీ మైనార్టీల హక్కుల కోసం పోరాడిన మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే బాబాసాహెబ్ అంబేద్కర్ పెరియార్ రామస్వామి లాంటి మహానుభావుల ఆశయాలను కొనసాగిద్దామని అన్నారు.కాంగ్రెస్ పార్టీ బాబాసాహెబ్ అంబేద్కర్ సాధించి పెట్టిన హక్కులు రిజర్వేషన్లు నేడు ప్రమాదంలోకి నెట్టబడుతున్నా యన్నారు. మన హక్కుల కోసం నిలబడి కొట్లాడవలిసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.విద్య రాజకీ య సాంఘిక ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు బీసీ ఎస్టి ఎస్సి మైనార్టీల మైన మనమందరం ఒక్కటై కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి మన రాజ్యాంగాన్ని కాపాడుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను

## ఆకస్మిక తనిఖీ చేసిన స్టేట్ జాయింట్ సెక్రెటరీ

**సుల్తానాబాద్,జూలై 27(జనంసాక్షి) :** మండలంలోని భూపతిపూర్ లో గల మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను జ్యోతిబాపూలే పాఠశాలల రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిరుపతి అకస్మిక తనికి చేశారు. తనికెల్లో భాగంగా కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, స్టోర్ రూమ్స్, క్లాస్ రూమ్స్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలలో నాణ్యమైన భోజనంతోపాటు, ఉన్నత విద్యను అందిస్తున్నారని జాయింట్ సెక్రెటరీ తిరుపతికి తెలపడంతో విద్యార్థుల నుండి వచ్చిన స్పందనను చూసి ప్రిన్సిపల్ జక్కని రాజేశంను ప్రత్యేకంగా అభినందించారు.



# వైద్య, విద్యా రంగాలకు కేంద్రం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది

- **మూడు రెట్ల నిధులు అధికంగా వైద్య రంగానికి కేటాయించిన మోదీ.**
- **కరీంనగర్ జిల్లా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ నూతన భవనాన్ని ప్రారంభించిన కేంద్ర హెూం శాఖ సహాయం మంత్రి బండి సంజయ్ కుమార్**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 27 (జనంసాక్షి) :**
కరీంనగర్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో కేంద్ర నిధులతో నిర్మించిన 'క్రిటికల్ కేర్ బ్లాక్' భవనాన్ని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఆ భవనమంతా కలియ తిరిగి ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులతో సమావేశమై మౌలిక సదుపాయల కల్పన, సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్య, వైద్యా రంగాలకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్నారని, అందులో భాగంగానే కరీంనగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ.23 కోట్ల 75 లక్షల కేంద్ర నిధులతో 'క్రిటికల్ కేర్ బ్లాక్' నూతన భవనాన్ని నిర్మించామని, మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఈ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది నియామకం, మెయింటెన్స్ అంతా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందని, వాటిని వెంటనే సమకూర్చి క్రిటికల్ కేర్ బ్లాక్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రులకు సకాలంలో నిధులు విడుదల చేసి సేవలకు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. దేశం అభివృద్ధికి విద్య, వైద్యం చాలా ముఖ్యమని, అందుకే మోదీ ప్రభుత్వం ఈ రంగాలకు అత్యంత ప్రాముఖ్యనిస్తోందని అన్నారు. యూపీఏ హయాంలో (2014 -15 బడ్జెట్‌లో) విద్యా రంగానికి కేంద్రం 68 వేల 728 కోట్లు కేటాయిస్తే, ఈ ఒక్క ఏడాదే (2025 - 26) మోదీ సర్కార్ 1 లక్షా 28 వేల 650 కోట్ల రూపాయలు కేటాయించిందని అన్నారు. అంటే దాదాపు విద్యా బడ్జెట్ ను డబుల్ చేశారని అన్నారు. వైద్య రంగానికి యూపిఎ యుగంలో 2013-14లో కేంద్ర ఆరోగ్య బడ్జెట్ 37 వేల కోట్ల రూపాయలు మాత్రమేనని, కానీ మోదీ ప్రభుత్వం ఈ బడ్జెట్ లో (2025 - 26) వైద్య రంగానికి కేటాయించిన బడ్జెట్ 1 లక్షా 35 వేల కోట్ల రూపాయలని అన్నారు. మోదీ ప్రభుత్వానికి పేదలపట్ల, వారి ఆరోగ్యంపట్ల ఉన్న శ్రద్ధకు నిదర్శనమే ఈ బడ్జెట్ కేటాయింపు అని తెలిపారు. కేంద్రం ఆయుష్మాన్ భారత్ వంటి విప్లవాత్మకమైన పథకాలు తీసుకొచ్చాక ప్రజలపై భారం చాలా తగ్గిందని, నూటికి 39 రూపాయల 40 పైసలు మాత్రమే భారం పడుతోందని అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులున్న వారికైతే 5 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందుతోందని తెలిపారు. వైద్య రంగంలో తీసుకువచ్చిన అభివృద్ధి, విప్లవాత్మక మార్పులు చాలా ఉన్నాయని, గత 11 ఏళ్లలో ఆలిండియా ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంఖ్య 30కి పెరిగాయని అన్నారు. గత ప్రభుత్వాల పాలన నాటికి దేశవ్యాప్తంగా 7 మాత్రమే ఉండేవని, మోదీ పాలనలో 30కి పెరిగాయని అన్నారు. 2014 లో 387 ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లు మాత్రమే ఉంటే నేడు వాటిని రెట్టింపు (780) చేశారని, ఎంబీబీఎస్ సీట్లు గతంలో 51 వేలు మాత్రమే ఉండేవని, మోదీ వచ్చాక మెడికల్ సీట్ల సంఖ్యను 1 లక్షా 18 వేలకు పెంచారని అన్నారు. గతంలో 31 వేల పీజీ సీట్లు మాత్రమే ఉంటే నేడు 74 వేలకుపైగా సీట్లు అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, జిజిహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, డి ఎం హెచ్ ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

## గంగమ్మ వాగు ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి) :**
కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలోని గంగమ్మ వాగు వద్ద శనివారం నీటి ప్రవాహం ప్రమాదకరంగా పెరగడంతో రహదారి శాఖ అధికారులు వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారిని తాత్కాలికంగా మూసి వేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా ఆదివారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ గంగమ్మ వాగు ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. నూతనంగా నిర్మించిన వంతెనకు వెంటనే అప్రోచ్ రోడ్లు నిర్మించాలంటూ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అధికార యంత్రాంగం వేగంగా స్పందించి అప్రోచ్ నిర్మాణం పూర్తిచేసింది.సమస్య పరిష్కారానికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే సైతం సంబంధిత అధికారులకు తగు సూచనలు చేసారు. ప్రస్తుతం వాహనాలు కొత్త వంతెన మీదుగా సురక్షితంగా సాగుతున్నాయి.ప్రభుత్వ యంత్రాంగం మరియు ప్రజాప్రతినిధుల చొరవతో తక్షణ స్పందన సాధ్యమవడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



### జీపీఓ, లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్షా కేంద్రాలను

# తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 27 (జనం సాక్షి) :** గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరుపై ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 60 మంది అభ్యర్థులకు గాను, 46 మంది హాజరయ్యారని, 14 మంది గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్ లో 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన థియరీ పరీక్షకు 305 మంది అభ్యర్థులకు గాను 271 మంది హాజరయ్యా రని, 34 మంది గైర్హాజరు అయినట్లు వివరించారు. కాగా, లైసెన్స్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సెకండ్ సెషన్ లో జరిగే ప్లాటింగ్ పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గట్టి పోలీసు బందోబస్తు నడుమ ఎలాంటి కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహిస్తుండడాన్ని గమనించి న కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డీ అశోక్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్ కుమార్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రశాంత్ ఉన్నారు.



# చినుకు పడితే చిత్తడే

### వరి నాట్లు వేయచ్చు అంటున్న ప్రజలు

**కథలాపూర్, జులై 27,(జనం సాక్షి) :** కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామ సరిహద్దు కమ్మర్ పల్లి మండలంలో మారుమూల గ్రామమైన కోనాపూర్ గ్రామ ప్రజలు నిత్యా వసరాలకు జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి సరుకుల నిమిత్తం గానీ,వైద్య సౌకర్యాల కోసం గానీ,ఇతరత్రా పనుల కోసం దాదాపు 90% ప్రజలు వెళ్తూ ఉంటారు. అంత రద్దీగా ఉండే ఈ రోడ్డు మాత్రం వాన చినుకు పడిందంటే చాలు చిత్తడి చిత్తడిగా మారి వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారుతుంది. గత ప్రభుత్వ బిఆర్ఎస్ హయంలో పనులు ప్రారంభించిన తర్వాత ఎలక్షన్ కోడ్ రావడంతో మధ్యలోనే పనులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్న రోడ్డు పనులలో ఏమాత్రం పురోగతి కనిపించడం లేదు గత రెండు సంవత్సరాలుగా గ్రామ ప్రజలు ఈ రోడ్డు ద్వారానే ప్రయాణలు చేస్తూ నానా అవస్థలుతో గత నాలుగు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న చిరుజల్లులకు రోడ్డు మరింత చెడిపోవడం జరిగింది.ఏదైనా అత్యవసర వైద్య సదుపాయం అవసరమైన పరిస్థితుల్లో సమయాభావం వల్ల ప్రాణాలు సైతం కోల్పోయే అవకాశం ఉంది. కావున ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం, నాయకులు దీనిపై దృష్టి సారించి త్వరితగతిన రోడ్డు పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రామగుండంలో రైలు డీకొని మహిళ మృతి

- **రైలు వంతెన లేక గాలిలో కలిసిన మహిళ ప్రాణాలు**

**రామగుండం, జనంసాక్షి :** అంతర్గాం మండలంలోని కుందనపల్లి గ్రామం రామగుండం రైల్వే స్టేషన్ కు కూత వేటు దూరంలో ఉంటుంది. ఈ మార్గం గుండా నిత్యం ఐదు నిమిషాలకు ఒక రైలు వెళుతూ ఉంటాయి. కుందన పల్లి రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తు లు దశాబ్దాల కాలంగా పోరాడుతున్నారు. ఆదివారం రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతున్న ఆదే గ్రామానికి చెందిన సిరిశెట్టి లక్ష్మి (62) అనే మహిళ రైలు డీకొని మృతి చెందింది. రైల్వే వంతెన నిర్మించి ఉంటే ప్రాణాలు పోయేవి కావని గ్రామ స్తులు ఆవేదన వ్యక్తం చేసారు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మి ఐఓసి ఇందిరమ్మ కాలనీ నుండి. కుందన పల్లిలోని తన కూతుర్ల ఇంటికి వెళు తున్న క్రమంలో. గ్రామ సమీపం లోని రైల్వే గేటు దాటుతుండగా. చెన్నై నుండి న్యూ ఢిల్లీ వెళుతున్న తమిళనాడు ఎక్స్ ప్రెస్ డీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు కాగా. ఇద్దరు కూతుర్లు కుందనపల్లిలో నివాసముంటారు. మృతురాలి పెద్ద కూతురు పొన్నం పద్మ పీర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నామని అయన తెలిపారు



# కోడెలను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవు





- **కోడెలను వ్యవసాయ అవసరాలకు వాడాలి**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 27 (జనంసాక్షి) :**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాల నుండి రైతులు తీసుకున్న కోడల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅన్నారు.తిప్పాపూర్ లోనీ గోశాలలోని 85 జతల కోడెలను అర్హులైన రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ గోశాల నుండి పంపిణీ చేసిన కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. రైతులు వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కోడెల స్థితిగతులపై ఆరా తీస్తారన్నారు. కోడెలను పొందిన రైతులు వాటి సంరక్షణ బాధ్యతను పక్కాగా చూడాలని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాల న్నారు. వన మహెూత్సవంలో భాగంగా గోశాల ఆవరణలోని రోడ్డు వెంట కొబ్బరి మొక్కలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఆలయ ఈవో, అధికా రులతో కలిసి నాటారు.ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ ఇంచార్జి ఈఓ రాధాభాయి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం,ఆలయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# "కరీంనగర్ కార్పొరేషన్‌పై ఎంఐఎం జెండా" ఎగురవేస్తాం





- **స్థానిక సంస్థలు.. మున్సిపల్.. ఎన్నికలకు ఎంఐఎం సిద్ధం**
- **34వ డివిజన్లో అట్టహాసంగా పార్టీ కార్యాలయం ప్రారంభం**
- **150 మంది యువకులు, సీనియర్ సిటీజన్లు ఎంఐఎంలో చేరిక**
- **ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇంచార్జిగా గులాం అహ్మద్ హుస్సేన్**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జూలై 27 (జనంసాక్షి) :**
రాబోయే స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీని కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేశామని, ముఖ్యంగా కరీంనగర్ నగర పాలక సంస్థపై ఆకుపచ్చ జెండా ఎగురవేస్తామని, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు నగరంలోని బొమ్మకల్, సలఫీ నగర్ ప్రాంతంలో 34వ డివిజన్ పార్టీ కార్యాలయాన్ని గులాం అహ్మద్ ప్రారం భించారు. 34వ డివిజన్ ఇంచార్జి ఖాజా మజహరొద్దీన్ ఆధ్వర్యంలో ఎంఐఎంలో చేరికల కార్యక్రమానికి హాజరై 150 మంది యువకులు, డివిజన్ పెద్దలు స్వచ్ఛందంగా ఎంఐఎం పార్టీలో చేరారు. చేరిన యువకులకు, పెద్దలకు ఎంఐఎం కండువ వేసి గులాం అహ్మద్ సాధారంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం, ఏరాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా, ఎక్కువ స్థానాల్లో పోటీ చేయబోతుందని ప్రకటించారు. కరీంనగర్ లో 25డివిజన్లలో గెలిచి తాము సత్తా చాటుతామన్నారు. గడచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు, ఓటములను నిర్ణయించే శక్తిగా ఎదిగిన ఎంఐఎం పార్టీ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీని మరింత బలోపేతం చేయడ మే లక్ష్యంగా, 15 కార్పొరేటర్లు గెలిపిస్తే, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిని ఎంఐఎం నుంచి బరిలో ఉంచుతామని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ చెప్పిన మాటను గుర్తు చేశారు. ఎంఐఎంలో చేరిన వారు టికెట్ ఆశించి రావద్దని పార్టీని బలోపేతం చేయడంతో పాటు, పేద ప్రజల సేవే లక్ష్యంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కృషి చేయాలని, పార్టీలో చేరినటువంటి నాయకులకు హితబోధ చేశారు. రామగుండం, పెద్దపల్లి, గోదావరి ఖని, సిరిసిల్ల, హుజురాబాద్, కరీంనగర్ మున్సిపల్ కౌన్సిల్ల పరిధిలో తమ అధినేత ఆదేశాల మేరకు విస్తృతంగా ఎంఐఎంలో చేరికలు ఉంటాయన్నారు. ఎంఐఎం ముస్లింల పార్టీ కాదని, దళిత, అణగారిన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడే పార్టీ అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని సామాజిక న్యాయమే లక్ష్యంగా రాబోయే ఎన్నికల్లో ప్రజల్లోకి వెళతామన్నారు.

పార్లమెంట్ వేదికగా బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ దళిత, పీడితుల పక్షాన పోరాడే నాయకుడన్నారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ కు, తాజా మాజీ కార్పొరేటర్లకు, నగర కమిటీ నాయకులకు 34డివిజన్ ఇంచార్జి మజహరొద్దీన్ ఆత్మీయంగా సన్మానించా రు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నాయకులు బర్కత్ అలీ, హాఫీజ్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఆతిన, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అజర్ దబీర్, కాజమ్ ఖాన్, అన్నేమల్ల సురేశ్, శేఖర్, అసదుల్లా బేగ్, అప్సర్, ఖాదర్, నవాజ్, ఏజ్దాని, షేరా, వలి, షాకిర్ నద్వి, అమిన్, షాదాబ్, రజాక్, సుల్తాన్ మీర్జా అబ్దుల్లా ఖాన్, అల్మాస్ తదితరులు పాల్గొన్నారు.

## నయా థౌజండ్‌వాలా..

### టెస్టు క్రికెట్ చరిత్రలో మూడో ఆటగాడిగా జడ్డూ

మాంచెస్టర్ టెస్టులో రవీంద్ర జడేజా బ్యాటుతో చెలరేగి, ఇంగ్లండ్‌పై 1000 పరుగులు పూర్తి చేసుకున్నాడు, దీంతో కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లతో పాటు థౌజండ్ క్లబ్‌లో చేరాడు. 148 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో విదేశీ గడ్డపై 1000 పరుగులు, 30కి పైగా వికెట్లు తీసిన మూడో ఆల్‌రౌండర్‌గా జడేజా రికార్డు సృష్టించాడు. అతడి కంటే ముందు విల్‌ఫ్రెడ్ రోడ్స్ (ఇంగ్లండ్), గ్యారీ సోబర్స్ (వెస్టిండీస్) మాత్రమే ఈ ఘనత సాధించారు. రోడ్స్ ఆస్ట్రేలియాపై, సోబర్స్ ఇంగ్లండ్‌పై ఈ ఫీట్ నమోదు చేశారు. ఇంగ్లండ్‌పై జడేజా తన ఆధిపత్యం చెలాయిస్తూ, బెన్ స్టోక్స్ ఓవర్లో బౌండరీతో ఈ సిరీస్‌లో ఐదో అర్ధ శతకం సాధించాడు. 1966లో సోబర్స్ కూడా ఇంగ్లండ్‌పై ఇన్ని ఫిఫ్టీలు బాదాడు. భారత ఆటగాళ్లలో జడేజా కంటే ముందు వీవీఎస్ లక్ష్మణ్ 2002లో వెస్టిండీస్‌పై ఐదు హాఫ్ సెంచరీలు సాధించాడు. బెన్ స్టోక్స్ శతకంతో పాటు ఐదు వికెట్లు తీసి 'ఉత్తమ ఆల్‌రౌండర్'గా ప్రశంసలు అందుకుంటున్నా, జడేజా తన రికార్డులతో 'నేనూ అత్యుత్తమ ఆల్‌రౌండర్‌నే' అంటూ మరో మైలురాయిని అధిగమించాడు.

# పోరాడుతున్న గిల్‌సేన

- కెప్టెన్‌గా ఒకే సిరీస్‌లో అత్యధిక స్కోర్..
- అరంగేట్రంలోనే 10 వికెట్లు అన్షుల్
- విమర్శకులపై కపిల్ ఆగ్రహం
- జడేజా-సుందర్ జోడీ భారత్‌ను డ్రా వైపు నడిపిస్తోంది
- భారత్ 75 పరుగుల ఆధిక్యంతో 386/4 స్కోరు
- ఇంగ్లండ్ బౌలర్లకు అవకాశం ఇవ్వని భారత బ్యాటర్లు

## శతకంతో కదం తొక్కిన సారథి



మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచ్‌లో భారత్ తన స్థితిని మరింత బలోపేతం చేసుకుంది. 137 ఓవర్లు ముగిసే సమయానికి భారత్ 386/4 స్కోరుతో 75 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. రవీంద్ర జడేజా 89 పరుగులతో, 134వ ఓవర్‌లో రెండు బౌండరీలు బాదగా, వాషింగ్టన్ సుందర్ 80 పరుగులతో, 137వ ఓవర్‌లో అద్భుతమైన కవర్ డ్రైవ్‌తో ఒక ఫోర్ సాధించాడు. గత మూడు ఓవర్లలో భారత్ 12 పరుగులు జోడించింది, నిలకడగా ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లకు అవకాశం ఇవ్వలేదు. ఇంతకుముందు, 131 ఓవర్ల వద్ద భారత్ 361/4తో 50 పరుగుల ఆధిక్యంలో ఉంది, జడేజా (77) మరియు సుందర్ (71) జట్టును డ్రా వైపు నడిపిస్తూ ఇంగ్లండ్ బౌలర్లను నిరాశపరిచారు. ఈ దశలో గత మూడు ఓవర్లలో ఐదు పరుగులు వచ్చాయి. 128 ఓవర్ల వద్ద లియామ్ డాసన్ వేసిన ఓవర్‌లో జడేజా ఒక బౌండరీతో సహా ఎనిమిది పరుగులు రాబట్టాడు, స్కోరు 356/4కి చేరింది, అప్పుడు భారత్ ఆధిక్యం 45 పరుగులు. జడేజా-సుందర్ జోడీ 100 పరుగుల భాగస్వామ్యంతో జట్టును డ్రా వైపు నడిపిస్తూ, ఇంగ్లండ్‌కు విజయావకాశాలను తగ్గించింది, మ్యాచ్‌లో కొన్ని ఓవర్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.


ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్ గాయపడటంతో అనూహ్యంగా అన్షుల్ కాంబోజ్ జట్టులోకి వచ్చాడు. 18 ఓవర్లలో 89 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీసిన కాంబోజ్ ప్రదర్శనపై కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ సెలక్షన్ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే, టీమ్ ఇండియా దిగ్గజం కపిల్ దేవ్ ఈ విమర్శలకు కౌంటర్ ఇస్తూ కాంబోజ్‌కు మద్దతు ప్రకటించాడు. అరంగేట్ర క్రికెటర్ నుంచి భారీ అంచనాలు పెట్టుకోవద్దని విమర్శకులకు సూచించాడు. తొలి మ్యాచ్‌లో 10 వికెట్లు తీస్తాడని ఆశించడం సరికాదని, కాంబోజ్‌లో మంచి నైపుణ్యం ఉందని, తప్పకుండా మెరుగవుతాడని కపిల్ వెల్లడించాడు. తొలి మ్యాచ్‌లో ఎవరైనా కొంత ఇబ్బంది పడతారని, ఫలితాలు అనుకూలంగా రాకపోవచ్చని, కానీ కాంబోజ్ సత్తా చాటుతాడని అన్నాడు. గిల్ కెప్టెన్‌గా ఇంకాస్త సమయం అవసరమని, అతడు ఇటీవలే బాధ్యతలు చేపట్టాడని గుర్తు చేశాడు. జస్ప్రీత్ బుమ్రా గురించి మాట్లాడుతూ, అతడి బౌలింగ్ యాక్షన్ ప్రత్యేకమని, నిలకడగా బంతులేయడం కష్టమని, అయినా ఇన్నేళ్లు అద్భుతంగా రాణిస్తున్నాడని ప్రశంసించాడు. బుమ్రా ప్రస్తుత ఫాస్ట్ బౌలర్లలో టాప్ స్థానంలో ఉన్నాడని, అతడి ప్రదర్శనకు హ్యాట్సాఫ్ చెప్పాలని కపిల్ వ్యాఖ్యానించాడు.

### సారథిగా 700 రన్స్

#### శతకంతో కదం తొక్కిన గిల్

మాంచెస్టర్ టెస్టులో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ శతకంతో రాణించి, తొలి సిరీస్‌లోనే పరు గుల వరద పారించాడు. నాలుగో రోజు నుంచి ఓపికగా క్రీజులో నిలిచి, ఐదో రోజు తొలి సెషన్‌లో క్రిస్ వోక్స్ ఓవర్‌లో డబుల్స్, సింగిల్‌తో సెంచరీ అందుకున్నాడు. ఈ సిరీస్‌లో నాలుగోసారి మూడంకెల స్కోర్ సాధించిన గిల్, కేఎల్ రాహుల్ ఔట్ అయిన తర్వాత వాషింగ్టన్ సుందర్‌తో కీలక భాగస్వామ్యం నెలకొల్పి, జట్టు స్కోర్‌ను 200 దాటించాడు. జట్టు ఇంకా 101 రన్స్ వెనుకబడి ఉంది. ఒకే సిరీస్‌లో నాలుగు సెంచరీలతో విరాట్ కోహ్లి, సునీల్ గవాస్కర్ రికార్డులను సమం చేశాడు. కెప్టెన్‌గా బ్రాడ్‌మ న్, గవాస్కర్‌ల తర్వాత ఈ ఘనత సాధించిన గిల్, భారత ఆటగాళ్లలో గవాస్కర్, కోహ్లి, యశస్వీ జైస్వాల్ తర్వాత ఈ క్లబ్‌లో చేరాడు. బర్మింగ్‌హామ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీల తో సంచలనం సృష్టించిన గిల్, మాంచెస్టర్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 700 రన్స్‌తో చరిత్ర సృష్టించాడు. ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక రన్స్ చేసిన తొలి భారత కెప్టెన్‌గా, ఆటగాడిగా నాలు గో ఇండియన్‌గా రికార్డు నెలకొల్పాడు. పీకల్లో తు కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకుంటూ, గవాస్కర్ రికార్డును బద్దలు కొట్టి, బ్రాడ్‌మన్, సోబర్స్, ఛాపెల్, గోవర్, గూచ్, స్మిత్‌ల సరసన నిలిచాడు.

## పాకిస్థాన్‌తో ఆడే ప్రసక్తే లేదు!



ఈ ఏడాది ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్‌లు తలపడనున్నాయనే వార్తల నడుమ మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ తన వైఖరిని స్పష్టం చేశాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడే ప్రసక్తి లేదని, వరల్డ్ ఛాంపియన్స్ లీగ్ ఆఫ్ లెజెండ్స్ సెమీ ఫైనల్ అయినా సరే బాయ్‌కాట్ చేస్తానని గబ్బర్ తేల్చిచెప్పాడు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలతో భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలపై అనిశ్చితి నెలకొంది. ఐసీసీ టోర్నీల్లో మాత్రమే ఆడేందుకు ఇరు బోర్డులు అంగీకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఆటగాళ్లు పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు నిరాకరిస్తున్నారు. జూలై 20న WCLLలో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసిన విషయం తెలిసిందే. ఇకపై కూడా అదే వైఖరి కొనసాగుతుందని ధావన్ వెల్లడించాడు. సెమీస్‌లో భారత్, పాకిస్థాన్ ఢీకొంటే ఏం చేస్తారని మీడియా ప్రశ్నించగా, తన నిర్ణయం మారదని ధావన్ స్పష్టం చేశాడు. పదే పదే తనను ప్రశ్నించడం వృథా అని, గతంలో లీగ్ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసినట్లే ఇప్పుడూ అదే జరుగుతుందని కుండబద్దలు కొట్టాడు. యువరాజ్ సింగ్, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్‌లు కూడా లీగ్ దశలో పాకిస్థాన్‌తో ఆడబోమని ఐసీసీకి తెలిపారు. ప్రస్తుతం WCLLలో భారత్ రెండు ఓటములతో అట్టడుగున ఉంది. సెమీస్‌కు చేరాలంటే ఇంగ్లండ్, వెస్టిండీస్‌పై మిగిలిన రెండు మ్యాచ్‌లలో గెలవాలి. టాప్‌లో ఉన్న పాకిస్థాన్ సెమీ ఫైనల్‌కు చేరడం దాదాపు ఖాయం. ఒకవేళ భారత్ చివరి రెండు మ్యాచ్‌లలో విజయం సాధిస్తే, సెమీస్‌లో దాయాదుల మధ్య పోరు జరిగే అవకాశం ఉంది.

## తప్పని ఓటమి



ఒకప్పుడు హిట్టర్లు, ఆల్‌రౌండర్లతో భయంకరంగా ఉన్న వెస్టిండీస్ జట్టు, రెండుసార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచినా, ఇప్పుడు ఒక్క విజయం కోసం తీవ్రంగా ఆరాటపడుతోంది. సిరీస్ కోల్పోయినా, కనీసం ఒక్క మ్యాచ్ గెలిచి పరువు కాపాడుకోవాలన్న పరిస్థితిలో ఉంది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడు టీ20ల్లో మట్టికరిచిన షాయ్ హోప్ సేన, నాలుగో మ్యాచ్‌లోనూ చిత్తయింది. సొంత గడ్డపై ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన వెస్టిండీస్, ఇప్పుడు ఆస్ట్రేలియా చేతిలోనూ అవమానానికి దగ్గరవుతోంది. టిమ్ డేవిడ్ విధ్వంసక సెంచరీతో మూడో టీ20లో గెలిచిన ఆస్ట్రేలియా, నాలుగో మ్యాచ్‌లో కూడా కరిబియన్ జట్టును చిత్తు చేసింది. సెయింట్ కిట్స్‌లో జరిగిన మ్యాచ్‌లో రొవ్‌మన్ పావెల్ (28), రొమారియో షెపర్డ్ (28) సహకారంతో వెస్టిండీస్ 205 రన్స్ చేసింది. అయినా గెలవాలన్న హోప్ జట్టు ఆశలు గల్లంతయ్యాయి. భారీ లక్ష్య ఛేదనలో కామెరూన్ గ్రీన్ (55 నాటౌట్), జోష్ ఇంగ్లిస్ (51) చెలరేగగా, ఇంగ్లిస్ ఔట్ అయిన తర్వాత అరోన్ హర్డీ (23) ధనాధన్ ఆడి, 19.2 ఓవర్లలో ఆస్ట్రేలియా ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య చివరి టీ20 జూలై 28న జరగనుంది.



## ఐపీఎల్ స్టార్‌ను వరించిన కెప్టెన్సీ

గత ఏడాదిగా నిలకడగా రాణిస్తున్న తిలక్ వర్మకు సౌత్ జోన్ జట్టు కెప్టెన్‌గా నియమితులైన గౌరవం దక్కింది. ఇంగ్లండ్ కౌంటీల్లో ఇరగదీసిన ఈ ఐపీఎల్ స్టార్, ఒత్తిడిలో కీలక ఇన్నింగ్స్‌లు ఆడగల నైపుణ్యంతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఆగస్టు 28 నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీలో తిలక్ సౌత్ జోన్ జట్టును నడిపించనున్నాడు. నాలుగు రోజుల మ్యాచ్‌ల ఈ టోర్నీలో ఆరు జట్లు పోటీపడనుండగా, సౌత్ జోన్, వెస్ట్ జోన్ నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. నార్త్ జోన్, ఈస్ట్ జోన్, సెంట్రల్, నార్త్ ఈస్ట్ జట్లు మిగిలిన రెండు స్థానాల కోసం క్వార్టర్ ఫైనల్లో తలపడనున్నాయి. సౌత్ జోన్ జట్టులో తిలక్ వర్మ (కెప్టెన్), మహ్మద్ అజారుద్దీన్ (వైస్ కెప్టెన్), తన్మయ్ అగర్వాల్, దేవ్‌దత్ పడిక్కల్, మోహిత్ కాలే, సల్మాన్ నిజర్, నారాయణ్ జగదీశన్, టీ.విజయ్, సాయి కిశోర్, తన్మయ్ త్యాగరాజన్, వైషాక్ విజయ్‌కుమార్, ఎండీ నిదీశ్, రికీ భుయీ, బసిల్ ఎన్పీ, గుర్జన్‌పీత్ సింగ్, స్నేహల్ కౌథంకర్ ఉన్నారు. ముంబై ఇండియన్స్‌కు ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న తిలక్, హ్యాంప్‌షైర్ తరఫున ఇంగ్లండ్ కౌంటీల్లో నాలుగు ఇన్నింగ్స్‌లలో రెండు శతకాలు, ఒక హాఫ్ సెంచరీ, 47 రన్స్‌తో మెరిశాడు. ఈ ఏడాది టీ20ల్లో హ్యాట్రిక్ సెంచరీలతో రికార్డు సృష్టించిన ఈ యువ క్రికెటర్, దులీప్ ట్రోఫీలో తన సారథ్యంతో జట్టును విజయపథంలో నడిపించేందుకు సిద్ధమవుతున్నాడు.

## హోప్ ఆఫ్ హాంగర్ ఆధ్వర్యంలో ఉచిత ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రారంభం





- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ చేతుల మీదుగా ప్రారంభం

**కూకట్ పల్లి, జూలై 27(జనంసాక్షి):** ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో హోప్ ఆఫ్ హాంగర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఇంగ్లీష్ మీడియం పాఠశాలను పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆయనతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల పిల్లలకు నాణ్యమైన ఇంగ్లీష్ విద్యను ఉచితంగా అందించడమే లక్ష్యంగా హోప్ ఆఫ్ హాంగర్ ఈ పాఠశాలని ప్రారంభించడం అభినందనీయం. మొదటి తరగతి నుండి ఐదవ తరగతి వరకు ఉచితంగా ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన కలగడం చాలా గొప్ప విషయం" అని తెలిపారు. పాఠశాల స్థాపనకు కృషి చేసిన హోప్ ఆఫ్ హాంగర్ వ్యవస్థాపకురాలు ఆలేఖ్య కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "ఈ పాఠశాల ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు మేలు కలుగుతుందని, వారికి మానవ సేవల రూపంలో ఇది ఒక వరం" అని పేర్కొన్నారు. గాంధీ మరోసారి హామీ ఇచ్చారు – "పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. రాబోయే రోజుల్లో ఉన్నత విద్యను సాధించి పిల్లలు మంచి భవిష్యత్తు తయారుచేసుకోవాలని ఆశిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ ఆఫ్ హాంగర్ సభ్యులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, మిరయ్య, నాయకులు ప్రసాద్, మారేళ్ల శ్రీనివాస్, శివరాజు గౌడ్, పోతుల రాజేందర్, అనిల్, చంద్రమోహన్ సాగర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టు 3న కరీంనగర్ జిల్లా సహకార

## అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం

### కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 27 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా సహకార అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం ఆదివారం రోజు జరుగ నుండగా అధికారులుతో గత 2007– 2017 మధ్య ఉన్న కమిటీ సభ్యులు కోరంలేదని వాయిదా వేయమని కోరిన మేరకు సమావేశం ను వాయిదా వేశానని గడ్డం విలాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి మాట్లాడుతూ... ఆదివారం రోజు వాయిదా వేసి సమావేశం 2025 ఆగస్టు 3న నిర్వహించుటకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. 2007 నుండి 2017 వరకు దాదాపు 20 సర్వసభ్య సమావేశాలు జరిగినవి ఏ సమావేశంలో కూడా 50 నుండి 100 మంది మించలేదని అప్పుడు అధికారులు కానీ పాలకవర్గ సభ్యులు గాని అనేక తీర్మానాలు చేసినారు. దాదాపు 18000 సభ్యులు ఉంటే 100 మంది కూడా తీర్మానం లో సంతకాలు పెట్టని సమావేశాల్లో మీరు ఎలా సమావేశం నిర్వహించారు. దీనిపైన డిసీఓ కి త్వరలోనే కంప్లైంట చేస్తానని తెలిపారు. బ్యాంకు బయల ప్రకారం 1965 కోపరేటివ్ ఆక్టివ్ ప్రకారం ఎవరైతే బ్యాంకులో ఖాతాదారుడైతేనే అతనికే సభ్యత్వం ఇవ్వాల్సి ఉంటుంది కానీ అప్పటి పాలకవర్గం అడ్డగోలుగా సభ్యత ఇవ్వడం జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సభ్యత్వం ఇచ్చి దానిని సమర్థించుకోవడానికి 2009లో బైలాను మార్చారు. ఈ సమావేశం వాయిదా వేయడానికి కేవలం గత పాలవర్గ సభ్యుల ఒత్తిడితో జిల్లా సహకార అధికారులు వాయిదా వేయించారు. ఈ కమిటీ 2007 నుండి 2017 వరకు ఉన్న కమిటీ అనేక అవుకుతవుకలకు పాల్పడిన విషయం బయట పడుతోందని సమావేశం వాయిదా వేసేలాగా చేశారని గడ్డం విలాస్ రెడ్డి తెలిపారు.

# అందరి బ్యాంకుగా నిలిచిన భద్రాద్రి బ్యాంక్

- 28వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వక్తలు
- ముఖ్య అతిథిగా తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర రావు
- నిరంతర సేవలపై సర్వత్రా సంతృప్తి.. అభినందనలు





**ఖమ్మం (జనంసాక్షి) :** భద్రాద్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 28వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఖమ్మం, డాబాల బజార్ వాసవీ కళ్యాణ మండపంలో కన్నుల పండువలా జరిగింది. ఈ మహాజన సభకు బ్యాంకు వాటాదారులు హాజరుకాగా బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర రావు విచ్చేశారు. విశిష్ట అతిథిగా జాయింట్ రిజిస్ట్రార్ జిల్లా సహకారశాఖ అధికారి గట్టు గంగాధర్ పాల్గొనగా.. బ్యాంక్ వైస్ చైర్మన్లు సన్నె ఉదయ్ ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వర రావు రిసెప్షన్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. సభకు అధ్యక్షత వహించిన బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ వార్షిక నివేదికను, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన బడ్జెట్‌ను సభ్యుల ముందు ప్రవేశపెట్టి ఆమోదం పొందారు.

గత 28 సంవత్సరాలుగా బ్యాంక్ ఎలా అభివృద్ధి పథంలో నడుస్తుందో సభ్యులకు వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ముగిసిన మార్చ్ 31 నాటికి డిపాజిట్లు రు.598.96 కోట్ల రుణాలు రు.365.99 కోట్లుగానూ బ్యాంక్ నికర లాభం రు.880.31 లక్షలుగానూ ఉన్నవని తెలిపారు. బ్యాంక్ ప్రారంభం నుండీ రుణ వితరణయే కాకుండా ఇచ్చిన రుణాలను వసూలు చేసుకోవడంలోనూ ముందున్నదనీ, బ్యాక్ నిరర్థక ఆస్థుల శాతం ఎప్పుడూ నిల్ గానే ఉండి మంచి ప్రగతిని సాధిస్తున్నదనీ తెలిపారు. బ్యాంకు ఈ సంవత్సరంలో 4 క్రొత్త శాఖలు, ఏప్రిల్ లొ రెండు శాఖలు ప్రారంభించి ఇప్పటికి 23 శాఖలుగా విస్తరించినదనీ, రాబోవు రోజులలో మరిన్ని శాఖలను ప్రారంభిస్తామనీ తెలిపారు. త్వరలోనే మల్టీ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంక్ గా అనుమతులు పొంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో కూడా బ్రాంచ్ లు ప్రారంభిస్తామనీ ఆయన తెలియజేశారు. మొత్తం 23537 మంది సభ్యులతో ముమ్ముందుకు పోతున్నదని తెలియజెసారు. ముఖ్య అతిథిగా తెలంగాణా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర రావు మాట్లాడుతూ.. భద్రాద్రి బ్యాంక్ క్రమశిక్షణతో అంచలంచలుగా ఎదుగుతూ రాష్టంలోని అర్బన్ బ్యాంకులలో ఒక అగ్రగామి బ్యాంకుగా ఎదిగిందనీ అన్నారు. బ్యాంక్ చైర్మన్, ఇతర పాలకవర్గ సభ్యులు సక్రమమైన చర్యలను సకాలంలో తీసుకుంటూ వాటిని సిబ్బంది సక్రమంగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతోనే భద్రాద్రి బ్యాంక్ విజయ పరంపర కొనసాగుతున్నదని ఆయన అబినందించారు.

విశిష్ట అతిధి జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకారశాఖ అధికారి జిల్లా సహకార శాఖాధికారి గట్టు గంగాధర్ మాట్లాడుతూ.. భద్రాద్రి బ్యాంక్ ఖమ్మం జిల్లాకే తలమాణికంగా నిలచిందనీ ,1997 అక్టోబర్ 4న ప్రారంభమైన బ్యాంక్ అంచలంచలుగా ఎదుగుతూ ఇప్పటికి 23 శాఖలుగా విస్తరించడం అభినందనీయమనీ కొనియాడారు. ముమ్ముందు ఈ బ్యాంక్ ఎంతోమందికి ఆర్థికంగా ఉపయోగపడాలనీ ఆకాంక్షించా రు. బ్యాంక్ వైస్ చైర్మన్ ఆహ్వాన సంఘం సభ్యులు సన్నె ఉదయ్ ప్రతాప్ మాట్లాడుతూ.. భద్రాద్రి బ్యాంక్ మనందరి బ్యాంకుగా జనం భావించుకుంటున్నారనీ, అనతి కాలంలోనే ఇది అందరి బ్యాంకుగా గుర్తింపు పొందినదనీ, బ్యాంకును అభివృద్ధిపథంలో నడపడంలో పాలకవర్గం, బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్, ఉద్యోగుల సహకారం, కృషి ఎంతో ఉందనీ తెలియజేశారు. బ్యాంక్ మరొక వైస్ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ బ్యాంకు ప్రజల ఆర్థిక అవసరాలకే కాకుండా సామాజిక బాధ్యతగా సమాజంలోని అనేకమంది పీడితులకు అండగా నిలుస్తూ ఇతోధిక సేవలను అందిస్తున్నదనీ, వరద బాధితులకు, మున్నేరు ముంపు బాధితులకు ఇలా అనేకమంది బాధితులకు అందగా నిలుస్తూ ముందుకు సాగుతున్నామనీ తెలియజేశారు.

బ్యాంక్ ముఖ్య కార్య నిర్వాహణా ధిదాసరి వేణుగోపాల్ బ్యాంక్ అభివృద్ధినీ, రాబోయే కాలంలో తీసుకొనబోయే చర్యలనూ సభ్యులకు సవివరంగా తెలిపారు. విచ్చేసి న వాటాదారుల సందేహాలకు వివరంగా సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు దేవత రాజారావు, బులుసు సాంబమూర్తి, శృద్ధి పిచ్చయ్య, పురోహిత్ చెన్ సింగ్, వై.వి.యస్. రావు, రంగా నాగ శ్రీనివాస రావు, దారా జీవన్ రాం, కర్లపూడి నర్మద, శ్రీమతి కపిలవాయి జయప్రద, బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ సభ్యులు సి.జి.శాస్త్రి, పైడిమర్రి సత్యనారాయణ, ప్రొఫెసర్ పసుమర్తి మధుసూధన రావు, బ్యాంక్ అన్ని శాఖల మేనేజర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎల్.వి.ఎస్. ప్రసాద్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## దేశఅభివృద్ధి ప్రధాని మోదీ లక్ష్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షులు భూపాల్ గౌడ్
- హిమాయత్ నగర్ బీజేపీ కార్యాలయంలో మన్ కీ బాత్‌లో పాల్గొన్న నాయకులు



**మొయినాబాద్, (జనంసాక్షి) :** భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతుందని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు భూపాల్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరాంనగర్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె. ఎస్. రత్నంలు అన్నారు. ఆదివారం నరేంద్రమోదీ మన్కిబాత్ లో భాగంగా మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో గల బీజేపీ పార్టీ కార్యాలయంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు భూపాల్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరాంనగర్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నంలు నాయకులతో కలిసి మన్కిబాత్ తిలకించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వాసనీయ నేత భారత ప్రధాని నరేంద్రమోదీ అని అన్నారు. ప్రజాధారణ కలిగిన వ్యక్తి ఆయనకు మరెవరు సాటిలేరని సూచించారు. అమెరికాకు చెందిన ఇంటలిజెన్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో మోదీకి ఏకంగా ప్రపంచంలోనే 75 శాతం అప్రూవ్ రెటింగ్ రావడం ఎంతో గొప్పదన్నారు. ప్రజాస్వామ్య ప్రపంచ సేతగా నరేంద్రమోదీని ఆమోదించారని గుర్తు చేశారు. ప్రపంచంలోనే నరేంద్రమోదీ అగ్రస్థానంలో నిలిచారని పేర్కొన్నారు. మన్ కీబాత్ లో మోదీ సూచించిన అంశాలను తెలుపుతూ మన సంస్కృతి మనం కాపాడుకోవాలి వాటిలో చాలా విజ్ఞానం దాగి ఉందని సూచించారన్నారు. అంతరక్షంలోకి వెళ్లిన సుభాన్ శుక్ల సురక్షితంగా తిరిగి వచ్చిన తరువాత ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం పెరిగిందని పేర్కొన్నారన్నారు. మనందరం మన దేశం స్పేస్ టెక్నాలజీలో ముందడుగు వేసేలా కృషి చేయడం జరిగిందని తెలిపారన్నారు. వెస్ట్ మెనేజ్మెంట్ మనం అలవాటు చేసుకొవాలి వెస్టేజ్ను రీసైక్లింగ్ చేసి వాటితో అద్భుతాలు చేయాలని అదే విధంగా వాటర్ మేనేజ్మెంట్ చేసి తిరిగి వాడుకోవాలని తెలపడం జరిగిందన్నారు. కుటీర పరిశ్రమలు స్థాపించి సమాజానికి ఉపయోగపడేలా గుర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు ఎలుగని వెంకటేష్ గౌడ్, మోర నర్సింహ్మరెడ్డి, బంటు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డి కథలు ఎక్కువయ్యాయి

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడితే చెంచాకు పట్టిన గతే**

**ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** కౌశిక్‌రెడ్డి కథలు ఎక్కువయ్యాయని, తగ్గించుకోకపోతే ఇరిచేస్తానని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డికి అనవసర మాటలు మాట్లాడితే ఇదే చివరి వార్నింగ్ అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. బిఆర్‌ఎస్ పార్టీలో ఎన్నో చెంచాలున్నాయని, అందులో కౌశిక్ రెడ్డి చెంచా జర చప్పుడు ఎక్కువ చేస్తోందని తెలిపారు. గతంలో పిసిసి అధ్యక్షులుగా ఉన్నపుడు సీఎం రేవంత్ రెడ్డి..కౌశిక్ చెంచా ఎందుకు పనికిరాదని పట్టించుకోలేదని, సారు కారు పదహారు అని...సారు కారు పరారయ్యారు కదా దాని గురుంచి కౌశిక్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ గురించి నోటికొచ్చింది మాట్లాడితే చెంచాకి పట్టిన గతే కౌశిక్‌రెడ్డికి పడుతుందని తెలిపారు. పక్క రాష్ట్రం నుంచి కిరాయి రౌడీలను తెచ్చుకున్న వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఇది స్వీట్ వార్నింగ్ కాదని, డెడ్లి వార్నింగ్ అని హెచ్చరించారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం

- కావాలనే కాంగ్రెస్ దుష్ప్రచారం చేసింది
- పిల్లర్లు కుంగిన ఘటనలో వారి కుట్ర ఉండొచ్చు
- రాష్ట్రంలోని హాస్టళ్లలో పిల్లల సంక్షేమం కొరవడింది
- బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు సౌకర్యాలు దగ్గర చేశాం
- ఇకనుండి సమన్వయంతో ముందుకెళ్దాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగుర వేద్దాం
- మాజీమంత్రి కేటీ రామారావు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/చిట్యాల(మొగుళ్లపల్లి), (జనంసాక్షి):** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు అని బీఆర్‌ఎస్ నేత మాజీమంత్రి కేటీ రామారావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వివిధ కార్యక్రమాలకు హాజరైన మాజీ మంత్రి కేటీఆర్ జిల్లా కేంద్రంలోని పార్టీ ఆఫీసులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన ఆదివారం జరిగిన ఈ సమావేశంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసిందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 100 ఏళ్ల ముందు చూపుతో మండుటెండల్లో కూడా నీటి నిల్వ ఉండే ప్రాంతమైన కాళేశ్వరం లో అతిపెద్ద ప్రాజెక్టులు నిర్మించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టుల కారణంగా 21 పంపు హౌస్ ల ద్వారా 15 రిజర్వాయర్ల కు నీటిని తరలించే సామర్థ్యం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీర్చడమే గాక హైదరాబాద్ ప్రజల నీటి కష్టాలు తీర్చేందుకు నిర్మించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో అనేక ప్రశంసలు అందుకోవడం జరిగిందని ఈ పరిస్థితుల్లో ఎన్నికల ముందు మేడిగడ్డ ప్రాజెక్టు లోని కేవలం రెండు పిల్లర్లు కుంగినంత మాత్రాన సుమారు 80 వేల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి అంటూ అవివేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల ముందు జరిగిన ఈ పిల్లర్ల కుంగుబాటు వెనుక ఆ పార్టీ హస్తం కూడా ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లలో సంక్షేమం కొరబడిందని అన్నారు. అనేక హాస్టళ్లల్లో ఫుడ్ పాయిజన్ జరిగి పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలియజేశారు. ఇటీవలే అందాల భామల పోటీలు నిర్వహించిన సమయంలో ఒక్కో ప్లేటు భోజనం లక్షల రూపాయలు ఖర్చుపెట్టి, వేములవాడ పుణ్యక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఒక్కో ప్లేట్ భోజనానికి లక్ష 15 వేల రూపాయల ఖర్చులు రాసిన కాంగ్రెస్ పెద్దలు హాస్టళ్లలో నివసించే పిల్లలకు కేవలం 150 రూపాయలతో మంచి భోజనం అందించేందుకు ఖర్చు చేయలేరా అంటూ అధికార పార్టీని ఉద్దేశించి విమర్శించారు. ఇకనుండి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు హాస్టళ్లను తనిఖీలు చేసి సమస్యలను వెలికి తీయాలని, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కెసిఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని ప్రజలకు అనేక సౌకర్యాలను దగ్గర చేయడం జరిగిందని గుర్తు చేశారు. చిన్న పల్లెలు గ్రామపంచాయతీలుగా, కొత్త మండలాలను, జిల్లా కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. చిన్న గ్రామంగా ఉన్న భూపాలపల్లిని జయశంకర్ సార్ పేరుతో జిల్లా కేంద్రం చేసుకోవడం జరిగిందని, ఒకానొకప్పుడు ఉమ్మడి జిల్లాలో కేవలం ఒకటే మెడికల్ కాలేజీ ఉండగా కేసీఆర్ పాలనలో ఉమ్మడి జిల్లాకు ఐదు మెడికల్ కాలేజీలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. అదొక్కటే కాకుండా జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియజేశారు. బీఆర్‌ఎస్ పాలనలో అనేక మంచి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వాటిని క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయనందునే గత అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో ఓటమిపాలవడం జరిగిందని, ఇలాంటివి పునరావృతం కాకుండా పార్టీ కార్యకర్తలు చూసుకుని ముందుకెళ్లాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, జిల్లాలో బీఆర్‌ఎస్ జండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలని అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని సూచించారు. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి కి పూర్తిగా బాధ్యతలు ఇస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి 2018 ఎన్నికల్లో ఓటమిపాలైనా, కెసిఆర్ చొరవ తీసుకొని ఎమ్మెల్సీగా నియమించారని, ఇక్కడ కాంగ్రెస్ లో ఉన్న గండ్ర వెంకటరమణారెడ్డి ని తానే పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలియజేశారు. అందరూ కలిసికట్టుగా పార్టీని ముందుకు తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలనే డిమాండ్ తో నిరాహార దీక్ష చేపడుతానని చెప్పగా, స్పందించిన కేటీఆర్ మాట్లాడుతూ కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి ఈ విషయం చర్చించి చెబుతానని గండ్ర వెంకటరమణారెడ్డికి సూచించారు.

### మొగుళ్లపల్లిలో కొమురయ్య విగ్రహావిష్కరణ..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ చేతుల మీదుగా కొడారి కొంరయ్య యాదవ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇస్సిపేటలో కొడారి కొంరయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన పెద్ద కుమారుడు తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్ యాదవ్, రెండవ కుమారుడు కొడారి రఘుపతి, మూడవ కుమారుడు కొడారి రాజులు గ్రామ ప్రజల కోరిక మేరకు గ్రామంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

# డ్రామాలు బంద్ చేయండి

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
- బిఆర్‌ఎస్ నాయకులకు హెచ్చరిక



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** బీఆర్‌ఎస్ నాయకులు డ్రామాలు బంద్ చేయాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నేతలు ముఖ్యంగా జగదీశ్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డిలు క్యారెక్టర్ ఆర్టిస్టుల్లాగా వ్యవహరిస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. వారు మాట్లాడే విషయంలో ఎలాంటి అర్థం ఉండదని కేటీఆర్ హరీష్ రావు ఏవైనా మాట్లాడిన తర్వాత వచ్చే గ్యాప్‌లో వీరు మధ్య మధ్యలో క్యారెక్టర్ ఆర్టిస్టుల్లో వచ్చి ఏదో ఒకటి మాట్లాడి వెళ్లిపోతుంటారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నారని ఆయన దేశానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కేసీఆర్ పోల్చలేమని కెసిఆర్ కంటే అనేక రెట్లు రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం కోసం తెలంగాణ అభివృద్ధి కోసం పోరాడుతున్న నాయకుడని దేశమంతా గుర్తించిందని అన్నారు ఇక కేటీఆర్ ను ఎవరు గుర్తించారని గోబెల్స్ ప్రచారం చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు కేటీఆర్ కు స్వతంత్రంగా గుర్తింపు లేదని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రుల ఫోన్లు టాప్ చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించడంలో అర్థం లేదని అన్నారు మా మంత్రులు అందరం ఐక్యంగా ఉన్నామని అన్నారు అసలు తెలంగాణ రాదు అని కెసిఆర్ స్వయంగా జగదీశ్ రెడ్డి తో చెప్పారని దానికి జగదీశ్ రెడ్డి సాక్ష్యం అని అన్నారు ఆ పార్టీ నాయకులు పులి అని అంటున్నారని కానీ నల్లగొండ జిల్లా ప్రజలను అడిగితే తెలుస్తుంది అని అన్నారు ఎలుగుబంటి అని విమర్శించారు ఎందుకంటే ఆయన ఎప్పుడూ కిందికి చూసే నడుస్తారని ఎద్దేవా చేశారు కౌశిక్ రెడ్డి ఇప్పుడు ఏదో ఒకటి మాట్లాడుతూ దొరల వద్ద మార్కులు కొట్టేయాలని చూస్తారని అవిక పని చేయవని అన్నారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం బందు చేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

# ఆదివాసీలపై మారణ హోమాన్ని నిలిపివేయాలి

- కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి
- పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ రావు

**కాటారం (జనంసాక్షి) :** ఆదివాసీ మారణ హోమాన్ని నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ రావు డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో మధ్య భారతంలో ఆపరేషన్ కగార్ తో సాగుతున్న ఆదివాసుల హననానికి వ్యతిరేకంగా కాటారం మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో ముడిమడుగుల మల్లన్న అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ రావు మాట్లాడుతూ 1996 పేసా చట్టం, 2006 అడవి హక్కుల చట్టాన్ని అమలు పరచకుండ నరమేధాన్ని కొనసాగిస్తూ ఆదివాసీల ఉద్యమాలకు నిశ్శబ్దం చేసి వనరులను కార్పొరేట్ లకు అందించడానికి చేస్తున్న మోడీ, అమిత్ షా చేస్తూన్న ఆర్థిక విధానాలను ఖండించారు. గత పదిహేను నెలల కాలంలో 600 మంది అమాయక ప్రజలను బూటకపు ఎన్ కౌంటర్ పేరిట చంపారని ఆరోపించారు. వేదిక కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ ఆదివాసీ అడవి ప్రాంతంలో సైన్యాన్ని దింపడం కోసం, వనరులను రవాణా చేయడం కోసం రోడ్డును నిర్మించి ఇదే అభివృద్ధి అని ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ఇది ఆదివాసీల అభివృద్ధి కి ఎలాంటి ఉపయోగం లేదని కనీసం వారికీ సైకిల్ లు కూడా లేవని అన్నారు. అంతే కాకా భేటీ బచావో భేటీ పడావో అని నినాదం ఇస్తూ అడవిలో ఆడబిడ్డలను చంపుతున్నారని అన్నారు. మావోయిస్టు పార్టీ తో తప్పనిసరిగా చర్చలు జరిపి ఉద్యమకారుల, ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలని, అంతేకాకుండా మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి శాంతి చర్చలు జరిపి ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగ భూషణం, పీడీఎం రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి,సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య,వేదిక కో కన్వీనర్ మర్వాడీ సుదర్శన్, వరంగల్ సీఎల్‌సీ కార్యదర్శి సారంగపాణి,బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తగరం శంకర్ లాల్, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు ఐతే బాపు, బాలసాని రాజయ్య, గుమ్మడి కొమురయ్య, రామిల్ల బాపు టి.రత్నకుమార్, తాళ్లపల్లి లక్ష్మణ్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకరి మల్లేష్,గడ్డం లక్ష్మణ్,ఎరుకల రాజన్న, పొన్నం రాజమల్లయ్య,నారా వినోద్, దుర్గం నగేష్, రైతు కూలి, స్వామి సంఘం నాయకులు ఎల్. భీమన్నా, ప్రజా ఫ్రంట్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీక కిరణ్, పార్వతక్క,మంచిర్యాల జిల్లా కార్యదర్శి జైపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రమేష్ ప్రశ్నలకు జవాబు చెప్పు

**కేటీఆర్‌కు కాంగ్రెస్,బీజేపీ నేతల డిమాండ్**

**హైదరాబాద్(జనంసాక్షి):** కాగా తెలంగాణ పదాన్ని పార్టీ నుంచి తీసి భారత రాష్ట్ర సమితిగా మార్చుకున్నప్పుడే రాష్ట్రంతో ఆ పార్టీకి బంధం తెగిపోయిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రాన్నిచ్చిన సోనియా గాంధీ వద్ద తెరాస (ఇప్పటి భారత రాష్ట్ర సమితి)ను విలీనం చేస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని, పదేళ్లు అధికారంలో ఉండి ఆంధ్రప్రదేశ్ వ్యాపారులకే కాంట్రాక్టులు ఇచ్చారని విమర్శించారు. "కేటీఆర్.. పార్టీ విలీనం కోసం భాజపా ఎంపీ సీఎం రమేశ్ ఇంటికి మీరు వెళ్లారా? లేదా? కవితపై ఉన్న ఈడీ, సీబీఐ కేసులు కొట్టివేస్తే భాజపాలో భారత రాష్ట్ర సమితిని విలీనం చేస్తామని చెప్పారా లేదా? భారత రాష్ట్ర సమితి ఒక అవినీతి పార్టీ అని.. ఆ పార్టీ విలీనం వద్దంటే వద్దని భాజపా పెద్దలు అన్న మాట వాస్తవమా కాదా?మీరు సమాధానం చెప్పాలి. కొన్ని సామాజిక వర్గాలను కూడా మీరు తిట్టినట్లు సీఎం రమేశ్ చెప్పారు. విషయాన్ని పక్కదారి పట్టించకుండా ధైర్యం ఉంటే సీఎం రమేశ్‌కు సమాధానం చెప్పాలి. కేటీఆర్ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనించాలి"అని ఆది శ్రీనివాస్ అన్నారు.

# భూవివాదంలో దళితులపై దాడి

**పొలం గట్టు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ**

**ఇరువర్గాలపై కేసులు నమోదు : సీఐ టాటాబాబు**



**రాజోలి, జులై 27 (జనంసాక్షి) :** పొలం గట్టు సరిహద్దు ఘర్షణలో దళిత కుటుంబంపై అగ్రవర్ణానికి చెందిన వర్గం దాడిచేసిన సంఘటన ఆదివారం కొంకల గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రాజోలి మండలంలోని పెద్ద తాండ్రపాడు గ్రామానికి చెందిన ఇశ్రాయేలు, అదే గ్రామానికి చెందిన నారాయణ గౌడ్ కొంకల గ్రామ శివారులో ఇద్దరికి పక్కపక్కనే పొలాలు ఉన్నాయి. వీరికి కొంత కాలంగా భూ సరిహద్దు వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఇశ్రాయేల్ కుటుంబంతో పొలానికి వెళ్లారు. ప్రతి ఏటా పొలం గట్టును కొంచెం కొంచెం జరుపుతూ తమ పొలంలోకి నారాయణ గౌడ్ వస్తున్నాడని మాత్రమే అడగామని ఇశ్రాయేల్ చెప్పారు. ఈ కారణంతోనే తమపై దాడి చేశారని ఆరోపించారు. తనతో పాటు తన భార్య సత్యమ్మ, ఇద్దరు కుమారులు బాబు, అజయ్ పై, నారాయణ గౌడ్ వర్గం సభ్యులే గొడవకు దిగి తన వర్గంతో కలసి వేట కొడవలితో దాడికి తెగబడ్డారని సత్యమ్మ ఆరోపించారు. ఈ విషయంపై శాంతినగర్ సీఐ టాటాబాబు వివరణ కోరగా..దాడి సమయంలో తీసిన వీడియోలు వైరల్ కావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. పరస్పర ఫిర్యాదులతో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# మేడ్చల్‌లో భర్త హత్యకు భార్య కుట్ర!


**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇటీవల కాలంలో కట్టుకున్న భర్తలను హత్య చేయించడం ట్రెండింగ్‌గా మారిందనకుందో ఏమో.. ఓ మహిళ. తాను కూడ అదే జాబితాలో చేరిపోవాలనుకుందో తెలీయదు కాని, తాను సైతం కిరాయి మనుషులతో భర్తను చంపించాలనుకుంది. అయితే నూకలు గట్టిగా ఉండటంతో బాధిత భర్త బతికి బయటపడటంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, పెద్దగూడెం తండాకు చెందిన నానావత్ రాందాస్ అనే వ్యక్తితో సమీపంలోని మర్రికుంటకు చెందిన జ్యోతి అనే మహిళకు 2009లో వివాహమైంది. వివాహనంతరం దంపతులు బతుకుదెరువు కోసం నగరంలోని బాలానగర్ ప్రాంతానికి వచ్చి కూలిపనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ క్రమంలో మూడేండ్ల క్రితం దంపతుల మధ్య విబేధాలు తలెత్తడంతో జ్యోతి తన భర్తపై వనపర్తి పీఎస్‌లో గృహహింస కేసు పెట్టింది. అప్పటినుండి రాందాస్ తన సొంత తండాలో ఉంటుండగా జ్యోతి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఒంటరిగా ఉంటూ ప్రగతినగర్ లోని జగన్ స్టూడియో సమీపంలో జొన్నరొట్టెలను విక్రయిస్తూ జీవిస్తుంది. తమ కూతుర్లు ఇద్దరిని తన తల్లిగారి ఇల్లు మర్రిగూడ వద్ద ఉంచింది. ఈ క్రమంలో నెలరోజుల క్రితం జ్యోతి పెద్దమనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందంలో తాను భర్తతో కలిసి ఉంటానని ఒప్పుకుంది. అప్పటినుండి రాందాస్ తన భార్య జ్యోతితో కలిసి రాజీవ్ గృహకల్పలో నివాసముంటూ కూలీపనులకు వెళుతున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పనికి వెళ్లి వచ్చి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న రాందాస్ వద్దకు ఓ వ్యక్తి వచ్చి మీ భార్య జ్యోతి జగన్ స్టూడియో వద్ద రొట్టెలు విక్రయించే చోటుకు రమ్మంటుందని చెప్పగా ఆయన అక్కడకు వెళ్లాడు. రాత్రి 9:30 గంటల సమయంలో ఓ యువకుడు బైక్‌పై అక్కడకు వచ్చి రాందాస్‌ను మందు తాగుదాం రమ్మంటూ పిలిచాడు. తాను అప్పటికే తాగి ఉన్నానని, నేనెక్కడకి రానని సమాధానం ఇవ్వగా జ్యోతి కలుగజేసుకుని తెలిసిన వారే కదా..! వెళ్లి రా పో' అంటూ బలవంతపెట్టింది. దీంతో తప్పనిసరి పరిస్థితిలో రాందాస్ ఆతని వెంటవెళ్లగా ఇద్దరు కలిసి సాయినగర్ కమాన్ వద్ద ఉన్న వైన్ షాపులో రెండు బీర్లు కొనుగోలు చేశారు. అనంతరం అక్కడి నుండి ఇద్దరు కలిసి బౌరంపేట్ ఇందిరమ్మ ఇండ్లకు వెళ్లే దారిలో ఉన్న సర్కిల్ వద్దకు వెళ్లారు. అక్కడ రాందాస్ ఒక్కడిచే రెండు బీర్లు తాగించారు. ఈ లోగా మరో ఇద్దరు వ్యక్తులు ఆక్కడకు చేరుకున్నారు. తాగిన మైకంలో ఉన్న రాందాస్ పై దాడిచేసి బీర్ సీసాలతో తలపై బలంగా మోదారు. దీంతో బాధితుడు స్పృహ తప్పడంతో సదరు వ్యక్తులు అక్కడి నుండి పారిపోయారు. అనంతరం రాత్రి 12 గంటల ప్రాంతంలో బాధితుడు రాందాస్ సమీపంలో నివాసం ఉంటున్న తన సోదరుడి ఇంటికి వెళ్లి జరిగిన విషయం వివరించాడు. ఆదివారం ఉదయం బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే బాధితుడు నివాసముంటున్న నిజాంపేట రాజీవ్ గృహ కల్ప సముదాయం బాచుపల్లి పిఎస్ పరిధిలోకి వస్తుం డగా దాడి జరిగింది మాత్రం దుండిగల్ పిఎస్ పరిధిలోకి వస్తుందంటూ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు కేసును దుండిగల్ పిఎస్ కు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కాగా తనను హత్య చేయాలన్న ఉద్దేశంతోనే జ్యోతి ఇతరులతో కలిసి పన్నాగం పన్నిందని రాందాస్ ఆరోపించారు.

# జూ సూపర్‌వైజర్‌పై ఆడ పులి దాడి

**తిరువనంతపురం (జనంసాక్షి) :** కేరళ రాజధాని తిరువనంతపురంలోని జూపార్కులో దారుణం జరిగింది. ఓ ఆడ పులి జూపార్కు సూపర్‌వైజర్‌పై ఆదివారం దాడి చేసి గాయపరిచింది. వివరాల్లోకి వెళ్తే.. జూపార్కు సూపర్‌వైజర్ రామచంద్రన్ నాయర్ విధుల్లో భాగంగా.. పులి ఎన్‌క్లోజర్‌కు సమీపంలో ఉండి క్లీనింగ్ పనులను పర్యవేక్షిస్తున్నారు. అంతలోనే ఆడపులి బబిత తన ఎన్‌క్లోజర్ నుంచి తప్పించుకుని బయటకు వచ్చి సూపర్‌వైజర్‌పై దాడి చేసింది. ఈ దాడిలో ఆయన తలకు తీవ్రమైంది. అప్రమత్తమైన సిబ్బంది.. పులిని మళ్లీ ఎన్‌క్లోజర్‌లో బంధించారు. గాయపడిన రామచంద్రన్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆయనను తిరువనంతపురం మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. సూపర్‌వైజర్ తలకు నాలుగు కుట్లు పడ్డాయని, ఆయనకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఈ ఆడపులిని 2024 ఏప్రిల్‌లో వయనాడ్ నుంచి తిరువనంతపురానికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

# వ్యవసాయ కూలీలతో మంత్రి సీతక్క

**హైదరాబాద్ (జనంసాక్షి) :** వరి నాట్లు వేసే కూలీలను మంత్రి సీతక్క ఆప్యాయంగా పలుకరించారు. బురద పొలంలోకి దిగి కూలీల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వర్షం నుంచి రక్షణకై ప్రత్యేకంగా తయారు చేసిన కవర్లను కూలీలకు పంపిణీ చేశారు. స్వయంగా కవర్లను కూలీలకు తొడిగారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. రెండు మూడు రోజుల్లో అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు. స్వయంగా మంత్రి తమ వద్దకు వచ్చి వలకరించడంతో కూలీలు ఆనందం వ్యక్తం చేశారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370